ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ


తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
17-6-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 136 పేజీలు: 12 వెల: 6.50

అధికార లాంఛనాలతో రూపానీ అంత్యక్రియలు
బాణాసంచా ఫ్యాక్టరీలో పేలుడు, ఆరుగురి మృతి
5లో

# రాష్ట్రంలో 'రక్షణ' పెట్టుబడులు

## రూ. 30 వేల కోట్ల పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా త్వరలో కొత్త డిఫెన్స్ పాలసీ

## పరిశ్రమల కోసం 15 వేల ఎకరాలు కేటాయింపు: సిఎం చంద్రబాబు



**విజయవాడ,జూన్16,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం రక్షణ రంగంలో (డిఫెన్స్) పెట్టుబడులకు కోసం ప్రణాళికలు సిద్ధం చేసింది. రూ.30,000 కోట్ల పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా త్వరలోనే నూతన డిఫెన్స్ పాలసీని ప్రకటించనున్నట్లు సిఎం చంద్రబాబునాయుడు వెల్లడించారు. ఇందుకు సంబంధించి సిఎంవో నుంచి కీలక సమాచారం ప్రకటించింది. డిఫెన్స్ ప్రణాళికలో నాలుగు రక్షణ రంగ పారిశ్రామిక నోడ్‌లు ఏర్పాటు చేసేందుకు మార్గదర్శకాలు దానిలో పొందుపరిచింది. రూ.30 వేల కోట్ల పెట్టుబడులే టార్గెట్‌గా రక్షణ రంగ ప్రణాళికలో స్పష్టం చేసారు. అవసరమైన పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త డిఫెన్స్ పాలసీ అమలులోకి రానున్నది. ఈ పాలసీ ద్వారా రాబోయే ఐదేళ్లలో సుమారు 30 వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించాలని నిర్దేశించింది. ఇందుకు వీలుగా పెట్టుబడులతో వచ్చే పరిశ్రమలకోసం సుమారు 15,000 ఎకరాలను సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దేశంలో రెండు రక్షణ రంగ పరిశ్రమల కారిడార్‌లను కేంద్రం అభివృద్ధి చేస్తోంది. ఇప్పటికే వాటిని ఇతర రాష్ట్రాలకు కేటాయించింది. ఈ రంగంలో మరో కారిడార్‌ను కేంద్రం అనుమతించే అవకాశం లేదు. దీంతో కారిడార్‌లకు ప్రత్యామ్నాయంగా డిఫెన్స్ నోడ్‌లను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈపాలసీద్వారా ఎలక్ట్రానిక్స్, డిఫెన్స్, ఏరోస్పేస్ రంగాలకు సంబంధించిన పరిశ్రమల ఏర్పాటుకువీలుగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలనుకుంటుంది. ఈ పాలసీని సిఎం చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఆ దిశలో ఆయన రక్షణ రంగం పెట్టుబడులపై పూర్తి దృష్టిని కేంద్రీకరించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో నాలుగు రక్షణ రంగ పారిశ్రామిక నోడ్‌ల అభివృద్ధికి కొత్త పాలసీలో మార్గదర్శకాలను సిద్ధంచేసినట్లు అధికారులు చెబుతున్నారు.

అనంతపురం జిల్లా లేపాక్షి నుంచి కర్నూలు జిల్లా ఓర్వకల్ మధ్య భారీ నోడ్‌ను అభివృద్ధి చేయాలని భావిస్తున్నారు. దీన్ని జాతీయ రహదారికి అనుసంధానంగా ఏర్పాటు చేయనున్నారు. బెంగళూరుకు దగ్గరగా ఉన్న ప్రాంతం కావడంతో రక్షణ రంగ పరిశ్రమల ఏర్పాటుకు దిగ్గజ సంస్థలను ఆకర్షించే అవకాశం ఉంటుందని భావిస్తుంది. నెల్లూరు దొనకొండ మధ్య మరో నోడ్ అభివృద్ధికి అధికారులు ప్రతిపాదించారు. దొనకొండ దగ్గర భారీ విస్తీర్ణంలో ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నాయి. రామాయపట్నం పోర్టుకు దగ్గరగా నోడ్‌ను అభివృద్ధి చేయడం వల్ల ఎగుమతులకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. విశాఖపట్నం దగ్గర మరో నోడ్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తుంది. దీని కోసం కనీసం 2 వేల ఎకరాలను సేకరించాలని భావిస్తున్నారు. జగ్గయ్యపేట దగ్గర మరో డిఫెన్స్ నోడ్‌ను అధికారులు ప్రతిపాదించారు. దీనికోసం సుమారు 2 వేల ఎకరాలను ఇప్పటికే గుర్తించినట్లు అధికారులు చెబుతున్నారు. నవరత్నాల్లో ఒకటిగా ఉన్న భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సత్యసాయి జిల్లా పాలసముద్రం దగ్గర డిఫెన్స్ సిస్టం ఇంటిగ్రేటెడ్ కాంప్లె >>2



సోమవారం ప్రధాని మోడీకి పురస్కారం బహూకరిస్తున్న సైప్రస్ అధ్యక్షుడు నికోస్

# ప్రధాని మోడీకి సైప్రస్ అత్యున్నత పురస్కారం

## 140 కోట్ల భారతీయులకు అంకితం: ప్రధాని

**నికోసియా, జూన్ 16:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విదేశీ పర్యటనకు వెళ్లిన విషయం విదితమే. మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రస్తుతం ప్రధాని మోడీ సైప్రస్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా మోడీకి అరుదైన గౌరవం లభించింది. ఆదేశ అత్యున్నత పురస్కారంతో మోడీని అక్కడి ప్రభుత్వం సత్కరించింది. సైప్రస్ అత్యున్నత పురస్కారం 'ది గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ మకారియోస్'ను ప్రధాని మోడీ అందుకున్నారు. ఈ అవార్డుతో >>2



# హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం కేంద్రమంత్రి పీయూష్ గోయెల్ పర్యటన రద్దు

**తిరుమల,జూన్ 16ప్రభాతవార్తప్రతినిధి:** రెండురోజుల తిరుమల, తిరుపతిజిల్లా పర్యటనలో సోమవారం ఉదయం కేంద్రమంత్రి పీయూష్‌గోయల్ కృష్ణపట్నం వెళ్లాల్సిన కార్యక్రమం ఉన్నా, హెలికాప్టర్‌లో సాంకేతిక సమస్యతో పర్యటన రద్దయ్యింది. ఆయన హెలికాప్టర్‌లో ఎక్కిన తరువాత ముందుగానే పైలట్ ఈ సమస్యను గుర్తించడంతో ఉన్నఫళంగా రద్దయ్యింది. కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్‌గోయల్ సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం 8గంటలకు తిరుచానూరు పద్మావతిఅమ్మవారి దర్శనానంతరం ఆయన తిరుపతి విమానాశ్రయం నుండి కృష్ణపట్నం పోర్టు సందర్శనకు వెళ్లాల్సి ఉంది. ఆయన కార్యక్రమం నిర్ణయించారు. >>2

# కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ టిడిపి కైవసం



చెన్నుబోయిన చిట్టిబాబు

**విజయవాడ, జూన్16, ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లాలో మరో మున్సిపాలిటీని తెలుగు దేశం పార్టీ కైవసం చేసుకుంది. కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను తెలుగుదేశం పార్టీ దక్కించుకుంది. చైర్మన్‌గా టిడిపికి చెందిన చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్మన్‌గా చుట్టుకుదురు శ్రీనివాస్ >>2

# కేబినెట్ భేటీ 24కు వాయిదా

**విజయవాడ,జూన్16,ప్రభాతవార్తప్రతినిధి:** కేబినెట్ భేటీ వాయిదా పడింది. ఈ నెల విశాఖ నగరంలో 21న యోగాడే ఏర్పాట్ల నేపథ్యంలో 19న జరగాల్సిన కేబినెట్ భేటీ వాయిదా పడింది. ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.,విజయానంద్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసారు. ఈ నెల 24న సచివాలయంలో సిఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రిమండలి సమావేశం జరుగుతుంది. అమరావతి నగర నిర్మాణం పనులు, పోలవరం -బనకచర్లతో పాటు, రెవెన్యూ సంబంధిత అంశాలపై మంత్రి మండలి చర్చించి నిర్ణయం తీసుకుంటారు. ప్రస్తుతం యోగా డే సందర్భంగా సోమవారం సిఎం చంద్రబాబు విశాఖలో పర్యటిస్తున్నారు. ప్రధాని నరేంద్రమోడీ స్వయంగా పాల్గొంటున్న ఈ యోగాడే ఏర్పాట్లు సీఎం చంద్రబాబు స్వయంగా పర్యవేక్షణ చేయనున్నారు.

# మత్స్యకారుల కుటుంబాలకు అండ

## ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు పరిహారం: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** జీవనభృతి కోసం సముద్రంలో చేపలు వేటకు వెళ్లిన ఇద్దరు మత్స్యకారులు కోనసీమ జిల్లా అంతర్వేది వద్ద బోటు నుంచి జారిపడి మృతి చెందిన కృష్ణాజిల్లా నాగాయిలంక మండలంకు చెందిన ఇద్దరు,నాగిడి రాము,గుల్లదామోదర గ్రామం, తమ్ము పోతురాజు, సంగమేశ్వర గ్రామానికి చెందిన మత్స్యకారుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవతో ప్రభుత్వం నుంచి పరిహారాన్ని ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.5 లక్షలు, మత్స్య శాఖ నుంచి రూ.5 లక్షల పరిహారాన్ని ప్రకటించింది. మొత్తంగా ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు అందించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మృతుని కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చింది. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని, మత్స్యకారులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు సలహాలు ఇచ్చి ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు.

# ఆరుగురుకంటే పిల్లలుంటే.. వారికి త్వరలో జమ

## తల్లికి వందనం డబ్బుపై వివరించిన మంత్రి లోకేష్

## అర్హతలన్నీ పరిశీలించి డబ్బు జమ చేస్తున్నామని వెల్లడి

**విజయవాడ.జూన్16,ప్రభాతవార్తప్రతినిధి:** తల్లికి వందనం పథకం లబ్దిదారులందరికి వారి ఖాతాల్లో డబ్బు జమచేస్తున్నామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. అర్హతలన్నింటిని క్షుణంగా పరిశీలించిన తరువాత బ్యాంకుల డబ్బు జమచేసామన్నారు. ఆరుగురు కంటే ఎక్కువ పిల్లలున్న తల్లులు, అనాథ శరణాలయాల్లో ఉంటున్న పిల్లలకు తల్లికి వందనం పథకం డబ్బులు ఇంకా జమచేయలేదన్నారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలన చేసిన తరువాతే వారికి నిధులు విడుదలవుతాయని మంత్రి లోకేష్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో చేసిన ట్వీట్‌లో పేర్కొన్నారు. తల్లికి వందనం సూపర్ సక్సెస్ అని, తల్లుల కళ్లలో ఆనందం చూసి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కడుపు మంట మూడింతలు పెరిగిందని విమర్శించారు. జగన్ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలే అందరూ చేస్తారనుకుంటే ఎలా? అని ప్రశ్నించారు. ఈ విషయంలో దుష్ప్రచారాలని నమ్మవద్దన్నారు. తల్లికి వందనం లబ్దిదారులకు వారి ఖాతాల్లో డబ్బు జమచేయడానికి ఎవరైనా ఇబ్బందులు పెడితే గ్రామ/ వార్డు సచివాలయాల వద్ద ఫిర్యాదు చేయాలన్నారు.



ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎంత మంది చదువుకునే పిల్లలు ఉంటే అందరికీ రూ.13,000 చొప్పున ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. ఒక్కో విద్యార్థికి సంబంధించి మిగతా 2000 రూపాయలను పాఠశాలల నిర్వహణ నిధి కింద ఖర్చు చేస్తామని స్పష్టం చేశారు. డబుల్ ఇంజిన్ సర్కారు ఆధ్వర్యంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెడ్లుగా పరుగులు పెట్టిస్తామని లోకేశ్ అన్నారు.

67 లక్షల మందికి తల్లికి వందనం ఇస్తున్నామని దానికి రూ.10,091 కోట్లు ఖర్చు అవుతుంది వివరించారు. ఈ నిధుల నుంచి స్కూళ్ల డెవలప్‌మెంట్‌కు రూ.1,346 కోట్లు వెళ్తాయని అన్నారు. అమ్మ ఒడి మార్గదర్శకాలే పాటిస్తూ అదనంగా ఎంతమంది పిల్లలున్నా ఇవ్వాలని నిర్ణయించామని వెల్లడించారు. గతప్రభుత్వం 42,61,965 మందికి అమ్మ ఒడి ఇచ్చిందని కాని కూటమి ప్రభుత్వం 67,27,164 మందికి తల్లికి వందనం ఇస్తున్నామని వెల్లడించారు. అలానే ఈ పథకానికి గత ప్రభుత్వం రూ.5,540 కోట్లు ఖర్చుపెడితే తాను రూ.8,745 కోట్లు ఇస్తున్నామని మంత్రి అన్నారు.

**ఫిర్యాదులకు జూన్ 26 వరకు గడువు:** ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం అమలు చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ఒకే బిడ్డ ఉన్న తల్లులు 18,55,760, ఇద్దరు బిడ్డలు ఉన్న తల్లులు 14,55,322, ముగ్గురు >>2



సోమవారం నలగాంపల్లి వద్ద హైవేపై రోడ్డెక్కిన మామిడి రైతులు

# రోడ్డెక్కిన మామిడి రైతులు

## పర్మిట్లు జారీ చేయని పల్ప్ ఫ్యాక్టరీ యాజమాన్యం

**బంగారుపాళ్యం, జూన్ 16 ప్రభాతవార్త:** మామిడి రైతులు మామిడి పంటను పల్ప్ ఫ్యాక్టరీకి తరలించడానికి అవసరమైన పర్మిట్లను పల్ప్ ఫ్యాక్టరీ యాజమాన్యం జారీ చేయకపోవడంతో మామిడి రైతులు ఆగ్రహించారు. ప్రభుత్వం మామిడి రైతులకు సత్వరం పర్మిట్లు జారీ చేసి పంటను కొనుగోలు చేయాలని స్పష్టంగా ఆదేశించినప్పటికీ పల్ప్ ఫ్యాక్టరీలు ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుండటంపై రైతులు ఒక్కసారిగా రోడ్డెక్కారు. తమకు సత్వరం న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.

వివరాలిలా వున్నాయి. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం నలగాంపల్లి వద్ద వున్న సన్ గోల్డ్ పల్ప్ ఫ్యాక్టరీ మామిడి పల్ప్‌ను ప్రతి ఏడాది తయారు చేస్తోంది. ఈ సీజన్‌లో ఈ ఫ్యాక్టరీకి సైతం మామిడి కాయల కొనుగోలు చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అలాగే మండలంలో మొగిలి సమీపంలో శ్రీని ఫుడ్ పార్క్‌కు సైతం మామిడి పల్ప్ తయారీకి అవసరమైన మామిడి దిగుబడిని కొనుగోలుకు ప్రభుత్వం అనుమతి జారీ చేసింది. అయితే శ్రీని ఫుడ్ పార్క్‌లో గత ఏడాది తయారు చేసిన మామిడి పల్ప్ నిల్వలు అలాగే వుండటంతో ఇప్పటి వరకు ఈ ఫ్యాక్టరీ నందు పల్ప్ తయారీకి యాజమాన్యం ముందుకు రాలేదు. దీంతో మిగిలిన ఏకైన పల్ప్ ఫ్యాక్టరీ నలగాంపల్లి వద్దవున్న సన్ గోల్డ్ ఫ్యాక్టరీ కావడంతో రైతులందరు తమ కాయలను ఈ ఫ్యాక్టరీకి తరలించడానికి పూనుకున్నారు.

తమ సామర్థ్యంకుమించి మామిడి కాయలు చేయడం కష్టసాధ్యంగా వుందని ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు వివరించినప్పటికీ మండలంలో ఒకే ఫ్యాక్టరీ వుండటంతో మామిడి దిగుబడిని రైతులందరు ఈ ఫ్యాక్టరీకి తరలించడానికి పూనుకున్నారు. గత రెండురోజులుగా ఫ్యాక్టరీ ఆవరణలో రోడ్డుకు ఇరువైపులా మామిడి కాయల లోడ్లతో ట్రాక్టర్లు నిలిచిపోవడం జరిగింది. >>2



సోమవారం టెల్‌అవివ్‌లో ఇరాన్ మిసైల్ పడిన బెనిబార్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఇజ్రాయెల్ పోలీసులు

# ఆగని సమరం.. ప్రతీకార దాడులు ముమ్మరం

## ఇజ్రాయెల్‌పై 370 బాలిస్టిక్ క్షిపణులు, వందలాది డ్రోన్లతో టెహ్రాన్ దాడి

## ఇరాన్ సుప్రీం ఖమేనీ హత్యకు ఇజ్రాయెల్ వ్యూహం

## ఆయుధాలు సరఫరా చేస్తున్న ట్రక్కులు ధ్వంసం

**టెల్‌అవీవ్, జూన్ 16:** ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఘర్షణలు నాలుగో రోజుకు చేరుకున్నాయి. అయితే ఇరాన్ తన ప్రతిదాడిలో భాగంగా ఇప్పటివరకు 370 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. దీంతోపాటు వందలాది డ్రోన్లను ఇజ్రాయెల్ మీదకు వదిలినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి కార్యాలయం కూడా ధ్రువీకరించింది. సోమవారం ఉదయం వరకు ఇజ్రాయెల్‌లో 24 మంది మరణించారు. మరో 59 మంది గాయపడ్డారు. వీరిలో పది మంది పరిస్థితి విషమంగా ఉన్నది. ఇరాన్ ప్రయోగించిన ప్రొజెక్టయిల్స్.. ఇజ్రాయెల్‌లోని 30 ప్రాంతాలను ధ్వంసం చేశాయి. అయితే శుక్రవారం నుంచి జరుగుతున్న దాడుల్లో.. ఇజ్రాయెల్ దాడుల వల్ల ఇరాన్‌లో 224 మంది మరణించారు.

ఇరాన్‌కు చెందిన మిలటరీ చీఫ్‌లను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకుని హతమార్చిన విషయం విదితమే. అయితే ఇరాన్ సుప్రీం నేత అయాతొల్లా ఖమేనీ హత్యకుకూడా ఇజ్రాయెల్ ప్రణాళిక చేసినట్లుతెలిసింది. కానీఆ ప్లాన్‌ను >>2

# ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు

## దాదాపు 67 లక్షల మందికి 'తల్లికి వందనం' అమలు: మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,జూన్16,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మహిళల ఉచిత బస్సు ప్రయాణం ఆగస్టు15నుంచి అమలులోకి వస్తుందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. సిఎం చంద్రబాబు ఎన్నికల సందర్భంగా చేసిన ప్రతి వాగ్దానాన్ని ప్రణాళికబద్ధంగా అమలు చేస్తునారన్నారు. ఎన్ని ఇబ్బందులున్నా, ఎన్ని కష్టాలున్నా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందని, అందుకు నిదర్శనమే తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి బిడ్డకీ రూ.15 వేల చొప్పున నిధులు జమచేయడమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మంత్రి నేడు మీడియాతో మాట్లాడారు. స్కూల్లు తెరిచే నాటికి ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ రూ.15 వేలు ఇస్తామన్న హామీ మేరకు పథకం అమలు చేశాం. గతంలో జగన్ రెడ్డి ఎన్నికల్లో ఓట్లు వేయించుకుని గెలిచాక కోతలు పెట్టి దగా చేశాడు. అందరికీ ఇస్తానన్న హామీకి తూట్లు పొడిచి ఒక్కరికే అని నాలుక మడతవేశారు. కానీ నేడు దాదాపు 67లక్షల మందికి తల్లికి వందనం పథకాన్ని అమలు చేశాం.

స్కూళ్లను మోడల్ స్కూళ్లుగా మార్చి విద్యా విధానంలో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నాం. విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు ఉండేలా నియామకాలకు శ్రీకారం చుట్టాం. తాజాగా పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ స్కూల్లు సాధించిన ఫలితాలు ప్రభుత్వ పాలనకు నిదర్శనం. రాష్ట్రాన్ని నాలెడ్జ్ కేంద్రంగా మార్చాలని ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా ఫలితాలొచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన తల్లికి వందనం పథకంలో అత్యధిక లబ్దిదారులు బడుగు బలహీన వర్గాల వారే కావడం సంతోషకరం. నలుగురు కంటే పిల్లలున్న వారు దాదాపు 27 వేలమంది ఉంటే వారందరికీ తల్లికి వందనం పథకం అమలైంది. ఒకే కుటుంబంలో 12 మంది పిల్లలుంటే వారికి దాదాపు లక్షన్నరకు పైగా సొమ్ము జమైంది. ఇది >>2



# బనకచర్లను అనుమతించొద్దు

## కేంద్ర పర్యావరణ మంత్రి భూపేంద్రయాదవ్‌కు తెలంగాణ మంత్రి ఉత్తమ్ లేఖ

**హైదరాబాద్, జూన్16,ప్రభాతవార్త:** పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు ఏలాంటి పర్యావరణ అనుమతులు ఇవ్వొద్దని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సోమవారం కేంద్ర పర్యావరణ మంత్రి భూపేంద్ర యాదవ్‌కు లేఖ రాశారు. 2022 సెప్టెంబర్ 6న సుప్రీంకోర్టు గోదావరి పరివాహక రాష్ట్రాలు, కేంద్రజలశక్తి, పర్యావరణ మంత్రిత్వశాఖలు సంయుక్తంగా సమావేశమై పర్యావరణంకు కలిగే ముప్పును చర్చించి ముందుకు పోవాలని సూచించిందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తన లేఖలో కేంద్ర పర్యావరణమంత్రికి ఎత్తిచూపారు. పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు నేషనల్ ప్రాజెక్టుగా ప్రకటించడంపై ఒడిశా, చత్తీస్‌ఘడ్, తెలంగాణ సుప్రీంకోర్టులో వాజ్యం వేశాయని కోర్టుపరిధిలో ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్మాణంకోసం మొత్తం గోదావరి జలవివాదల ట్రిబ్యునల్ అవార్డును ఉల్లంఘించి కడుతోందని దీనిని నిలిపివేయాలని కేంద్ర అడువులు, పర్యావరణ >>2

వార్త, రాజమహేంద్రవరం, మంగళవారం 17, జూన్ 2025



సోమవారం ఢిల్లీలో జరిగిన లీడ్ కమిషనర్ల సమావేశానికి హాజరై ప్రసంగిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

# ఆ ఫోన్లు అప్పగించండి

## కార్ రేస్ సమయంలో వాడిన సెల్ ఫోన్లు 18 లోగా ఇవ్వాలని తెలంగాణ మాజీ మంత్రి కెటిఆర్‌ను ఆదేశించిన ఎసిబి

## లండన్ కంపెనీకి రూ. 50 కోట్లు బదలీ, త్రైపాక్షిక అగ్రిమెంట్, ఎస్‌నెక్స్‌జెన్ కంపెనీ గురించి ప్రశ్నించిన అధికారులు

**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ హయాంలో జరిగిన ఫార్ములా ఈ కార్ రేసు పై ఎసిబి నమోదు చేసిన కేసులో మాజీ మంత్రి కెటిఆర్ రెండవ దఫా విచారణ సోమవారం ముగిసింది. బంజారాహిల్స్‌లోని ఎసిబి ప్రధాన కార్యాలయంలో ఎనిమిది గంటల పాటు జరిగిన ఈ విచారణలో కెటిఆర్‌ను ఎసిబి జాయింట్ డైరక్టర్ రితురాజ్, డిఎస్‌పి మాజీద్ ఖాన్‌ల నేతృత్వంలోని బృందం భిన్న అంశాలపై ప్రశ్నించింది. ఫార్ములా ఈ కార్ రేసు జరిగిన సమయంలో వా డిన సెల్‌ఫోన్లను ఈ నెల 18వ తేదీలోగా తమకు అప్పగించాలని ఎసిబి అధికారులు కెటిఆర్‌ను కోరారు. రాష్ట్రంలో సంచలనం రేపిన ఫార్ములా ఈ కార్ రేసుకు సంబంధించి నాటి మంత్రి కెటిఆర్‌ను ఎసిబి అధికారులు రెండవసారి సుధీర్ఘంగా విచారించారు. ఇం తకు ముందు ఒకసారి కెటిఆర్‌తో పాటు సీనియర్ ఐఎఎస్ అధికారి ఈ కేసులో సహ నిందితుడుగా వున్న అర్వింద్ కుమార్, మరో నిందితుడు బిఎల్ఎన్ రెడ్డి లను ఎసిబి విచారించడం తెలిసిందే. మొదటి దఫా విచారణలో వెలుగు చూసిన సమాచారం ఆధారంగా కెటిఆర్‌ను సోమవారం నాడు రెండవ దఫా విచారిం చారు. ఉదయం పది గంటల సమయంలో బంజారాహిల్స్‌లో గల ఎసిబి ప్రధాన కార్యాలయానికి వెళ్లిన కెటిఆర్ సాయంత్రం ఆరు గంటల సమయంలో బయ టకు వచ్చారు. ఈ సందర్భంగా కెటిఆర్‌ను ఎసిబి అధికారులు అనేక అంశాలపై భిన్న కోణాల్లో విచారించినట్లు తెలిసింది. ఫార్ములా ఈ కార్ రేసుకు సంబంధిం చి అప్పట్లో నారాయణగూడలో గల ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ నుంచి లండన్‌లోని ఎఫ్‌ఈఓ కంపెనీకి నిబంధన లకు విరుద్దంగా బదలీ అయిన 50 కోట్లకు పైగా నగదు గురించి ఎసిబి అధికారులు కెటిఆర్‌ను ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ నగదు క్రిప్టో కరెన్సీ రూపంలో ఎందుకు చెల్లించాల్సి వచ్చిందనే దానిపై ఆయనను ఎసిబి అధికారులు ప్రశ్నించారు. ఫార్ములా ఈ కార్ రేసుకు సంబంధించి విచారణ చేస్తున్న ఎసిబి అధికారులు ఇందులో ఆరు ఉల్లంఘనలు జరిగినట్లు గుర్తించి ఈ అంశాలపైనే కెటిఆర్‌ను ప్రశ్నించినట్లు సమాచారం. ఎఫ్‌ఈఓ కంపెనీకి నగదు చెల్లింపులు జరిపిన సమయంలో నిబంధనలను ఎందుకు పాటించలేదని, ఇం దులో ఎవరికి లాభం చేకూర్చేందుకు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని కెటిఆర్‌ను ఎసిబి అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ రేస్ నిర్వహణలో త్రైపాక్షిక అ గ్రిమెంట్ ఎందుకు జరిగిందని, ఈ అగ్రిమెంట్‌లో ఎస్ నెక్స్ జెన్ అనే కంపెనీని ఎందుకు చేర్చాల్సి వచ్చిందని ఎసిబి అధికారులు కెటిఆర్‌ను ప్రశ్నించారని సమా చారం. ఫార్ములా ఈ కార్ రేసులో ఎస్ నెక్స్ జెన్ కంపెనీ పాత్ర ఏమిటీ...? ఇందులో వచ్చిన లాభం ఎంత...? అని కెటిఆర్‌ను ఎసిబి అధికారులు అడిగారని తెలిసింది. కేవలం రెండు లక్షల క్యాపిటల్‌తో వున్న ఎస్ నెక్స్ జెన్ కంపెనీకి ఇంతపెద్ద బాధ్యతలు ఎలా అప్పగించారు? ట్రై పార్టీ అగ్రిమెంట్‌కు నాలుగు నె లల ముందు ఏర్పాటు చేసిన కంపెనీకి బాధ్యతలు ఇవ్వడం వెనుక మతలబు ఏమిటీ? ఇందులో సర్కారుకు వచ్చిన నష్టం ఎంత...? అని కెటిఆర్‌ను ఎసిబి అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం.

ఈ కార్ రేసింగ్ నిర్వహణలో ఎస్ నెక్స్ జెన్ కంపెనీ చేర్చుకోవడం వల్ల ఇందులో క్విడ్ ప్రోకో వుందనే దానిపై మీ స మాధానం ఏమిటీ? ఎస్ నెక్స్ జెన్ కంపెనీ బిఆర్ఎస్‌కు 49 కోట్ల రూపాయల ఎలక్ట్రోరల్ బాండ్లు ఎందుకు ఇచ్చింది? అని కెటిఆర్‌ను ఎసిబి అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. బిఆర్ఎస్‌కు అందిన 49 కోట్ల కోట్ల రూపాయల ఎలక్ట్రోరల్ బాండ్లు ఒకేసారి కాకుండా 49 సార్లు ఇవ్వడం వెనుకగల కారణాలు ఏమి టీ? తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ పెంచే ఉద్దేశం వుంటే పేరు ప్రతిష్టలు వున్న అనేక కంపెనీలను కాదని చిన్నపాటి సంస్థ అయిన ఎస్ నెక్స్ జెన్ కంపెనీకి ఎం దుకు ప్రాధాన్యం ఇచ్చారు...? అని కెటిఆర్‌ను ఎసిబి అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. ఫార్ములా ఈ కార్ రేస్‌కు సంబంధించి మొదటి రేసులో లాభాలు వ చ్చాయా? నష్టాలు వచ్చాయా...? అని కెటిఆర్‌ను ఎసిబి అధికారులు ప్రశ్నించారు.

ఫార్ములా ఈ కార్ రేసు జరిగిన 2021 నుంచి 2024 మధ్య కాలంలో కెటిఆర్ వాడిన సెల్‌ఫోన్లను వెంటనే తమకు విచారణ నిమిత్తం అప్పగించాలని ఎసిబి అధికారులు కోరగా అవి తన వద్ద ఇప్పుడు లేవని చెప్పారు. ఈ నెల 18 వ తేదీలోగా వాటిని తమకు అప్పగించాలని ఎసిబి అధికారులు కెటిఆర్‌ను కోరారు. అవసరం అయితే మరోసారి విచారణకురావాలని ఎసిబి అధికారులు కెటిఆర్‌నుకోరారు. కెటిఆర్ విచా రణ సమయంలో ఎసిబి ప్రధాన కార్యాలయం సమీపంలో గల నీలోఫర్ కేఫ్‌ను ఎసిబి అధికారులు మూసి వేయించారు.

# మామిడి రైతులు

>> ఫ్యాక్టరీ యాజమాన్యం పర్మిట్ల అనుమతులు ఇవ్వకపోవడంతో రైతులు పడిగాపులు పడుతున్నారు. దీంతో సోమవారం ఉదయం ఫ్యాక్టరీ సమీపంలోని చైన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై మామిడి రైతులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కొద్ది సేపటికే రహదారిపై ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఈ విషయం తెలిసిన వెంటనే తహసిల్దారు రాజేంద్రప్రసాద్, సర్కిల్ ఇన్స్ పెక్టర్ కత్తి శ్రీనివాసులు ఫ్యాక్టరీ వద్దకు చేరుకుని రైతులకు నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. రైతులు ససేమిరా ఒప్పుకోక తమ మామిడి కాయలకు ప్రభుత్వం నిర్ధేశించిన పర్మిట్ల అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీసు, రెవెన్యూ అధికారులు ఫ్యాక్టరీ యాజమాన్యంతో పలు దఫాలు చర్చించి ఈ వారంలోపు రైతులందరికీ రోజువారీగా పర్మిట్లు జారీచేశారు. చివరికి శాంతిం చిన రైతులు ధర్నాను విరమించారు. అనంతరం రహదారిపై ట్రాఫిక్‌ను క్రమబద్ధం చేశారు.

# దాడులు ముమ్మరం

>>విరమించుకోవాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇజ్రాయెల్‌పై వత్తిడి తెచ్చినట్లు భావిస్తున్నారు. ఖమేనీని హతమార్చే ప్లాన్ తమకు లేదని కూడా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ తెలిపారు. టెహ్రాన్‌కు మిస్సైల్ లాంచర్లు తీసుకెళ్తున్న ట్రక్కులపై దాడి చేసినట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ దళంపేర్కొన్నది. ఆయుధాలను తీసుకెళ్తున్న అనేక ట్రక్కులను గుర్తించి.. ఇజ్రా యెల్ వైమానిక దళం వాటిపై దాడి చేసింది. సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్ లాంచర్లతో పాటు ఇతర ఆయుధాలు ఆ ట్రక్కులో ఉన్నాయి.

**ఇజ్రాయెల్ చేతికి ఇరాన్ గోల్డెన్ ఇన్ఫర్మేషన్..**

ఇరాన్ చేపట్టే ప్రతి అణు కదలికపైనా ఇజ్రాయెల్ నిఘా నేత్రాలున్నాయి. అది న్యూక్లియర్ బాంబుకు సంబంధించిన డిజైన్ ప్రాసెస్‌కు సంబంధించి అత్యంత కీలక ప్రయోగం చేసిందనే గోల్డెన్ ఇన్ఫర్మే షన్ వేగుల నుంచి టెల్అవీవ్ నాయకత్వానికి చేరింది. దీంతో టెహ్రాన్‌తలుచుకుంటే కొన్ని వారాల్లో అణుబాంబును రూపొందించగలదని నిర్ధారణకు వచ్చింది. ఇక ఏమాత్రంఉపేక్షించినా తమ అస్తిత్వా నికి ముప్పు వాటిల్లుతుందని ఇజ్రాయెల్ ముందస్తు దాడులకు దిగిందని 'టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్' కథనంలో పేర్కొంది. ఆయుధ శ్రేణి యురేనియం నుంచి ఓ పేలుడు పరికరంగా మార్చేందుకు అవరసరమైన పరికరాలను సిద్ధం చేయడం కోసం పలు వర్కింగ్ గ్రూప్‌లను ఇరాన్ ఏర్పాటు చేసిందని ఆ ఇంటెలిజెన్స్ నివేదిక వెల్లడించింది. హమాస్ ఇజ్రాయెల్‌పై దాడి చేసిన తర్వాత ఈ పరిణామాలు చోటుచేసుకొన్నాయి.

**ఇజ్రాయెల్‌ను తప్పుగా అంచనా వేసిన ఇరాన్ జనరల్స్..**

ఓవైపు అమెరికాతో అణు చర్చలు జరుగుతున్న వేళ ఇజ్రాయెల్ తమపై దాడాచేసే అవకాశం ఉండదని ఇరాన్ జనరల్స్ బలంగానమ్మారు. అదే టెహ్రాన్‌ను తొలి దాడిలో బాగా నష్టపోయేటట్లు చేసింది. ఫలితంగా మిలిటరీలోని పలు సీనియర్ ర్యాంకుల అధికారులు ప్రాణాలు కోల్పోయారు. ఆరో విడత చర్చలకు ఇజ్రాయెల్ దుందుడుగా ఎటువంటి దాడా చేయకపోవచ్చని ఇరాన్ నాయకత్వం నమ్మింది. ఈ క్రమంలో చాలామంది మిలిటరీ కమాండర్లు అజాగ్రత్తగా ఉన్నారు. ఈదాడులను తట్టుకొనే షెల్టర్లలోకాకుండా.. ప్రైవేటుఇళ్లల్లోబసచేసి ప్రాణాలు పోగొట్టుకున్నారు. దీంతోపాటు ఐఆర్‌జిసి ఏరోస్పేస్ ఫోర్స్ కమాండర్ అమిర్అలీ హాజిజాదే కూడా తన సిబ్బందితో సమావేశమయ్యారు. ఇజ్రాయెల్ ఈ మీ టింగ్ జరుగుతున్న బంకర్‌పైనా బాంబులువేసింది. దీంతో అతడితోపాటు సీనియర్ సిబ్బంది చనిపో యారు. తమ ప్రభుత్వంలో ఉన్న ఇజ్రాయెలీ కోవర్టులను చూసి షాకవ్వడం ఇరాన్ వంతైంది.

# పర్యటన రద్దు

>> అయితే ఆయన తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో దర్శనం చేసుకుని విమానాశ్రయం చేరుకున్నారు. అప్పటికే ఆయన వ్యక్తిగత సిబ్బందికి హెలికాప్టర్ సాంకేతిక సమస్యతో భద్రత కారణాల రీత్యా మంచిదికాదని పైలట్ తెలిపారు. హెలికాప్టర్ ఎక్కిన తరువాత సాంకేతిక సమస్య ఉందని గుర్తించడంతో పర్యటన అర్థాంతరంగా రద్ద య్యింది. ఈ విషయాన్ని కేంద్రమంత్రి భద్రత సిబ్బంది నిర్ధారించారు. కృష్ణపట్నం పర్యటన రద్దవడంతో ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఇటీవలకాలంలో దేశంలో విమానాలు ప్రమాదం, సాంకేతిక సమస్యలు, హెలికాప్టర్ సాంకేతిక సమస్యలు ఎదురవు తుండటంతో సోమవారం తిరుపతిలో కేంద్ర మంత్రి హెలికాప్టర్‌కూడాసాంకేతికంగా సమస్య ఉన్నట్లు గుర్తించారు. దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని డిజిపి సంబంధిత అధికారులను ఆదేశించడం విశేషం.

**డిజిపి ఆదేశం**

సిఎం చంద్రబాబు పర్యటనలకు ఉపయోగించే హెలిక్టపర్ అదే కావడంతో దానిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఇంటెలిజెన్స్ చీఫ్‌కు డిజిపి హరీశ్‌కుమార్ గుప్తా ఆదేశాలు జారీ చేశారు.

# పేర్ని నానికి అరెస్ట్ వారెంట్ జారీ

**విజయవాడ జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ మంత్రి వైకాంగ్రెస్‌పార్టీ నేత పేర్ని వెంకట్రామయ్య(నాని) కి అరెస్టు వారెంట్ జారీ అయింది. 2019లో టిడిపి కార్యకర్త చందు శ్రీహర్షపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈకేసులో పేర్ని నాని సాక్షిగా ఉన్నారు. వరుసగా వాయిదాలకు కోర్టులో హాజరు కాకపోవడంతో ఆయనకు మచిలీ పట్నం కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. ఆయన్ని కోర్టులో హాజరుపరచాలని పోలీసు లనుఆదేశించింది. అనంతరం కేసు విచార ణను సెప్టెంబరు 19కి వాయిదా వేసింది.

# పురస్కారం

>> తనను సత్కరించినందుకు సైప్రస్ ప్రభుత్వానికి ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డును 140 కోట్ల భారతీయులకు అంకితం చేస్తున్నట్లు ప్రధాని వెల్లడించారు. అంతేగాక ఇరు దేశాల మధ్య ఉన్న స్నేహానికి అంకితం చేస్తున్నట్లు కూడా ప్రధాని మోడీ ప్రకటించారు. ఆ దేశ అధ్యక్షుడు నికోస్ క్రిస్టో డౌలైడ్స్ ఆహ్వానం మేరకు ప్రధాని సైప్రస్ వెళ్లారు. కాగా గడిచిన రెండు దశాబ్దాల్లో భారత ప్రధాని సైప్రస్ దేశంలో పర్యటించడం ఇదే తొలిసారి కావడంగమనార్హం. ఈ పర్యటనలో ప్రధానిమోడీ.. సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలైడ్స్‌తో భేటీ అయ్యారు. ఇరు దేశాల ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. తర్వాత ప్రధాని కెనడాలో జరుగుతున్న జి-7 సదస్సుకు హాజరుకానున్నారు.

## వారం - వర్జ్యం

తేది : 17-06-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
షష్ఠి మ. 2.43
శతభిషం రా. 12.59
వర్జ్యం ఉ. 8.10-9.45
దు.ఉ. 8.14-9.05 2) రా. 11.57-12.49
రాహుకాలం - మ. 3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** రాజకీయ, కళా, పారిశ్రామిక రంగాలవారికి ప్రోత్సాహకరంగా వుంటుంది. ధనలాభం.

**వృషభం :** ఉద్యోగులకు ఏర్పడిన చికాకులు తొలుగుతాయి. భాగస్వామ్య వ్యాపారాలు ప్రారంభిస్తారు.

**మిథునం:** ప్రత్యర్థుల పై పట్టు సాధిస్తారు. వృత్తి వ్యాపారాలలో లాభాలు సాధిస్తారు.

**కర్కాటకం :** ఆకస్మిక ప్రయాణాలు లభిస్తాయి. సొంత ఆలోచనలతో ముందుకు సాగడం మంచిది.

**సింహం :** ఆర్థిక లావాదేవీలు ఊరట కలిగిస్తాయి. దీర్ఘకాలిక ఋణబాధలు తొలుగుతాయి.

**కన్య:** పనులలో జాప్యం జరిగినా చివరికి పూర్తిచేస్తారు. వివాదాలకు దూరంగా వుండండి.

**తుల :** కుటుంబ సభ్యులనుండి సహాయసహకారాలు అందుతాయి. శుభవార్తలు వింటారు.

**వృశ్చికం:** అనుకోని అతిథులనుండి ఆహ్వానాలు అందుతాయి. సేవా కార్య క్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**ధనుస్సు:** నూతన భాగస్వామ్య వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. కాంట్రాక్టులు దక్కించుకుంటారు.

**మకరం:**వృత్తి - వ్యాపారాలో ఎదురైన ఆటుపోట్లు తొలగించుకుంటారు. ప్రయాణాలు.

**కుంభం :** ప్రత్యర్థులు సైతం మిత్రులుగా మారి సాయం అందిస్తారు. వివాహ యత్నాలు ముమ్మరం చేస్తారు.

**మీనం :** చేపట్టిన కార్యక్రమాలు సాఫీగా సాగుతాయి. ఆర్థిక వ్యవహారాలు సంతృప్తికరంగా

- శ్రీమతి ... శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



సోమవారం తిరుమలలో శ్రీవారి ఆలయంలో ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న కేంద్రమంత్రి గోయల్

# 'వికసిత్‌భారత్'తోనే భారత్ విశ్వగురువుగా ఆవిర్భవిస్తుంది

## శ్రీవారిసేవలో కేంద్రమంత్రి పీయూష్ గోయల్

**తిరుమల,జూన్ 16ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎంచుకున్న 'వికసిత్ భారత్' తోనే దేశం విశ్వగురువుగా ఆవిర్భవిస్తుందని కేంద్రమంత్రి పీయూష్‌గోయల్ అన్నారు. ఇదీ దేశప్రగతికి మరింత వృద్ధిచెందేలా దోహదపడతుం దన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నారని, పారిశ్రామికప్రగతికి కేంద్రం సంపూర్ణమద్దతునిస్తుందని గోయల్ తెలిపారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి పూర్తిసహకారం అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవనప్రమాణాలు మెరుగుపరిచేందుకు సిఎం చంద్రబాబునాయుడు వినూత్న ఆలోచనతో పనిచేస్తున్నారని కితాబిచ్చారు. సోమవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంత్రులు అనగాని సత్యప్రసాద్, టిజి భరత్‌తో కలసి తిరుమల ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ మహద్వారం వద్ద టిటిడి అధికారులు స్వాగతంపలికారు. ఉదయం విఐపి బ్రేక్‌దర్శనాల ప్రారంభసమయంలో వీరంతా కలసి తొలుత ధ్వజస్తంభానికి మొక్కారు. ఆనందనిలయంలోనికి చేరుకుని శ్రీవేంకటేశ్వరస్వామి సేవలోపాల్గొని ఆశీస్సులందుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీవారి క్యాలండర్, శేషవస్త్రం బహుకరించారు. వీరివెంట బోర్డుసభ్యులు డాక్టర్ పనబాకలక్ష్మి, జంగాకృష్ణమూర్తి, శాంతారాం, భానుప్రకాష్‌రెడ్డి, డిప్యూటీ ఇఒ భాస్కర్, ఓఎస్‌డి సత్రానాయక్‌ఉన్నారు. శ్రీవారిదర్శనం ఎంతోఅనుభూతి కలిగించిందని తెలిపారు.

# రాష్ట్రంలో 'రక్షణ' పెట్టుబడులు

>> క్స్‌ను 14 వందల కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేయనుంది. దీనికి అవసరమైన భూములను ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ సంస్థకు అప్పగించింది. రాడార్, వెపన్ ఇంటిగ్రేషన్, టెస్టింగ్ కేంద్రాన్ని సంస్థ ఏర్పాటు చేయనుంది. భారత్ ఫోర్జ్ అనుబంధ సంస్థ కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ లిమిటెడ్ శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు ఎపి ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆ సంస్థ రెండు దశల్లో 2,400 కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టనుంది. క్షిపణులు, వార్‌హెడ్స్ తయారీ యూనిట్ ఏర్పాటు కోసం వెయ్యి ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. మడకశిరలో రక్షణ రంగానికి సంబంధించి ఆర్టిలరీ మందుగుండు సామగ్రి షెల్, టీఎన్‌టీ ఫిల్లింగ్, మల్టీమోడ్ హ్యాండ్ గ్రనేడ్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటుకు మీడియా మ్యాట్రిక్స్ వరల్డ్‌వైడ్ లిమిటెడ్ సంస్థ 11 వందల 97 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఇప్పటికే ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు అన్ని ప్రాధాన్యతా రంగాల్లోను పెట్టుబడులను ఏపీ ప్రభుత్వం ఆహ్వానిస్తోంది.

# వారికి త్వరలో జమ

>> పిల్లలు ఉన్న తల్లులు 2,10,684, నలుగురు పిల్లలు ఉన్న తల్లులు 2,053 మంది ఉన్నారని వారందరికీ తల్లికి వందనం ఇస్తున్నామని లోకేష్ తెలిపారు. తల్లి లేని పిల్లలకు తండ్రికి లేదా గార్డియన్ ఖాతాలో తల్లికి వందనం డబ్బులు జమ చేస్తామని అలానే అనాథ పిల్లలుంటే జిల్లా కలెక్టర్ నిర్ధారించిన ప్రకారం వారి ఖాతాలో నిధులు జమ చేస్తామని అన్నారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి నిధులు ఇవాళ్టి నుంచి తల్లుల ఖాతాలో జమ అవుతాయని వెల్లడించారు. ఇచ్చిన హామీ మేరకు ఎంత మంది చదువుకునే పిల్లలు ఉంటే అందరికీ రూ.13,000 చొప్పున ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. ఒక్కో విద్యార్థికి సంబంధించి మిగతా 2000 రూపాయలను పాఠశాలల నిర్వహణ నిధి కింద ఖర్చు చేస్తామని స్పష్టం చేశారు. డబుల్ ఇంజిన్ సర్కారు ఆధ్వర్యంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెడ్లుగా పరుగులు పెట్టిస్తామని లోకేశ్ అన్నారు. ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లోని 76,000 మందికి కూడా తల్లికి వందనం వర్తింపచేశామని తెలిపారు. తల్లికి వందనం జాబితా సచివాలయం, గ్రామ, వార్డు కార్యాలయాల్లోనూ ఉంచుతామని, ఇంకా సాంకేతిక సమస్యలు ఉంటే వెంటనే తెలియజేస్తే పరిష్కారం చేస్తామని తెలిపారు. ఫిర్యాదుల స్వీకరణకు జూన్ 26 వరకు గడువు పెట్టామని జూన్ 30న తల్లికి వందనం తుదిజాబితా పెడతామని తెలిపారు.

# ఛైర్మన్, వైస్ ఛైర్మన్ టిడిపి కైవసం

>> ఎన్నికయ్యారు. వైస్ ఛైర్‌పర్సన్‌గా ఇండిపెండెంట్ అభ్యర్థి కరిమికొండ శ్రీలక్ష్మి ఎన్నికయ్యారు. అయితే కొండపల్లి మున్సిపాలిటీ ఎన్నికల ఫలితంపై తీవ్ర ఉత్కంఠం నెలకొంది. ఈ క్రమంలో స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ దగ్గరుండి మరీ అక్కడి పరిస్థితులను పర్యవేక్షించారు. హైకోర్టు ఆదేశాల మేరకు సీల్డ్ కవర్లో తీర్పు ఫలితం అధికారుల వద్దకు వచ్చింది. ఈ క్రమంలో భారీ బందోబస్తు మధ్య సీల్డ్ కవర్‌ను అధికారులు. తెరిచి.. ఫలితాలను ప్రకటించారు కొండపల్లి మున్సిపాలిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులను టిడిపి దక్కించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. తరువాత కొద్ది సేపటికే కొండపల్లి మున్సిపల్ ఛైర్మన్‌గా చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ ఛైర్ పర్సన్‌లుగా కరిమికొండ శ్రీలక్ష్మి చుట్టుకుదురు శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేసారు.

# మహిళలకు ఉచిత బస్సు

>> కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధి. గతంలో రూ.200 ఉన్న పెన్షన్ రూ.2000 చేసిన ఘనత కూటమిదే, ఆతర్వాత వచ్చిన జగన్ రెడ్డి రూ.3000 చేస్తానని మాటిచ్చి విడతల వారీగా, వాయిదాల వారీగా అంటూ ప్రజల్ని దగా చేశాడు. కానీ కూటమి అధికారంలోకి రాగానే, ఇచ్చిన హామీ మేరకు రూ.4000 పెన్షన్ అమలుచేసాం. దాదాపు 65 లక్షల మందికి పెన్షన్ అందిస్తున్నాం. ఎన్నికల హామీ మేరకు కోటి మందికి ఉచితంగా గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తున్నాం. పేదల నోటి దగ్గరి అన్నం దూరం చేసిన దుర్మార్గుడు జగన్ రెడ్డి. కూటమి అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లు తెరిపించాం. పేదల కడుపునింపుతున్నాం. త్వరలోనే అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించుకోబోతున్నాం. ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని కూడా ఆగస్టు నుండి అమలు చేస్తున్నాం. ఏ విద్యార్థి కూడా ఆర్థిక సమస్యలతో చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతోనే ప్రతి బిడ్డకీ ఇస్తామన్నాం. ఇచ్చి చూపించాం. పారదర్శకమైన పాలన చూసి ఓర్వలేక కూటమి ప్రభుత్వంపై జగన్ రెడ్డి కుట్రలు చేస్తున్నాడు. కులాలు, మతాల పేరుతో రాజకీయం చేస్తున్నాడు. గత ఐదేళ్ల పాపాలు బయటకు వస్తుండడంతో నానా యాగీ చేస్తున్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా మద్యంలో వేల కోట్ల కుంభకోణం చేశారు. భూ కుంభకోణాలకు పాల్పడ్డారు. విచారణ చేస్తున్న అధికారుల్ని, పోలీసుల్ని బెదిరించి ఏం చేయాలనుకుంటున్నారో జగన్ రెడ్డి సమాధానం చెప్పాలి. మహిళలపట్ల జగన్ రెడ్డి, వారి రౌడీ మూకలు అనుసరిస్తున్న విధానాలే వారి మనస్తత్వానికి నిదర్శనం. రాష్ట్రంలోని మహిళల్ని జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేయడమే కాకుండా.. ఆందోళన చేసిన వారిపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఇలాంటి రాబందుల్ని రాష్ట్రం నుండి తరిమికొట్టాల్సిన బాధ్యత ప్రతి పౌరుడూ తీసుకోవాలి. ప్రజలు చీకొట్టినా.. వైఎస్సార్సీ నాయకులకు బుద్ధి రాలేదు. రాష్ట్రం కోసం ప్రజల కోసం కష్టబడే వారికి ప్రజలు అండగా నిలవాలని కోరుకుంటున్నానని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# జైలు నుంచి కొమ్మినేని విడుదల

**విజయవాడ, జూన్16,ప్రభాతవార్త ప్రతినిధి:** సుప్రీంకోర్టు ఉత్తర్వులతో కొమ్మినేని శ్రీనివాసరావు సోమ వారం రాత్రి గుంటూరు జైలు నుంచి విడుదల అయ్యారు. ఓ ఛానల్ డిబేట్‌లో అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ టిడిపి నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 10న హైదరాబాద్‌లో ఆయనను అరెస్టు చేసి మంగళగిరి కోర్టులో హాజరు పర్చగా రిమాండ్‌కు తరలించారు. కొమ్మినేని విడుదలకు సంబంధించి ఈనెల 13న సుప్రీంకోర్టు బెయిల్ ఉత్తర్వులు ఇచ్చింది. సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు జైలు అధికారులు ఆయన్ని విడుదల చేశారు. జైలు నుంచి కొమ్మినేని బయటకు రాగానే మాజీ మంత్రి అంబటి రాంబాబు, పలువురు వైఎస్సార్సీ నాయకులు, న్యాయవాదులు కలిశారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ.. కొమ్మినేని విడుదలలో కూడా అధికారులు తీవ్ర జాప్యం చేశారన్నారు. రాత్రి ఏడు గంటల వరకు కాలయాపన చేశారని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం కన్నా వ్యక్తిగత కక్షలు తీర్చుకోవడానికే సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే కొమ్మినేనిపై అక్రమ కేసు నమోదు చేసి అరెస్టు చేశారన్నారు.

# ఇది యుద్ధాల శకం కాదు: సైప్రస్‌లో ప్రధాని మోడీ

**నికోసియా, జూన్ 16:** ఆపరేషన్ సిందూర్ సమయంలో సీమాంతర ఉగ్రవాదంపై భారత్ పోరాటానికి నిరంతరం మద్దతు ఇచ్చినందుకు సైప్రస్ అధ్యక్షుడు క్రిస్టోడౌలైడ్స్‌కు ప్రధానిమోడీ కృతజ్ఞతలు తెలిపారు. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం వల్ల పశ్చిమాసియాలో తలెత్తుతున్న ఉద్రిక్తతలపై ఇరువురు చర్చించుకున్నట్లు తెలిపారు. పశ్చిమాసియా, యూరప్‌లో కొనసాగుతున్న సంఘర్షణలపై ఆందోళన వ్యక్తం చేశారు. చర్చల ద్వారానే సమస్యలకు శాంతియుత పరిష్కారం పొందవచ్చని అన్నారు. ఇయు అధ్యక్ష పదవి సైప్రస్‌కు రావడంపై ఆ దేశానికి శుభాకాం క్షలు తెలిపారు. ఆ దేశ నాయకత్వంలో ఇయుతో భారత్‌కు మరింత మెరుగైన సంబంధాలు ఏర్పడతాయని అన్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కోసం ఆ దేశం ఇయు మద్దతు సాధిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

ఈ పర్యటనను ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో సరికొత్త అధ్యాయం లిఖించేందుకు సువర్ణావకాశంగా ప్రధాని మోడీ పేర్కొన్నారు. సైప్రస్‌కు భారత్ అత్యంత విశ్వసనీయ దేశమని అన్నారు. ప్రజాస్వామ్యం, చట్టబద్ధ పాలనపై పరస్పర విశ్వాసం ఇరు దేశాల సంబంధాలకు బలమైన పునాదిగా నిలుస్తుందన్నారు. సైప్రస్ ప్రభుత్వంతో రక్షణ, భద్రత, వాణిజ్యం, సాంకేతికకత, ఆరోగ్య సంరక్షణ, పునరుత్పాదక ఇంధనం వంటి రంగాలలో సహకారం గురించి చర్చలు జరిపినట్లు తెలిపారు. ఇరు దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలను ఎలా బలోపేతం చేయాలనే విషయాలపైనా తాము మాట్లాడుకున్నామన్నారు.

సైప్రస్‌లో యోగా, ఆయుర్వేదం ప్రజాదరణ పొందుతుండడం ఆనందంగా ఉందని అన్నారు. వీలైనంత త్వరగా భారత్‌ను సందర్శించాల్సిందిగా సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలైడ్స్‌ను మోడీ ఆహ్వానించారు. భారతీయులకు సైప్రస్ మంచి పర్యాటక ప్రాంతమని.. ఇరు దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులను తీసుకువచ్చేలా చర్చలు జరుగుతున్నాయని తెలిపారు.

ప్రధాని మోడీ ఆదివారం సాయంత్రం సైప్రస్ చేరుకున్నారు. ఆయనకు లార్నాకా అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆ దేశ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలైడ్స్ సాదర స్వాగతం పలికారు. రెండు దశాబ్దాల తర్వాత భారత ప్రధాని సైప్రస్‌కు వెళ్లడం ఇదే తొలిసారి. మోడీని అక్కడి ప్రభుత్వం ఆ దేశ అత్యున్నత పురస్కారమైన 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ఆర్డర్ మకరియోస్ 3'తో సత్కరించింది. ఈ పర్యటన తర్వాత.. ప్రధాని మోడీ కెనడా వెళ్లి అక్కడ జరగనున్న జి-7 సదస్సులో పాల్గొంటారు. అక్కడి నుంచి క్రొయేషియా పర్యటనకు వెళ్తారు.

# బనకచర్లను అనుమతించొద్దు

>> మంత్రిత్వశాఖకు కూడా 2025 అక్టోబర్ 23న అభ్యర్థించామని 2011 ఫిబ్రవరిలో 8 పనులు నిలిపివేయాలని ఆంధ్రప్రదేశ్‌కు ఆదేశాలు వచ్చాయని తెలిపారు. బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వం వద్దకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ముందస్తు సాధ్యత నివేదికతో ప్రతిపాదనలు తీసుకెళ్లింది. పోలవరం నుంచి బనకచర్లకు నీటి తరలింపు ప్రాజెక్టుపై కేంద్ర ఆర్థిక శాఖకు రాష్ట్ర అధికారులు సుమారు 2 గంటలపాటు వివరించారు. రూ.81,000 కోట్లతో ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టుతో రైతులు, ప్రజలకు కలిగే ప్రయోజనాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్ర ఆర్థిక, నీటిపారుదల శాఖ అధికారులు కేంద్రానికి ఆంధ్రప్రదేశ్ వివరించింది. మే నెలలో జరిగిన భేటీల్లో ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలను ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. ముఖ్యమంత్రి ప్రతిపాదనలపై పూర్తి వివరాలు ఇవ్వాలని గతంలో కేంద్ర ఆర్థిక శాఖ కోరింది. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి అజయ్ సేత్‌కు రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి పీయూష్ కుమార్, నీటిపారుదల శాఖ సలహాదారు వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆయన సిడబ్ల్యుసికి డిపిఆర్ ఇవ్వాలని సూచించడంతో ఉత్తమ్ కుమార్‌రెడ్డి కేంద్రజలశక్తి మంత్రి డిపిఆర్‌ను ఒప్పుకోవద్దని టెండర్‌లు నిర్వహించకుండా అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ లేఖ రాశారు.

**హరీష్‌రావు ఓ అజ్ఞాని...తెలంగాణ నీటి ప్రయోజనాలు బలిపెట్టింది బిఆర్ఎస్**

గోదావరి ఒక్క చుక్క నీటిని ఆంధ్రప్రదేశ్ అక్రమంగా తరలించనీయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకొంటుందని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మాజీ నీటిపారుదలశాఖ మంత్రి బిఆర్ఎస్ నాయకుడు హరీష్‌రావు అజ్ఞానిగా మాట్లాడుతున్నారని తెలంగాణ నీటి ప్రయోజనాలు బలిపెట్టింది బిఆర్ఎస్ పాలనలోనే అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎపికి బనకచర్ల ద్వారా 200టిఎంసిల నీటిని ఆయన తెలిపారు. బనకచర్లకు అనుమతులు ఇవ్వకుండా కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్రాన్ని ఒప్పించాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. కృష్ణా బేసిన్ నుంచి తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే పదేళ్లు బిఆర్ఎస్ సహకరించిందని ఉత్తమ్ విమర్శించారు.

ఉమ్మడి ఎపిలో కృష్ణా నీటిలో తెలంగాణ వాటా 724 టీఎంసీలు ఏపీకి వెళితే, బీఆర్ఎస్ హయాంలో 1,254 టీఎంసీలు తరలించారని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరానికి వృథా ఖర్చు చేయకుంటే కృష్ణా ప్రాజెక్టులు అన్నీ పూర్తయ్యేవి. తుమ్మిడిహట్టి దగ్గర కాకుండా మేడిగడ్డ వద్ద కట్టడం వల్ల రూ.68వేల కోట్లు కాళేశ్వరం ప్రాజెక్టుకు అదనపు ఖర్చు అయింది. ఎపికి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు చాలని సంతకం చేసింది బిఆర్ఎస్ ప్రభుత్వం కాదా? కృష్ణా నీళ్లలో అప్పుడు మోసం చేసి ఇప్పుడు బిఆర్ఎస్ నేతలు నాటకాలు ఆడుతున్నారని దుయ్యబట్టారు.

# ఒడిశా నుండి అక్రమంగా గంజాయి

## ముగ్గురు సభ్యుల ముఠా అరెస్టు




**నెల్లూరు క్రైమ్, జూన్ 16, ప్రభాతవార్త :** ఒరిస్సా రాష్ట్రం నుండి అక్రమంగా గంజాయి తీసుకువచ్చి నెల్లూరు నగరంలో అమ్మకాలు జరుపుతూ యువతను మత్తుకు బానిసలుగా మారుస్తున్న ముగ్గురు సభ్యుల ముఠాను సంతపేట పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే ఒరిస్సా రాష్ట్రానికి చెందిన బపిసాహు ప్రస్తుతం ముత్తుకూరు గ్రామంలో నివసిస్తున్నాడు. స్థానిక చంద్రబాబు నగర్‌కు చెందిన షేక్ మాబాషలు ఇద్దరు కలిసి ఒరిస్సా రాష్ట్రం నుండి గంజాయిని కొనుగోలు చేసి నెల్లూరులో విక్రయాలు జరుపుతుంటారు. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ జి.కృష్ణ కాంత్ ఆదేశాల మేరకు, నెల్లూరు రూరల్ డిఎస్పి జి శ్రీనివాసరావు పర్యవేక్షణలో, సంతపేట సీఐ దశరథ రామారావు, ఎస్సై బాలకృష్ణ లు తమ సిబ్బందితో కలిసి సంతపేట స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో గంజాయి విక్రయాలపై నిఘా ఉంచారు. ఈ క్రమంలో బపిసాహూ, మాబాషాలు నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ సమీపంలో మన్సూర్ నగర్‌కు చెందిన షేక్ షఫీకి గంజాయి విక్రయిస్తుండగా పట్టుబడ్డారు. ముద్దాయిల వద్ద నుండి రూ.70 వేలు విలువచేసే 3.5 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సిఐ దశరథ రామారావు, ఎస్సై బాలకృష్ణ, ఏఎస్ఐ శ్రీహరి, హెడ్ కానిస్టేబుల్ లావణ్య కుమార్, పీసీలు షేక్ అల్లా బక్ష, సురేంద్రబాబు, సుదర్శన్ గౌడ్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# కొల్లేరులో పర్యటించనున్న సుప్రీం సాధికారత కమిటీ

**కైకలూరు , జూన్, 16(ప్రభాతవార్త):** కొల్లేరులో వాస్తవ పరిస్థితులు పరిశీలించేందు ఈనెల 17,18 తేదీల్లో జిల్లాలో సుప్రీంకోర్ట్ నియమించిన సాధికారిత కమిటీ పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. సోమవారం సాధికారిత కమిటీ పర్యటన ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా మండవల్లి మండలం మణుగునూరు, పులపర్రు, కైకలూరు మండలం ఆటపాక, ఆలపాడు, కొల్లేటికోట ప్రాంతాలలో కలెక్టర్ వెట్రిసెల్వి పర్యటించారు. వీరితో పాటు కైకలూరు శాసన సభ్యులు డా. కామినేని శ్రీనివాసరావు, ఉంగుటూరు శాసన సభ్యులు పత్సమట్ల ధర్మరాజు , పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ కొల్లేరుకు సంబంధించి సుప్రీం సాధికారిత కమిటీ ఈనెల 17,18 తేదీల్లో కొల్లేరులోని కొన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేయనున్నట్లు తెలిపారు. మానవీయత కోణంలో కొల్లేరులో ఎన్ని నివాసిత ప్రాంతాలు ఉన్నాయి, జిరాయితీ భూములు, డి.ఫారం పట్టా భూములు ఏమున్నాయి, 2006 సుప్రీం కోర్టు ఉత్తర్వులు ఎలా అమలు చేశారనే సంబంధిత 4 అంశాలను కమిటీ పరిశీలించనున్నదన్నారు. దీనికి సంబంధించి మంగళ, బుధ వారాల్లో సాధికారిత కమిటీ పర్యటించే ప్రాంతాల ప్లాన్‌ను తయారు చేసేందుకు ఈరోజు క్షేత్రస్థాయిలో పర్యటించడం జరిగిం దన్నారు.

### ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ కె. వెట్రిసెల్వి

రెండు రోజుల పర్యటన అనంతరం బుధవారం ఏలూరు కలెక్టరేట్ లో కొల్లేరుకు సంబంధించిన వినతులను స్వీకరించడం జరుగుతుందన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆకివీడు మండలంలోని కొల్లేరు వాసులు కూడా తమ సమస్యలను అందజేయవచ్చన్నారు. కైకలూరు శాసన సభ్యులు డా. కామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణ వేత్తలు, కొల్లేరులో కొన్ని వందల సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్న ప్రజలు వారి అవసరాలు, వారి సమస్యలు, జీరాయితీ భూములకు సంబంధించి పరిశీలనకోసం సుప్రీం సాధికారిత కమిటీ జిల్లాలో పర్యటించనున్నదన్నారు. కొల్లేరులో వాస్తవ పరిస్థితులు పరిశీలించి మూడు నెలల్లో నివేదిక సమర్పించాలని కమిటీని సుప్రీంకోర్టు ఆదేశించడం జరిగిందన్నారు. దానిలో భాగంగానే సుప్రీంకోర్టులో ప్రభుత్వం తరపున, కొంతమంది ప్రైవేట్ రైతులు కూడా అర్జీని పెట్టుకోవడం జరిగిందన్నారు. 2006లో కొల్లేరులో చేపల చెరువులు కొట్టిన పరిస్థితి, ప్రజల జీవనవిధానం వారి ఇబ్బందులను జీరాయితీ భూముల వివరాలను కమిటీ మంగళవారం నిడమర్రు ప్రాంతంలో జిరాయితీ భూములను, బుధవారం కైకలూరు ప్రాంతంలోని ఆటపాక, కొల్లేటికోట లో పర్యటించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా తరతరాల నుంచి జీవిస్తున్న కొల్లేరు ప్రజలు తమ వినతులను కమిటీకి సమర్పిస్తారన్నారు. అయితే ఈ పర్యటనలో కొన్ని మార్పులు కూడా ఉండవచ్చని వాటిని తెలియజేయడం జరుగుతుందన్నారు.

# జర్నలిజంలో ఆన్‌లైన్ శిక్షణా తరగతులు

### మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్

**విజయవాడ జూన్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** భవిష్యత్తు జీవనోపాధి అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకొని ఆన్లైన్ శిక్షణా తరగతులతో జర్నలిస్టులకు సర్టిఫికెట్ కోర్సులు నిర్వహించాలని ప్రతిపాదనను కార్యచరణలోకి తీసుకుని రానున్నట్లు సిఆర్ ఏపీ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ తెలిపారు. సురేష్ ను సీనియర్ జర్నలిస్టు, ఉమ్మడి రాష్ట్ర ప్రెస్ అకాడమీ గవర్నింగ్ కౌన్సిల్ మాజీ సభ్యుడు నిమ్మరాజు చలపతిరావు మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆన్లైన్ శిక్షణా తరగతులతో జర్నలిస్టులకు సర్టిఫికెట్ కోర్సులు నిర్వహించాలని నిమ్మరాజు విజ్ఞప్తి చేశారు. నాలుగు దశాబ్దాల క్రితం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జిల్లాల్లో శిక్షణ తరగతులు నిర్వహించామని ఆపై తొలి చైర్మన్ కే శ్రీనివాసరెడ్డి సహకారంతో ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించడం ప్రారంభించామని నిమ్మరాజు తెలిపారు. ఈ తరగతులలో అందించిన సర్టిఫికెట్ల వలన ఆశించినంత ప్రయోజనం కన్పించలేదన్నారు. సెల్ఫోన్ వ్యవస్థ వలన ఏ ఒక్కరు ప్రసంగాల పట్ల దృష్టి కేంద్రీకరించ లేకపోతున్నారని అన్నారు. అసెంబ్లీ తరహాలో తరగతి గది వెలుపల సెల్ఫోన్లను సేకరించడం మంచిదన్నారు. 30 ఏళ్ల క్రితం గుంటూరులో సురేష్, తను కలిసి పనిచేసిన స్మృతులను నిమ్మరాజు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. నిమ్మరాజు విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుంటామని సురేష్ తెలిపారు. మీడియా ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తానని సురేష్ తెలిపారు.

# పిఆర్సీని వెంటనే ఏర్పాటు చేయండి

### - ఎన్జీవో అధ్యక్షుడు విద్యాసాగర్

**విజయవాడ, జూన్ 16,ప్రభాతవార్త ప్రతినిధి:** పీఆర్సీని వెంటనే ఏర్పాటు చేయాలని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను స్వాగతిస్తున్నామని, ఉద్యోగుల సమస్యలపైనా దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన విజయవాడ లోని ఏపీ ఎన్జీవో భవన్‌లో మాట్లాడారు. 'గత ప్రభుత్వంలో ఉద్యోగులు అన్ని విధాలా ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవాలి. ఒకటో తేదీనే జీతాల చెల్లింపు, రూ.30వేల కోట్ల పైబడి ఆగిపోయిన ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాల్లో రూ.7500 కోట్లు చెల్లించడం ఊరట కలిగించింది. అయితే 2023 జులైలో వేయాల్సిన పీఆర్సీ జాడ ఇప్పటికీ లేకపోవడంతో ఉద్యోగులు నష్టపోతున్నారు. అపరిష్కృతంగా ఉన్న మూడు డీఏల చెల్లింపుపై ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. ప్రతి నెలా మా జీతాల నుండి మినహాయిస్తున్న హెల్త్ కార్డుల నగదును అసుపత్రులకు జమ చేయాలి. సచివాలయాల ఉగ్యోగులకు వారు నివాసం ఉంటున్న మండలాల్లో పనిచేసే అవకాశాన్ని ఇవ్వకపోవడం సరికాదు'అని విద్యాసాగర్ అన్నారు. అసోసియేషన్ రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన విజయనగరం జిల్లాకు చెందిన డివి రమణను ఉద్యోగులు సత్కరించారు.

# తిరుమల సమాచారం

## టిటిడి ఢిల్లీ కళాశాల గవర్నింగ్ బాడీ చైర్మన్‌గా బిఆర్‌నాయుడు

### - కళాశాల అభివృద్ధికి పూర్తిస్థాయి సహకారం



**తిరుమల,జూన్ 16ప్రభాతవార్తప్రతినిధి:** దేశరాజధాని ఢిల్లీనగరంలో టిటిడి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎస్వీకళాశాల పూర్తిస్థాయి అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు. ఇందుకు త్వరలోనే ఢిల్లీలో గవర్నింగ్ బాడీ సమావేశం నిర్వహించేలోపు కళాశాలలో మౌళిక వసతులు, సదుపాయాలుపై నివేదికలు తయారుచేస్తే అవసరమైన వాటిని సమకూరుస్తానన్నారు. సోమవారం తిరుపతిలో జరిగిన ఢిల్లీ ఎస్వీకళశాల గవర్నింగ్ బాడీ సమావేశంలో చైర్మన్ బిఆర్‌నాయుడును గవర్నింగ్ బాడీ చైర్మన్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గవర్నింగ్ బాడీ ప్రతినిదులు ఆయనను అభినందించారు. ఢిల్లీలోని కళాశాలను మరింత ఉన్నతస్థాయికి అభివృద్ధిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

## యాత్రికుల భద్రతకు టిటిడి పెద్దపీట

### - మొదటిఘాట్‌లో కాలినడక భక్తులకు ప్రత్యేక క్యూలైన్



**తిరుమల,జూన్ 16ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి అలిపిరి నుండి కాలినడకన తిరుమలకు వచ్చే భక్తుల సౌలభ్యం కోసం మొదటిఘాట్‌రోడ్డుపై కొంతదూరం వరకు ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటుచేశారు. ఈ క్యూలైన్‌లను పటిష్టంగా నిర్మించడంతో భక్తులకు వాహనాల నుండి ప్రమాదాలు జరిగే అవకాశం లేదు. అలిపిరి కాలినడక మార్గంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుండి మోకాళ్ళపర్వతం వరకు మొదటిఘాట్‌రోడ్డుపై నడచిరావడం జరుగుతుంది. ఇక్కడ గతంలో రోడ్డుదాటే సమయంలో అనేక ప్రమాదాలు జరిగాయి. భక్తులు ప్రాణాలు కోల్పోవడం, ఒతగాత్రులవడం జరిగింది. ఈ రోడ్డుపై భక్తులకు భద్రత గోవిందా అని వార్త ప్రత్యేక కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన టిటిడి పాలకమండలి, అధికారులు పటిష్టంగా మొదటిఘాట్‌లో పుట్‌పాత్‌పై క్యూలైన్లురూపంలో అమర్చి దానినుండి ఎండ, వానకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పించారు. అంతేగాక చిరుతపులుల బారినుండి కూడా రక్షణ కల్పించడంతో కాలినడక భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భక్తులు రోడ్డుదాటే సమయంలో, నడచివచ్చేటప్పుడు భద్రత సిబ్బంది రక్షణగా వస్తున్నారు.

## అసౌకర్యాల నడుమ హోమం టిక్కెట్లు

### - అర్ధరాత్రినుండే అలిపిరిలో బారులు



**తిరుమల,జూన్ 16ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనానికి రకరకాలుగా భక్తులు ఆలోచన చేస్తుంటారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని గత పాలకమండలి చైర్మన్ కరుణాకర్‌రెడ్డి అలిపిరిలో హోమం జరిపించి అందులో పాల్గొన్నభక్తులకు అదేరోజు 300 రూపాయలు సుపథం మార్గంలో శ్రీవారి దర్శనం చేయించేలా విధానం అమలు చేశారు. తొలుత ఈ విధానంలో ఆఫ్‌లైన్ లోనే 200టిక్కెట్లు జారీచేసేవారు. ఉదయం 10గంటలకు హోమం పూర్తయితే అక్కడ నుండి ఈ రశీదుతో తిరుమలకు వచ్చిన భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. ఈ హోమం దర్శనాలకు డిమాండ్ పెరగడంతో వీటిని కూడా ఆన్‌లైన్ చేశారు. రోజుకు 150 టిక్కెట్లు ఆన్‌లైన్‌లో, 50 టిక్కెట్లు అలిపిరిలోనే ఆఫ్‌లైన్‌లో ఇచ్చేలా చూశారు. ఈ ఆఫ్‌లైన్‌లో 50 టిక్కెట్లకు తొలిరోజుల్లో ఉదయం 5-6గంటల ప్రాంతంలో వచ్చిన భక్తులకు కూడా హోమంలో పాల్గొనే అవకాశం ఉండేది. అయితే ఈ విషయం దావానంలా వ్యాప్తిచెందడంతో సామాన్యభక్తులు కూడా తిరుమలలో దర్శనం టిక్కెట్లు దొరకనివాళ్ళు అర్ధరాత్రి నుండి అలిపిరిలో నడకదారిమెట్లమార్గంలో గోప్రదక్షణశాల వద్ద హోమం కోసం బారులుతీరాల్సి వస్తోంది. రోజుకు సరాసరి 200మంది వరకు భక్తులు ఇక్కడ అర్ధరాత్రినుండి పడిగాపులు కాయడం పరిపాటిగా మారింది. 50 టిక్కెట్లకు గంటలతరబడి నిరీక్షణతో భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇంకి చంటిపిల్లలు, వృద్ధులు కూడా తీవ్ర ఇబ్బందులు పడతున్నారు. ఇక్కడ రద్దీతో టిక్కెట్లను పెంచాలని భక్తులు కోరుతున్నారు.

## 22 ప్రముఖ ఆలయాలకు ప్రత్యేకాధికారుల నియామకం

**విజయవాడ,జూన్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా దేవాదాయశాఖ పరిధిలోని 22 ఆలయాలకు ఏడీసీ, ఆర్జేసీ, డీసీ కేడర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా ఏపీ ప్రభుత్వం నియమించింది. ప్రముఖ దేవాలయాల్లో భక్తుల సౌకర్యార్థం శానిటేషన్, క్యూలైన్ల మేనేజ్‌మెంట్, ఇతర సౌకర్యాల పర్యవేక్షణపై ప్రభుత్వం దృష్టి సారించింది. వీటిలో ప్రధాన ఆలయాలైన సింహాచలం, అన్నవరం, విశాఖ కనకమహా లక్ష్మీ ఆలయం, అరసవిల్లి, ద్వారకాతిరుమల, వాడపల్లి, మోపిదేవి, బెజవాడ కనకదుర్గమ్మ ఆలయంతో పాటు ఇలా మొత్తం 22 ఆలయాలను అధికారులు ఎంపిక చేశారు. దేవదాయశాఖ అధికారుల నిర్దేశం మేరకు వీరు ఆయా ఆలయాల్లో పరిశుభ్రతకు పెద్దపీట వేస్తూ పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. క్యూలైన్ల పర్యవేక్షణ, భక్తులు వేచి ఉండే గదులను పరిశుభ్రంగా ఉంచ డం, ప్రసాదం నాణ్యతపై పర్యవేక్షణ ఇలా అన్ని రకాల భాధ్యతలు చూడాలి. ఆలయాల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలి. ఎక్కడా లోపాలు లేకుండా చూడాలి. ఏవైనా సమస్యలుంటే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారమివ్వాలి. సమీక్షలు నిర్వహించి, కమిషనర్‌కు నివేదికలు పంపాలి. దేవదాయ శాఖ నిర్దేశించిన ప్రత్యేక నిబంధనలకు అనుగుణంగానే 22 ఆలయాల్లో శానిటేషన్, క్యూలైన్ల ఏర్పాట్లు, ప్రసాదంతయారీ చేశారు.

# ఢిల్లీ టిటిడి కళాశాలలో వృత్తిపరమైన కోర్సులు

### - కళాశాల ప్రవేశాలలో తెలుగు విద్యార్థులకు కోటా

### - టిటిడి ఎస్వీకళాశాల గవర్నింగ్‌బాడీ సమావేశంలో టిటిడి చైర్మన్ నాయుడు

**తిరుమల,జూన్ 16ప్రభాతవార్తప్రతినిధి:** దేశ రాజధాని ఢిల్లీనగరంలో తిరుమలతిరుపతి దేవస్థానం నడుపుతున్న శ్రీవేంకటేశ్వర కళాశాలలో విద్యార్థులకు ఉపాధి అవకాశం ఉన్న వృత్తిపరమైన కోర్సులను ప్రవేశపెట్టాలని టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు సూచించారు. కళాశాలలో అవసరమైన మౌళిక సదుపాయాల పనులను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఎస్వీకళాశాలలో తెలుగు విద్యార్థులకు అడ్మిషన్ల కోటాలో ప్రాధాన్యత ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. టిటిడి ఆద్వర్యంలోని ఢిల్లీలోని ఎస్వీ కళాశాల 155వ గవర్నింగ్ బాడీ సమావేశం తిరుపతిలోని పద్మావతి అతిధి గృహంలో టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ శ్యామలరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి టిటిడి బోర్డుసభ్యులు డాక్టర్ పనబాకలక్ష్మి, శాంతారాం, ఎస్.నరేశ్‌కుమార్, దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్, టిటిడి ఎప్ఎసిఎఒ బాలాజీ, సిఇ సత్యనారాయణ, టిటిడి డిఇఒ వెంకటసునీల్, గవర్నింగ్‌బాడీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నింగ్‌బాడీ చైర్మన్ హోదాలో బిఆర్‌నాయుడు మాట్లాడుతూ ఢిల్లీలోని కళాశాలలో టిటిడి ప్రతిష్టమరింత పెంచేలా ఎస్వీకళాశాలను రూపొందించాలన్నారు. ఢిల్లీలో టిటిడి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎస్వీకళాశాలలో అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఉత్తరాదివైపున ఉన్న టిటిడి ఆలయాల్లో, ఢిల్లీలోని ఎస్వీకళాశాలకు ఇంజనీరింగ్ పనులు చేపట్టేందుకు వీలుగా ప్రత్యేకంగా ఇంజనీరింగ్ ఇఇ విభాగాన్ని ఏర్పాటుచేయాలని చైర్మన్ నాయుడు ఇఒ శ్యామలరావుకు సూచించారు. ఆ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ఉద్యోగ పోటీపరీక్షలకు శిక్షణనిచ్చేలా ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. కళాశాలలో పారిశుధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ, ఇంజనీరింగ్ మరమ్మతులను సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. కాలంచెల్లిన భవనాల స్థానంలో భవనాల పునర్నిర్మాణం, ఆడిటోరియం మరమ్మతులు, ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా నూతన టెక్నాలజీతో కళాశాల ప్రవేశంలో మరింత ఆకర్షణీయంగా ఉండేలా మార్పులుచేర్పులు చేపట్టాలన్నారు. కళాశాలకు సంబంధించిన పలు అంశాలను ప్రిన్సిపాల్ డాక్టర్ వఝుల రవి ఈ సందర్భంగా టిటిడి చైర్మన్, ఇఒ దృష్టికి తీసుకువచ్చారు.

# హంస గుర్తింపు రద్దు వాస్తవం కాదు :అధ్యక్షుడు అరవపాల్

**విజయవాడ,జూన్ 16,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ ప్రభుత్వ గుర్తింపు పొందిన సర్వీస్ అసోసియేషన్‌గా కొనసాగు తుందని రాష్ట్ర అధ్యక్షులు అరవపాల్ స్పష్టం చేశారు. హాంసపై వచ్చిన నిరాధారమైన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఆదివారం ఈ మేరకు విడుదల చేసిన ఒక ప్రకటనలో ఉద్యోగుల సంక్షేమం కోసం పనిచేసే సంఘాలకు ప్రభుత్వ గుర్తింపునిచ్చేందుకు జారీ చేసిన జీఓ ప్రకారం సాధారణ పరిపాలన శాఖ ఏపీ హాంసను అధికారికంగా గుర్తించిందని వివరించారు. తమ అసోసియేషన్ వైద్యాధికారి కంటే తక్కువ స్థాయిలో ఉన్న ప్రభుత్వ వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. తమపై వచ్చిన నిరాధార ఆరోపణలపై డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయానికి జూన్ 11నే నివేదికను సమర్పించామన్నారు. 2001 జూన్ 22 నుంచి సంఘం అన్ని కార్యకలాపాలను చట్టబద్దంగా నిర్వహిస్తోందని, సంఘం నమోదు, గవర్నింగ్ బాడీ ఎన్నికలు, సభ్యత్వాలు అన్నీ క్రమబద్ధంగా జరిగాయని వెల్లడించారు. ఇటీవల డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ నుంచి వచ్చిన ఉత్తర్వుల ప్రకారం ప్రభుత్వ వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం పేరుతో చేసిన ఫిర్యాదు ఆధారంగా విచారణ చేపడతామని తెలియచేశారని, ఈ విచారణలో అన్ని రకాలుగా సహకరిస్తామని చెప్పామన్నారు. అయితే, విచారణ పూర్తి కాకముందే ఏపీ హాంస గుర్తింపు తాత్కాలికంగా నిలిపివేయబడినట్లు ప్రధాన పత్రికలో వార్త రావడం, దాని ఆధారంగా ప్రచారం జరగడం సరికాదని అరవపాల్ పేర్కొన్నారు. విచారణ అనంతరం వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆశిస్తున్నామని, అప్పటి వరకు సంయమనం పాటించాలని కోరారు. ఈ సందర్భంగా విచారణకు తగినంత సమయం ఇవ్వాలని, పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని విచారణాధికారిని కోరుతున్నామన్నారు. అలాగే జాబితాలో మరణించిన, పదవీ విరమణ చేసిన, అనర్హులైన సభ్యులు ఉన్నారని ఆరోపణలు చేసారని, రెండేళ్ళ క్రితం నాటి పాత రికార్డుల ఆధారంగా ఆరోపణలు చేయడం అన్యాయమని, ప్రస్తుత డేటాను పరిగణనలోకి తీసుకోకుండా చేసిన ఆరోపణలు పరువు నష్టం కలిగించేవి అవుతాయని అరవపాల్ స్పష్టం చేశారు. ఏపీ హాంస పరిధి లోని సంస్థాగత ఎన్నికలన్నీ బైలాస్ ప్రకారమే ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహించామని వివరించారు. ఆంధ్రప్రదేశ్ ఆర్వోఎస్ఏ నియామకాల ప్రకారం గుర్తింపు పొందని సంస్థ ఇచ్చే ఫిర్యాదును స్వీకరించడం, గుర్తింపు పొందిన హాంస వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి చట్టబద్ధం కాదని పేర్కొన్నారు. ఈ విషయంలో నిష్పాక్షిక దర్యాప్తునకు సహకరించడానికి ఏపీ హాంస పూర్తిగా సిద్దంగా ఉందని, అలాగే ఆధారాలు సమర్పించడానికి రెండు వారాల సమయం ఇవ్వాలని ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నామని ఏపీ హాంస రాష్ట్ర అధ్యక్షులు తెలిపారు.

# విజయవాడలో 'పెళ్లి' మోసం

- కన్యాశుల్కం రీతిలో పెళ్లి కుమారుని నుండి డబ్బు వసూలు
- వివాహమై ఓ బిడ్డ ఉన్న యువతితో నాటకం ఆడించిన మధ్యవర్తులు
- పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

**విజయవాడ క్రైం,జూన్ 16,ప్రభాతవార్త** కర్నాటకుకు చెందిన ఓ పెళ్ళి కుమారుడిని కృష్ణలంకకు చెందిన ఆమని అనే యువతితో పాటు కొంత మంది బ్రోకర్లు కలిసి కన్యాశుల్కం రీతిలో పెండ్లి కుమారుని నుండి డబ్బులు వసూలు చేసి ఆనక పరారైన ఉదంతంపై ఫిర్యాదు మేరకు ఒన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక లోని కొప్పల్ జిల్లా, కొరటాయి మండలం, జేవీ క్యాంపు గ్రామానికి చెందిన కాంట్రాక్టరు వద్ద గుమాస్తాగా పనిచేస్తున్న కర్నాటకలో స్థిరపడ్డ గున్నం దుర్గాప్రసాద్‌కి 34 సంవత్సరాలు నిండినా వివాహం కాకపోవడంతో తాను ఉంటున్న ప్రాంతానికి చెందిన శ్రీదేవిని ఆశ్రయించాడు. ఆమె తనకు తెలిసిన రాజమండ్రికి చెందిన తాయారు అనే పెళ్ళిళ్ళ బ్రోకరును ఆశ్రయించింది. ఆమె తనకు తెలిసిన విజయవాడకు చెందిన పార్వతి, మెరాగ్ అనే వారి ద్వారా విజయవాడ కృష్ణలంక లోని 'ఎం' హోటల్ పక్క రోడ్డులో యువతి బంధువుల ఇంటి వద్ద పెళ్ళిచూపుల తతంగాన్ని నడిపించారు. ఈ నేపథ్యంలో పెండ్లి కుమార్తె ఆమని బంధువుల ఇంటిలో పెండ్లి చూపులు చూపించారు. పెండ్లి కుమారుడైన గున్నం దుర్గాప్రసాద్ వివాహం నిమిత్తం పెండ్లికుమార్తె పల్లవికి రూ.2లక్షల70వేలు ఎదురు కట్నం ఇచ్చేలాగున ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే వారి నుండి ఖర్చులకని పెండ్లికుమార్తె తరపు వారికి రూ.18వేలు ఇచ్చారు. బ్రోకరుగా వ్యవహరించిన పార్వతికి రూ.50వేలు ఇచ్చారు. మరో బ్రోకరు రాజమండ్రికి చెందిన తాయారుకు రూ.20వేలు ఇచ్చారు. పెండ్లి కుమార్తె బట్టలకని ఆమె స్నేహితురాలికి రూ.18వేలు ఇచ్చారు. మిగిలిన సొమ్మును కర్నాటకలో తమ ఊరిలో ఉంటున్న శ్రీదేవికి ఇచ్చారు. గత నెల 13న విజయవాడలో పెండ్లి చూపుల తతంగం కూడ జరిపించారు. వివాహ తతంగంలో కొంత భాగాన్ని ఒన్‌టౌన్ ప్రాంతంలో నిర్వహించారు. అమ్మాయి వరునికి నచ్చడంతో ఇక మోసానికి తెరలేపారు. ఈ నెల 5న ఇంద్రకీలాద్రిపై వివాహం తంతు పెండ్లికుమార్తె అయిన ఆమనితో జరిపించారు. అనంతరం వారందరూ కర్నాటకకు చేరుకున్నారు. 7వ తేదీన కర్నాటక లోని పెండ్లికుమారుని స్వగృహంలో రిసెప్షన్ కూడ ఘనంగా నిర్వహించారు. మూడు నిద్రల అనంతరం పెండ్లికుమారుని ఇంట్లో ఆమని తన భర్తతో కాపురం చేసేందుకు నిరాకరించడంతో భర్త, అతని కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చింది. దాంతో ఆమెను నిలదీయడంతో షాకింగ్ విషయం బయటకు వచ్చింది. తనకు అప్పటికే వివాహం అయ్యిందని, తనకు ఒక పిల్లవాడు కూడ ఉన్నాడని, తనను భర్త వదిలేయడంతో పిల్లలతో కలిసి జీవిస్తున్నానని, ఐదు రోజులు పెళ్ళికుమార్తెగా నటిస్తే రూ.50వేలు ఇస్తామని ఆశ చూపి, తనకు కొంత సొమ్ము మాత్రమే ఇచ్చారని, తాయారు, పార్వతి, విమల, తదితరుల బ్రోకర్ల మాటలు విని ఈ వివాహం చేసుకున్నానని తెలిపింది. దాంతో మధ్యవర్తులు వివాహం అయిన శ్రీదేవి, పార్వతి, మెరాగ్ తదితరులు వివాహమైన మహిళను వివాహం గాని మహిళగా నమ్మించి సుమారు రూ.4లక్షలు తన వద్ద వసూలు చేసి, వివాహం చేసి మోసం చేశారని ఒన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు వివాహం జరిపించిన బ్రోకర్లపై ఛీటింగ్, తదితర సెక్షన్ల క్రింద పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఆప్కో, లేపాక్షి సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త డిజైన్ పోటీ

### గోడ పత్రికను ఆవిష్కరించిన ఆప్కో ఎండి విశ్వ మనోహరన్

**విజయవాడ,జూన్16,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని సంప్రదాయ హస్తకళలు, చేనేత కళలకు ఆధునిక రూపమిచ్చే ఉద్దేశంతో ఆప్కో, లేపాక్షి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త డిజైన్ పోటీని నిర్వహిస్తున్నట్లు ఈ సంస్థల ఎండి విశ్వ మనోహరన్ తెలిపారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ సైతం ఈ పోటీలో భాగస్వామిగా ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రముఖ హస్తకళలుగా గుర్తింపు పొందిన కొండపల్లి, ఎటికొప్పాక బొమ్మలు, కలంకారి ప్రింట్లు, లెదర్ పప్పెట్రీ, వుడ్ కార్వింగ్‌లు , నేత కళలుగా ప్రసిద్ధి చెందిన ధర్మవరం, ఉప్పాడ, మంగళగిరి, బందరు ఇత్యాది - ఆధారంగా నూతనంగా రూపొందించిన వస్త్రాలు, సూక్ష్మ జ్రాఫికల విభాగంలో నూతనత్వం ఉట్టిపడేలా కొత్త డిజైన్లను ఆహ్వానిస్తున్నారు. వినియోగ ప్రయోజనమున్న వస్తువులకు ప్రాధాన్యత ఇస్తారు. పోటీకి 18 సంవత్సరాల పైబడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కళాకారులు, నేతన్నలు, డిజైనర్లు, విద్యార్థులు పాల్గొనవచ్చు. సృజనాత్మకత, సంప్రదాయ నైపుణ్యం, స్థిరత్వం వంటి ప్రమాణాల ఆధారంగా విజేతలను నిపుణుల కమిటీ ఎంపిక చేస్తుంది. ప్రతి విభాగంలో మూడేసి బహుమతులు ప్రకటిస్తారు - మొత్తం 30 బహుమతులు. మొదటి బహుమతి ..25,000, రెండో బహుమతి ..15,000, మూడో బహుమతి ..10,000. మొత్తం ప్రైజ్ మనీ ..5 లక్షలను ఆప్కో, లేపాక్షి సంయుక్తంగా అందజేస్తున్నాయి. పాల్గొనదలచిన వారు తమ రూపొందించిన నమూనాలను 2025 జూలై 16లోపు సమీప లేపాక్షి లేదా ఆప్కో షోరూమ్‌లలో అందించాలి. ఇది జూన్ 17న ప్రారంభమైన 30 రోజుల వ్యవధిలో ముగుస్తుంది. వివరాలు, మార్గదర్శకాల కోసం ఈ వెబ్‌సైట్‌లను సందర్శించవచ్చని విశ్వ మనోహరన్ తెలిపారు.

# 21న రాష్ట్రంలో లక్షపైగా యోగా కార్యక్రమాలు

### - ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి టి.కృష్ణబాబు

**విజయవాడ,జూన్16,ప్రభాతవార్తప్రతినిధి:** యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా జూన్ 21 వ తేదీన రాష్ట్రంలో 1 లక్ష పైబడి ప్రదేశాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించుటకు ప్రభుత్వ ఆయుష్ శాఖ ఏర్పాట్లు చేస్తోందని ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి టి. కృష్ణ బాబు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇప్పటికే 1,05, 266 ప్రదేశాలను గుర్తించడం, ఇక్కడ ఒక సారి యోగా సాధన చేయడం కూడా పూర్తైందని వారు తెలిపారు. జూన్ 21 వ తేదీన ఈ యోగా ప్రదేశాలలో 2 కోట్ల మంది ప్రజలు యోగా సాధన చేస్తారని చెప్పారు. యోగా మానసిక, శారీరక ఆరోగ్యానికి మంచిదని తెలిపారు. యోగాంధ్రను ఒక నిరంతర కార్యక్రమంగా నిర్వహించే ఆలోచన ప్రభుత్వం చేస్తోందన్నారు.

వార్త

నువ్వు కార్యం సాధించలేవు అని అందరూ అన్న పనిని నిర్వహించడమే మనిషి జీవితంలో గొప్ప ఆనందం.

-వార్డ్ బగెహాట్

# ఏవియేషన్‌కు ఎన్ని శాపాలో!

ప్రతికూల వాతావరణం, సాంకేతిక సమస్యకు మానవ తిప్పిదాలతో ఇప్పుడు ఏవియేషన్ రంగ ప్రతిభ మసిబారుతోంది. గత 40 రోజుల్లో విమానరంగం ఒక్క కుదుపునకు గురైంది. ఒక మహా విషాదాన్ని భారతదేశం చవిచూసింది. దీనికితోడు 5 హెలికాప్టర్‌లు అననుకూల వాతావరణంలో కూలిపోయాయి. ఇంకా ఇలాంటి ఘటనలు నమోదవుతూనే ఉన్నాయి.అహ్మదాబాద్ ప్రమాదంలో ఇప్పటికే 279 మంది మృతి చెందినట్లు అధికారికంగా ప్రకటించారు. కాలిన గాయాలతో ఇప్పటికీ క్షతగాత్రులు ఆసుపత్రులలోనే చికిత్స పొందుతున్నారు. తాజాగా గౌరీకుండ్ సోన్ ప్రయాగ్ అటవీ ప్రాంతంలో హెలికాప్టర్ కూలి ఏడుగురు మృతి చెందారు. గౌరీ కుండ్ అడవులకు దాదాపు 5కి.మీ ఎగువనున్న కొండప్రాంతానికి చేరుకోగానే కూలిపోయింది. దట్టమైన పొగమంచువల్ల పైలట్‌కు మార్గం సరిగా కనిపించక ప్రమాదం జరిగినట్టు తేల్చేశారు. ఉత్తరాఖండ్ హెలికాప్టర్ సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేశారు. కానీ ఇదే పరిష్కారం కాకూడదు. అణ్వాయుధాలు, అంతరిక్ష ప్రయోగాల్లో రోజురోజుకీ ఎంతో ముందడుగువేస్తున్నా ఏవియేషన్ రంగంలో ఎందుకు వెనుకబడి ఉన్నామో తెలుసుకునేందుకు ఇన్నాళ్లు పట్టింది. జీవ విహంగం ఢీకొడితే ఎంతో పెద్దగా ఉండే లోహవిహంగం తలకిందులైపోతుందంటే ఆశ్చర్యంగా ఉంది. 'మేడే'కాల్ అంటే చావుకు దగ్గరయ్యామన్న సంకేతానికి స్పందించలేకపోవడం విచిత్రమే మరి. కారణాలేవైనా గాల్లో ప్రాణాలు కోల్పోవడమంటే హృదయ విదారకమే. సహజ మరణం వేరు సజీవ దహనం వేరు. ఈ రెండింటికీ ఒకేలా స్పందించలేము. అర్ధాయుష్షుతో ఒకరు విగత జీవుడయ్యారంటే, అదీ అనుకోని దుర్ఘటనలో అయితే కోలుకోవడం కష్టమే. ప్రమాదాలు జరగనంతసేపూ 'మేమే విజయవంతంగా విమానాలు నడిపామని, మనదే ఘనత అని చాటుకునే విమాన సంస్థలు ప్రమాదం జరిగాక తప్పించుకునేందుకు చూస్తాయి. ఎయిర్ ఇండియా అలాకాక కష్టనష్టాల భారాన్ని తానే భరిస్తోంది. బోయింగ్ డ్రీమ్ లైనర్ ప్రమాదం టాటాసన్స్ చరిత్రలోనే అత్యంత ఘోరమైన దుర్ఘటన అని టాటాసన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ బహిరంగంగానే ప్రస్తావించారు.ఇప్పటికే ప్రమాద మృతుల కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారాన్ని ప్రకటించారు. క్షతగాత్రుల వైద్య ఖర్చులకూ వారే భరోసా ఇచ్చారు. అదనంగా తక్షణ ఉపశమనంగా 25 లక్షలు ఇస్తోంది. విమానాల కండిషన్, వాటి నిర్వహణ విధానం, వివిధశాఖల అప్రమత్తత వంటి అన్ని విషయాల్లోనూ కూలంకషంగా పరిశీలిస్తున్నారు. ఎవరేమిచెప్పినా ఎన్ని విశ్లేషణలు చేసినా, ఎన్ని అనుభవాలను క్రోడీకరించినా అహ్మదాబాద్ విమాన ప్రమాద కారణాలు అంతుపట్టడం లేదు. అయితే అదృష్టవశాత్తు బ్లాక్‌బాక్స్ దొరికింది. కనుక ప్రమాద కారణాలను తేల్చే స్తుందన్న నమ్మకం అధికారుల్లో, ఏవియేషన్ మంత్రిత్వ శాఖలో వ్యక్తమవుతోంది. అంతర్జాతీయ మాంట్రియల్ ఒప్పందం మేరకు ఎయిర్ ఇండియా మొత్తం 412కోట్ల రూపాయలు మృతుల కుటుంబాలకు చెల్లించాల్సి ఉం టుంది. ఎయిర్ ఇండియా మొత్తం 30డ్రీమ్‌లైనర్‌లను నడుపుతోంది. 2012 మోడల్స్ కూడా ఉన్నాయి. ఎంతో భద్రత కలిగిన పటిష్ట విమానంగా కీర్తించబడే డ్రీమ్‌లైనర్‌కు దాని వినియోగదారులకు పరోక్షంగా దాని తయారీదారులకు కష్టాలొచ్చిపడ్డాయి. విమాన పైలట్ కెప్టెన్ సుమిత్ సభర్వాల్ చిట్టచివరి సందేశంఇప్పుడు బ్లాక్‌బాక్స్ వాయిస్ రికార్డర్ నుంచి బయటపడింది. 'మేడే...నో పవర్..గోయింగ్‌డౌన్' ఆ తర్వాత ఏం జరిగిందో మనకుతెలిసిందే. అంత అప్రమత్తంగా ఉన్నా వారెవరినీ కాపాడుకోలేకపోయాం.గుర్తుగా మిగిలిపోయిన మృత్యుంజ యుడు బ్రిటన్ జాతీయుడు విశ్వాస్‌కుమార్ రాజేష్‌ను తప్ప. అందరూ అనుకున్నట్లు రెండు ఇంజిన్‌లు ఒకేసారి విఫలమయ్యే ఛాన్స్ బహు తక్కువ అయినందునఇంధన 'కల్తీ' అయిందా? అనే కొత్త సందేహం వ్యక్తం చేస్తున్నారు. పక్షి ఢీకొంటే విద్యుత్ సరఫరాకు అంతరాయం నిజమేకానీ 'ఒక పక్షి రెండు ఇంజన్లను' ఒకేసారి ఢీకొనడం సాధ్యం కాదని తేల్చేశారు. బోయింగ్‌లో అత్యాధునిక శ్రేణి విమానాల్లో రెండుశక్తివంతమైన ఇంజిన్లు ఉంటాయి. కనుక ఇంజిన్‌ల వైఫల్యాన్ని కొట్టిపారేస్తున్నా రు. జీఈ ఏదో స్పేస్ తయారు చేసిన ఈ ఇంజన్లలో ఎలాంటి సమస్యలూ లేవని ఈ డ్రీమ్ లైనర్ తనిఖీలో ఏప్రిల్ నెలనివేదిక తెలుపుతోంది.బోయింగ్ 787 నిర్వ హణ ఒప్పందాన్ని ఇప్పుడు టర్కిష్ టెక్నిక్ సంస్థ త్రోసి రాజంటోంది. ఎయిర్ ఇండియా ఎఐ 171 విమానాన్ని 787 చెబుతుంటారు.అయితే టర్కీ కంపెనీ తాము 777వైడ్ బాడీల నిర్వహణకే పరిమితమంటోంది. ఈప్రమాదం తర్వాత విమాన నిర్వహణ విధానాల పాటింపువంటి అంశాలలో నిర్వహణ భాగస్వామ్య సంస్థలు బహిరంగ వివరణలిస్తూ ఈ ప్రమాదానికి తమ నిర్వహణలకు సంబంధమేమీ లేదని వివరిస్తున్నాయి.నిన్నమొన్నటి భారత్,పాక్ యుద్ధ సందర్భంగా ఇరుదేశాల గగనతలాలపై ఆంక్షలు, తాజాగా ఇరాన్, ఇజ్రాయిల్‌ల మధ్య జరిగిన యుద్ధంలో ఇరాక్ గగనతలాన్ని మూసేశారు.ఇలా గగనతలాల మీద ఆంక్షలతో ప్రయాణీకుల ఇబ్బందులు అన్నీఇన్నీకావు. ఏక మొత్తం మీద విమానయాన రంగం ఆటుపోట్లకు గురయింది.విమానయానంపై అపోహలైనా, అపార్థాలైనా తొలగాలంటే ఇప్పటివరకు జరుగుతున్న ప్రమాదాలు ఏ కోవకు చెందినవో తేలాలి.పటిష్ట నివారణ చర్యలకు ముందడుగు వేయాలి. అప్పుడే ప్రయాణికుల్లో విశ్వాసం కలుగచేయకలుగుతాయి.

నిరాశా నిస్పృహలకు లోనుకాకుండా ప్రయత్నం కొనసాగిస్తే మనం ఏ పనైనా సాధించగలం.



షేక్‌స్పియర్

నీలో ఉన్న శక్తిని నీవు తెలుసుకున్నప్పుడే గమ్యం చేరగలవు. కనుక ముందు నీ గురించి నీవే పరిశోధించుకో.



రామకృష్ణ పరమహంస

# పవన విద్యుత్తును బలోపేతం చేయడమెలా?

గ్లోబల్ విండ్ ఎనర్జీ కౌన్సిల్ ప్రకారం, మన దేశంలో పవన శక్తి ఉత్పత్తి ఖర్చు ఇతర సాంప్రదాయక వనరుల కంటే 40 శాతం తక్కువగా ఉంది. ఇది పెరుగుతున్న విద్యుత్ ధరలకు శాశ్వత కవచంలా పని చేస్తుంది. అంతేకాకుండా, పవన విద్యుత్ రంగం అభివృద్ధి చెందడం వల్ల కొత్త ఉద్యోగ అవకాశాలు వస్తాయి, తద్వారా ఆర్థిక వృద్ధికి దోహదపడుతుంది. భూసేకరణ చిక్కులు ఒక పెద్ద సమస్య. పెద్ద విండ్ టర్బైన్‌లకు చాలా స్థలం అవసరం. వ్యవసాయ భూమిని పవన విద్యుత్ ప్రాజెక్టులకోసం మార్చడంలో జరిగే జాప్యం పెద్ద ప్రాజెక్టులకు అడ్డంకిగా మారుతోంది. నాణ్యతలేని గ్రిడ్, మౌలిక సదుపాయాలు మరో ముఖ్యమైన సవాలు. అధిక పవన విద్యుత్ సామర్థ్యం ఉన్న ప్రాంతాల్లో సరైన ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ లేకపోవడం వల్ల విద్యుత్‌ను డిమాండ్ ఉన్న ప్రాంతాలకు చేరవేయడం కష్టం. దీనివల్ల విద్యుత్ ఖర్చులు పెరుగుతున్నాయి. ఉత్పత్తి అయిన విద్యుత్ వృథా అవుతోంది.

డి.జె.మోహన రావు

వాతావరణ కాలుష్యం, భూతాపం వంటి సమస్యలు ప్రపంచాన్ని పీడిస్తున్న ప్రస్తుత తరుణంలో, స్వచ్ఛమైన, పునరుత్పాదకమైన పవన శక్తి మన భవిష్యత్తుకు నిజమైన ఆశాకిరణంగా నిలుస్తోంది. దేశ ప్రగతిలో 'గాలి శక్తి' కీలక పాత్ర పోషిస్తోంది. 2014లో దేశ పవన విద్యుత్ ఉత్పాదక సామర్థ్యం సుమారు 23.35 గిగావాట్లు మాత్రమే. పదేళ్ల కాలంలో ఈ రంగం అనేక ఆటుపోట్లను తట్టుకొని నిలబడింది. 2025 మార్చి 31 నాటికి మన దేశం 50.04 గిగావాట్ల పవన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించి, ఈ రంగంలో ప్రపంచంలోనే నాల్గవ స్థానంలో నిలిచింది. చైనా, అమెరికా, జర్మనీలు మాత్రమే మన కంటే ముందున్నాయి. 2014-15 ఆర్థిక సంవత్సరంలో దేశం సుమారు 28,214 గిగావాట్ గంటల పవన విద్యుత్‌ను ఉత్పత్తి చేయగా, 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఇది సుమారు 83,385 గిగావాట్ గంటలకి చేరుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారతదేశం 4.15 గిగావాట్ల కొత్త పవన విద్యుత్ సామర్థ్యాన్ని జోడించింది. ఇది అంతకు ముందు సంవత్సరం కంటే ఎక్కువ. దేశంలో గుజరాత్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు పవన విద్యుత్ ఉత్పత్తిలో ముందున్నాయి. మన దేశంలో సంవత్సరానికి దాదాపు 18,000 మెగావాట్ల విండ్ టర్బైన్‌లను తయారు చేసే సామర్థ్యం ఉండటం 'మేక్ ఇన్ ఇండియా' స్ఫూర్తికి నిదర్శనం. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ విండ్ ఎనర్జీ అంచనాల ప్రకారం, తీరప్రాంతాల్లో 71గిగావాట్ల వరకు సముద్ర పవన విద్యుత్ (ఆఫ్‌షోర్ విండ్ ఎనర్జీ) ఉత్పత్తి చేయగల అపారమైన అవకాశం ఉంది. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ నివేదిక ప్రకారం 2029-30 చివరి నాటికి పవన విద్యుత్ స్థాపిత సామర్థ్యం 99.9 గిగావాట్లు చేరుకోవచ్చని అంచనా వేస్తున్నారు. సాంకేతికత అభివృద్ధితో పవన విద్యుత్ ప్రాజెక్టుల స్థాపన ఖర్చు గణనీయంగా తగ్గింది. తద్వారా ఇది 'గ్రీన్ ఎనర్జీ' విప్లవానికి ఊపునిస్తోంది. ఈ అద్భుతమైన ప్రగతికి సరైన విధానపరమైన నిర్ణయాలు, పెట్టుబడులు, స్థిరమైన ప్రణాళిక కారణం. పవన విద్యుత్ ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలు, భూసేకరణలో సరళీకరణ, ప్రాజెక్టుల వేగవంతమైన అనుమతులు ఈ వృద్ధికి ఆజ్యం పోశాయి. ముఖ్యంగా, 'ఫీడ్ఇన్ టారిఫ్' నుండి 'పోటీ బిడ్డింగ్' పద్ధతికి మారడం పారదర్శకతను పెంచి, ప్రాజెక్టుల అమలును వేగవంతం చేసింది. అలాగే, అంతర్రాష్ట్ర విద్యుత్ ప్రసార ఛార్జీల మినహాయింపు వంటివి పవన విద్యుత్ ఉత్పత్తిదారులకు మరింత వెసులుబాటును కల్పించాయి. పవన విద్యుత్ అంటే గాలిని ఉపయోగించి విద్యుత్తును ఉత్పత్తి చేసే పర్యావరణహిత ప్రక్రియ. దీనికి ప్రధానంగా విండ్ టర్బైన్‌లు అనే భారీ యంత్రాలు ఉపయోగపడతాయి. గాలి వేగంగా వీయగానే అవి తిరగడం మొదలుపెట్టి, జనరేటర్‌ను నడిపి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తాయి. ఇది పూర్తిగా పర్యావరణ అనుకూలమైనది, ఎటువంటి కర్బన ఉద్గారాలను ఉత్పత్తి చేయదు, కాబట్టి గ్రీన్‌హౌస్ ప్రభావానికి,వాతావరణ కాలుష్యానికి కారణం కాదు. ఇది స్వచ్ఛమైన గాలిని, ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించే ఆకుపచ్చని పరిష్కా



రం. గ్రిడ్ సదుపాయం సరిగా లేని మారుమూల ప్రాంతాల్లో పవన శక్తిని ఉపయోగించి గ్రామీణ విద్యుదీకరణకు చక్కటి, స్థిరమైన మార్గాన్ని అందించవచ్చు. ఆర్థికంగా చూస్తే, సాంప్రదాయక విద్యుత్ ప్రాజెక్టులతో పోలిస్తే,పవన విద్యుత్ తయారీకి తక్కువ వ్యయం అవుతుంది. నిర్వహణ ఖర్చులు కూడా చాలా తక్కువ. గ్లోబల్ విండ్ ఎనర్జీ కౌన్సిల్ ప్రకారం, మన దేశంలో పవన శక్తి ఉత్పత్తి ఖర్చు ఇతర సాంప్రదాయక వనరుల కంటే 40 శాతం తక్కువగా ఉంది. ఇది పెరుగుతున్న విద్యుత్ ధరలకు శాశ్వత కవచంలా పని చేస్తుంది. అంతేకాకుండా, పవన విద్యుత్ రంగం అభివృద్ధి చెందడం వల్ల కొత్త ఉద్యోగ అవకాశాలు వస్తాయి, తద్వారా ఆర్థిక వృద్ధికి దోహదపడుతుంది. భూసేకరణ చిక్కులు ఒక పెద్ద సమస్య. పెద్ద విండ్ టర్బైన్‌లకు చాలా స్థలం అవసరం. వ్యవసాయ భూమిని పవన విద్యుత్ ప్రాజెక్టులకోసం మార్చడంలో జరిగే జాప్యం పెద్ద ప్రాజెక్టులకు అడ్డంకిగా మారుతోంది. నాణ్యతలేని గ్రిడ్, మౌలిక సదుపాయాలు మరో ముఖ్యమైన సవాలు. అధిక పవన విద్యుత్‌సామర్థ్యం ఉన్న ప్రాంతాల్లో సరైన ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ లేకపోవడం వల్ల విద్యుత్‌ను డిమాండ్ ఉన్న ప్రాంతాలకు చేరవేయడం కష్టం. దీనివల్ల విద్యుత్ ఖర్చులు పెరుగుతున్నాయి. ఉత్పత్తి అయిన విద్యుత్ వృథా అవుతోంది. విధానాలలో అస్థిరత ఈ రంగానికి అనిశ్చితిని కలిగిస్తోంది. ప్రభుత్వం గతంలో ఇచ్చిన ప్రోత్సాహకాలను ఉపసంహరించడం వల్ల పెట్టుబడిదారులు వెనకడుగు వేస్తున్నారు. విండ్ టర్బైన్ బ్లేడ్‌ల లభ్యత సమస్యగా ఉంది,వాటిని ఎక్కువగా దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. చివరగా, ఈవ్యర్థాల సమస్య పర్యావరణానికి ఒక కొత్త సవాలుగా మారుతోంది. పాతబడిపోయిన టర్బైన్ భాగాలను పారవేయడం కష్టం, ముఖ్యంగా కాంపోజిట్ మెటీరియల్‌తో చేసిన బ్లేడ్‌లను రీసైకిల్ చేయడం మరింత క్లిష్టమైన పని. పవన విద్యుత్‌కు ఉన్న పరిమితులలో, గాలి లభ్యత ఎల్లప్పుడూ స్థిరంగా ఉండదు. బలమైన, స్థిరమైన గాలులు వీచే చోట మాత్రమే విండ్ టర్బైన్‌లు సమర్థవంతంగా పనిచేస్తాయి. అన్ని సమయాల్లోనూ గాలి ఒకే విధంగా ఉండదు. అధిక గాలుల ప్రమాదం ఉంది, టర్బైన్ బ్లేడ్‌లు, అధిక గాలులు పిడుగుల వల్ల దెబ్బతినే అవకాశం ఉంది. వోల్టేజ్ హెచ్చుతగ్గులు విద్యుత్ గ్రిడ్‌కు అనుసంధానించడంలో ఇబ్బందులు కలిగిస్తాయి. చివరగా శబ్దకాలుష్యం విండ్ టర్బైన్ బ్లేడ్‌లు తిరిగేటప్పుడు సమీపంలోని నివాసితులకు కొంతచికాకు కలిగించవచ్చు. దేశవ్యాప్తంగా ఒక ఏకరీతి జాతీయ పవన విధానాన్ని అమలు చేయడం అత్యవసరం. పాత విండ్ ఫారమ్‌లను అధిక సామర్థ్యంగల టర్బైన్‌లతో 'రీపవర్' చేయడం ద్వారా ఉత్పత్తిని గణనీయంగా పెంచవచ్చు.భూబ్యాంకు ఏర్పాటు చేయాలి. సముద్ర పవన విద్యుత్ సామర్థ్యాన్ని పెంపొందించాలి. డెన్మార్క్, యునైటెడ్ కింగ్‌డమ్ వంటిదేశాల సహాయంతో, సముద్ర తీరంలో టర్బైన్‌ల ఏర్పాటును వేగవంతం చేయాలి.హైబ్రిడ్ విండ్‌సోలార్ ప్రాజెక్టులు ప్రోత్సహించాలి. 'గ్రీన్ బాండ్ల' ద్వారా నిధుల సమీకరణను ప్రోత్సహించాలి. పవన విద్యుత్ వల్ల కలిగే ఉద్గారాల తగ్గింపును 'కార్బన్ క్రెడిట్' విధానాలద్వారా ద్రవ్యీకరించాలి.విండ్ ఎనర్జీ పరికరాల తయారీ కోసం 'ఉత్పత్తి_అనుసంధాన ప్రోత్సాహక పథకం' ప్రవేశపెట్టాలి. కొత్త సాంకేతికతలపై దృష్టి సారించాలి. లోతైన సముద్రంలో గాలి శక్తిని ఉపయోగించుకోవడానికి 'తేలియాడే విండ్ టర్బైన్‌లను' అన్వేషించాలి. గాలి శకి ప్రాముఖ్యతను గుర్తించి, దానిని మరింత విస్తృతంగా ఉపయోగించుకునే దిశగా అడుగులు వేద్దాం. •

# ఇంకుడు గుంతలతో నీటి సంరక్షణ అందరి బాధ్యత!

మన్నారం నాగరాజు

ప్రపంచం వేగంగా ముందుకు పోతోంది. మారుతున్న వాతావరణ పరిస్థితులు, పెరుగుతున్న జనాభా, నీటి వనరులపై అధిక భారం.. ఇవన్నీ కలసి మన భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చేస్తున్నాయి. ప్రత్యేకించి మన దేశంలో గ్రామీణ ప్రాంతాల నుండి మహానగరాల వరకూ నీటి వినియోగం పెరిగిపోతోంది. భూగర్భజలాల పరిమితి, వర్షాలపై ఆధారపడిన వ్యవసాయ విధానంవంటి అంశాలు నీటి సమస్యను మరింత తీవ్రమయ్యేలా చేస్తున్నాయి. ఇలాంటి సమయంలో ఇంకుడు గుంతలు ఒక చౌక,సాధారణ, సమర్థవంతమైన పరిష్కారంగా ముందుకు వస్తున్నాయి. కానీ దీనికి తగిన విధంగా ప్రాధాన్యత ఇవ్వడం, ప్రతీ ఇంటికి ఇంకుడు గుంతలు ఉండేలా చేయడం ప్రభుత్వాల ముఖ్య బాధ్యతగా మారాల్సిన అవసరం ఉంది. వర్షపు నీటిని భూమిలోకి చేరుస్తూ, భూగర్భజలాలను పునరుత్పత్తి చేసే విధానంగా ఇంకుడు గుంతలు పనిచేస్తాయి. ప్రతి ఇంటి వద్ద కనీసం ఒక గుంత ఏర్పాటు చేయాలన్న నిబంధనను ప్రభుత్వాలు విధించాలి. ఇది కేవలం సలహాస్థాయిలో కాకుండా, చట్టబద్ధంగా అమలులోకి రావాలి. మహానగరాల్లో కొత్తగా ఇల్లు కట్టించుకునే వారు, అపార్ట్‌మెంట్లు నిర్మించుకునే వారు, ఇతర నిర్మాణాలు చేపట్టేవారు పర్మిషన్ పొందే దశలోనే ఈ అంశాలపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు అందాలి. ఇంకుడు గుంత ఏర్పాటు చేయడమేగాక, కనీసం రెండు చెట్లు నాటడం తప్పనిసరి షరతుగా ఉండాలి. ఇది పర్యావరణ పరిరక్షణకు కీలకంగా మారుతుంది. నగరాల్లో పెరిగే ఉష్ణోగ్రతలను తగ్గించాలంటే, నీటి నిల్వలను భద్రపరచాలంటే చెట్లు, వర్షపు నీటి నిల్వలు ఎంతో అవసరం. ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం గుర్తించాలి. ప్రభుత్వాలు ప్రజలకు కేవలం నియమాలు విధించడం కాదు,అవగాహన కల్పించడంలో ముందుండాలి. గ్రామీణ ప్రాంతాల్లో నీటి విలువను తెలియజేయాల్సిన బాధ్యత స్థానిక పాలన వ్యవస్థలపైనా ఉంది. గ్రామపంచాయతీలు, వాటి పరిధిలోని వాలంటీర్లు, గ్రామ సచివాలయ ఉద్యోగులు,అందరూ కలిసి నీటి నిలువపై ప్రచారం చేయాలి. పాఠశాలల స్థాయిలో నుంచే విద్యార్థులకు నీటి విలువ, వృథా ఆపడం, గుంతల ఏర్పాటుపై బోధించాలి. ప్రజలకూ ఇదే సమయంలో స్పష్టమైన బాధ్యత ఉంది. ఇంటి నిర్మాణం అనేది కేవలం ఇంటి గోడలు కాదు. అది ప్రకృతితో సంబంధాన్ని ఏర్పరచే అవకాశం. వాస్తవానికి మన పురాతన సంస్కృతిలో వర్షపు నీటిని నిల్వ చేయడం, చెట్లు నాటడం, తోటలు పెంచడం చాలా సాధారణంగా కనిపించేవి. ఆధునిక జీవనశైలిలో ఇవన్నీ మరిచిపోవడం వల్లే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కాబట్టి, ప్రజలంతా కూడా తమ ఇంటి నిర్మాణంలో మరొక గదిని వేసినట్టు, ఒక ఇంకుడు గుంత ఏర్పాటు చేయడం, రెండు చెట్లు నాటడం తప్పనిసరి బాధ్యతగా భావించాలి. పర్యావరణ పరిరక్షణ అనే ప్రక్రియలో భాగస్వాములవ్వాలంటే, నీటి విలువను గుండెల్లో పెట్టుకోవాలి. ఇకపై ప్రభుత్వాల కార్యాచరణల్లో నీటి నిల్వ, వృథా నివారణ, చెట్ల పెంపకం, గుంతల ఏర్పాటును కీలక భాగంగా చేస్తూ ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో వాటిని చేర్చాలి. నీటి భద్రత లేకుండా ఏ అభివృద్ధీ స్థిరంగా ఉండదు. ప్రస్తుతం నీటి కొరత, భూగర్భ జలాల వనరులు ప్రధాన సమస్యలుగా మారుతున్న నేపథ్యంలో ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు (రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్స్)ఏర్పాటు చేయడం అత్యంత అవసరం. ఈ చర్య వర్షపునీటిని భూగర్భంలోకి చొప్పించి నీటి లభ్యతను పెంచుతుంది. అయితే ప్రజలు స్వచ్ఛందంగా ఈ గుంతలు ఏర్పాటు చేసుకోవడంలో ఆసక్తి చూపడం తక్కువగా కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో, ప్రభుత్వాలు ప్రోత్సాహకంగా పని చేయాలి. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసిన ఇళ్లకు వార్షిక ఇంటి పన్నులో 10శాతం నుండి 15శాతం వరకు రాయితీకల్పిస్తే, ఇది ప్రజలను ఉత్తేజితులుగా చేసుకుంటారు. ఈ విధంగా ఒకవైపు ప్రజలకు ఆర్థిక ప్రయోజనం కలుగుతుందంటే, మరోవైపు నీటి భద్రత పెరుగుతుంది. ఇది పర్యావరణ హితమైన చర్యగా మారుతుంది.ఈ విధానం ద్వారా ప్రజల భాగస్వామ్యం పెరిగి, నగరాలు, గ్రామాలు నీటి పరిరక్షణలో ముందంజ వేయగలవు. దీని వల్ల భవిష్యత్ తరాలకు నీటి లభ్యతపై భరోసా కలుగుతుంది. •

# ప్రజావాక్కు



## పెరిగిన ఇంజనీరింగ్ ఫీజులు

ఇటీవలికాలంలో ఇంజనీరింగ్ కళాశాలలు తమ ఫీజులను భారీగా పెంచబోతున్నారన్న వార్తలు విద్యార్థుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఇది ఇప్పటికే ఆర్థికంగా ఒత్తిడిలో ఉన్న మధ్యతరగతి,పేద కుటుంబాలకు మరింత భారంగా మారుతోంది. కోచింగ్,హాస్టల్,ప్రయాణ ఖర్చులతో విద్యార్థులు ఇప్పటికే తీవ్ర ఆర్థిక పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు అదనపు ఫీజుభారం వల్ల వారి విద్యను మధ్యలోనే నిలిపేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం ప్రతిమూడు సంవత్సరాలకు ఫీజు సమీక్షించాల్సి ఉంటుంది.కానీ2025-28 సంవత్సరాలకు ఎఫ్‌ఆర్‌సీ ప్రతిపాదించిన 100శాతం ఫీజు పెంపు అనేది అర్థవంతంకాదు. విద్యాశాఖ కార్యదర్శి గారు దీనిని తగిన విధంగాతిరస్కరించారు.గరిష్ఠంగా 30శాతానికి మించకూడదని ఆమె సూచించటం సముచితమైన అభిప్రాయం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## తెలుగు వారసత్వాన్ని చాటాలి

తెలుగు ప్రాచీన కవులలో శ్రీనాథుడు గొప్ప కావ్యాలు, పురాణాలు, ప్రబంధాలు రాశారు. కవిత్రయం మహాభారతాన్ని ఆంధ్రీకరిస్తే, పోతన తేట తెలుగులో భాగవతాన్ని మనకు అందించారు. శైవ వాఙ్మయం విషయానికి వస్తే పురాణాంతర్గత విషయాలను స్వతంత్రమైన కావ్యమార్గంలో రచన చేయటంలో శ్రీనాథుడు దిట్ట. హైదరాబాదు నగరంలో అట్టి ప్రాచీనకవి విగ్రహం లేకపోవటం ఎంతో లోటుగా ఉంది. ఇప్పటికైనా తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం చొరవతీసుకుని ట్యాంక్‌బండ్‌పై శ్రీనాథుని విగ్రహాన్ని నెలకొల్పి తెలుగుభాషా సాంస్కృతిక వారసత్వాన్ని చాటాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

## చెరగని మచ్చ

విపరీతమైన ఆక్సిడెంట్లు అయితే గాని, అనేక ప్రాణాలు గాలిలో కలిసిపోతే గాని వ్యవస్థలు గాని, సబంధిత అధికారులుగాని స్పందించకపోవడంమనంచూస్తూనే ఉన్నాం. ఇప్పుడూ అదే జరుగుతోంది. క్రేష్ అయిన బోయింగుకు సంబంధించి అధికారులు,ఎయిర్పోర్ట్ అథారిటీర్లకు కుంభకర్ణ నిద్ర నుండి మేల్కొనినట్లుగా జాగ్రత్తల దొంతర్లు ఒకదానిపై ఒకటి పెట్టేస్తున్నారు. కోట్ల కోట్లు సరితూగే లైఫ్ ఇవ్వగలరా. ఆ జీవితాల్ని తీసుకురాగలరా.

- గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

## గుర్తింపుతో పెరగనున్న ఆదరణ

ఎపిలోని ప్రముఖ పర్యాటక స్థలం బెలూం గుహలకు భౌగోళిక వారసత్వ గుర్తింపు లభించింది. దేశంలోనే అత్యంత పురాతనమైన, పొడవైన అంతర్భాగ గుహలుగా ప్రఖ్యాతిగాంచిన ఈ గుహలలో క్రీ.పూ.400ఏళ్ల కిందట ఆదిమానవులు నివసించారు. ఈ గుర్తింపుతో బెలూం గుహలకు పర్యాటకుల ఆదరణ పెరగడంతోపాటు వసతులు మెరుగు కానున్నాయి. వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రోడక్ట్ కింద బాపట్ల జిల్లా కుప్పడం చీరకు కేంద్ర గుర్తింపు లభించింది. ధవళ వర్ణంలో మేటి పట్టుతో రూపొందే కుప్పడం చేనేత చీరలకు ఈ గుర్తింపుతో అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ లభించనుంది. చేనేత కళాకారులకు చేతినిండా పని దొరకనుంది.

-చల్లా చంద్రశేఖర్ రెడ్డి, కలువాయి, నెల్లూరు జిల్లా

## మరపురాని మహా విషాదం

అన్నిరకాల ప్రయాణాల్లో కెల్లా విమాన ప్రయాణం సురక్షితమైనది అంటారు.కానీ గత గురువారం గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విమానాశ్రయం నుండి 'లండన్' లోని 'గాట్విక్'కు వెళ్లవలసిన బోయింగ్ 787 బయలుదేరిన రెండు నిమిషాలలోపే విమానాశ్రయం సరిహద్దు గోడలకు పక్కనే ఉన్న భవనాల మీద కూలిపోయి అందులోని ప్రయాణికులు, సిబ్బంది మొత్తం 241 మంది దుర్మరణం చెందటం అనేది విమానయాన చరిత్రలోనే అత్యంత ఘోర దుర్ఘటనగా చెప్పవచ్చు. ప్రపంచంలోని వివిధ సంస్థల తయారీ విమానాలతో పోల్చినప్పుడు బోయింగ్ విమానాలు అత్యున్నతమైనవని నిపుణులు చెబుతున్నారు. ఇప్పుడు ఈ దుర్ఘటనకు ఎవరు బాధ్యులు? మానవ తప్పిదమా లేక సాంకేతికత కారణమా అనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం నిపుణుల పర్యవేక్షణలో కనుగొని, భవిష్యత్తులో ఇటువంటి దుర్ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఆశిద్దాం.

- దాసం వెంకటరెడ్డి,బెంగుళూరు

## కల్తీ విత్తనాలను అరికట్టాలి

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ ఫర్టిలైజర్ యాజమాన్య సంస్థలు రైతులకు అందించేవిత్తనాలపైదృష్టిసారించి నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులు మోసపోకుండా చూడాలి. అదేవిధంగా అధిక ధరలకు అమ్మకుండా చర్యలు తీసుకోవాలి. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు సబ్సిడీకి రాష్ట్ర ప్రభుత్వమే అందించే ప్రయత్నం చేయాలి.

-మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# అనుభవ సారంతో 'అభివృద్ధి మథనం'



రావులపాటి సీతారాంరావు

ఈ మధ్య అనుభవజ్ఞులైన సీనియర్, వెరీ సీనియర్ సిటిజన్లు ఒక సమావేశంఏర్పాటు చేసినప్పుడు వారి సంభాషణ ఆసక్తికరంగా మారింది. చాలా తాపీగా ప్రారంభమైన చర్చలు కొద్ది సేపటికే వేడెక్కాయి. వేడి ఎక్కడానికి అనేక కారణాలు ఉన్నాయి. వారంతా వివిధ రంగాల్లోంచి వచ్చిన వారు. జీవితాన్ని కాచి వడపోసిన వారు! దేశమంటే ప్రాణం పెట్టే వారు. ఉద్యోగాల్లో ఉన్నప్పుడు వేరువేరు వృత్తుల్లో ఉన్నా దేశ భవిష్యత్తును గురించి ఆలోచించటమే కాదు, దేశం ఎటుపోతున్నది అని మథనపడ్డవారు. ప్రస్తుతం తమవంతు కర్తవ్యాన్ని నిర్వహించాలని తపన పడ్తున్నవారు. జీవితాల్లో విశ్రాంతి తీసుకొనే సమయం ఆసన్నమయినప్పుడు కూడా వారు దేశంలోని పరిస్థితులను గురించి ఆలోచనలనుపంచుకోవటమే కాదు నిర్దిష్టమైన అభిప్రాయాలను వెలిబుచ్చుతున్నప్పుడు వ్యతిరేకత వచ్చినాసరే, ఖండితంగా చెప్పే విధానాల్లో మార్పురాకపోవటం వినేవారికి ఎవరికైనా ఆశ్చర్యంతోపాటు ఒకింత సంతోషం కూడా కలిగించింది. ఇండియా పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం అవసరమా అన్న ప్రశ్న కొందరిని కలవరపెట్టే మరి కొందర్ని ఆలోచింప చేసింది. ఆప్రశ్న ఉద్దేశ్యం ఆర్థికాభివృద్ధి దేశం సాధిస్తున్న తరుణంలో ఈ సంఘర్షణ వల్ల మళ్లీ దేశం వెనుకడుగు వేస్తుందేమో అన్న ఆవేదనను వెలికి తీసింది. రకరకాల అభిప్రాయాలు చర్చలకు ప్రాణం పోసాయి. అర్థవంతంగా తలలు పండినవారు మాట్లాడుకొనే విధానం ఈ కాలం వారు గమనిస్తే బాగా అని కొంతమంది అనుకోకుండా ఉండలేకపోయారు. మొదటి రోజు యుద్ధంలో ప్రభుత్వాలు ఏమి ప్రకటించినా లీకిల్చి చెప్పుకున్నా రెండు దేశాల మధ్య పోరు బయటకు రసవత్తంగా జరిగినట్లు వార్తలు వచ్చినా పాకిస్థాన్ సైన్యమే అదను చూసి అయిదారు విమానాలను దెబ్బతీసిందని, ఆ దెబ్బతగిలిన మరుక్షణమే భారతదేశ సైన్యాలు మెరుపువేగంతో డ్రోన్లను యథేచ్ఛగా రంగంలోకి దింపి పి.ఓ.కెలోనూ, పాకిస్థాన్ సరిహద్దులోనూ స్థావరాలను మట్టుపెట్టి ఉగ్రవాదులకు ప్రాణనష్టం కలిగించిందని దాదాపు ఏకాభిప్రాయానికి వేడివాడి చర్చల తర్వాత రావటం గమనార్హం. యుద్ధం అనేది పహల్గాం సంఘటన జరిగిన తర్వాత అనివార్యమనీ మతద్వేషాలను రెచ్చగొట్టే కుట్రతో అమాయకులను పర్యాటకులను మతం పేరుతో ఆడవారి ముందు పొట్టన పెట్టుకోవడం అనమానుషమని, యుద్ధానికి అంతకంటే మరో సహేతుకమైన కారణం ఇంకోటి ఉండబోదు.అంతే కాదు, జాతి గౌరవాన్ని నిలబెట్టుకోవటం అలాంటి ఘటనలు జరిగినప్పుడే అవసరమని ఆపరేషన్ సింధూర్ తల పెట్టకపోతే ఇండియా అంతర్జాతీయంగా బలమైన నాలుగైదు దేశాలలో ఒకటిగా లెక్కింపబడుతున్న ఈ తరుణంలో తలొంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడి ఉండేదని భావించడం జరిగింది. ట్రంప్ నాయకత్వం గుడ్డివాడి చేతిలో రాయిని



మరిపిస్తున్నదని, సమర్థులైన ప్రసిడెంట్లను ప్రపంచానికి అందించిన అమెరికా ట్రంప్ రాకతో నగుబాటు పాలవుతున్నదన్న అభిప్రాయాలు దాదాపు అక్కడున్న అందరి నుంచీ రావటం గమనార్హం. మనం మరిన్ని అధునాతనఆయుధాలు సమకూర్చుకోవాల్సిన సమయం ఆసన్నమయిందని కొన్ని సంవత్సరాల కిందట ఆర్డర్ చేసిన యుద్ధవిమానాలు ఇప్పటికీ అందలేదని బాహాటంగా ఇండియన్ ఎయిర్ చీఫ్ చెప్పటం ప్రస్తావనకు వచ్చినప్పుడు ఇప్పుడున్న పరిస్థితులలో జాప్యం ఎంతమాత్రం తగదని సమావేశంలోని అందరూ అభిప్రాయపడ్డారు. మన సైన్యం ఏ దేశానికీ తీసిపోని విధంగా ఉందని, ఎన్నో విజయాలు దేశానికి అందించిన ఘనత భారత సైన్యానికి ఉందని ఉదాహరణలు ఇచ్చుకుంటూ కొందరు చెప్పటం దేశ సైన్యంపట్ల గౌరవాన్ని పెంచింది. మనదేశంలోని ముస్లిం నాయకులు, ప్రజాప్రతినిధులు ముక్తకంఠంతో మేము భారతదేశ పౌరులం, మీరు మతాన్ని వెలికి తెచ్చి పహల్గాంలో విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా కుట్ర పూరిత చర్యకు పూనుకోవడం అమానుషం అని పాకిస్థాన్‌కు నిర్ద్వంద్వంగా చెప్పటం భారతదేశ లౌకిక విధానానికి అంతర్జాతీయంగా ఎనలేని ప్రతిష్ట తెచ్చిందని చర్చల్లో పాల్గొన్న కొందరు ప్రత్యేకంగా చెప్పటం వింటున్న వారికి వళ్లు గగుర్పొడిచేట్లు చేసింది. మరొక ఆసక్తికరమైన అంశం సమావేశంలో చర్చకు వచ్చినప్పుడు కొంత ఉద్విగ్నత చోటు చేసుకుంది. ఎందుకు అధికారయంత్రాంగం రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గుతున్నదని ఇంతకు పూర్వం ఒత్తిళ్లు వున్నా అధికారులు సామరస్య ధోరణిలో నాయకుల సందేహాలు రూల్ విధానం చెప్పి తీర్చేవారని అందువల్ల ప్రభుత్వంలోని కొందరు నాయకులు స్వలాభాపేక్షతో తప్పులు చేయడానికి సిద్ధపడినా ప్రభుత్వంలో ఉన్నత స్థానంలో ఉన్ననాయకుడో, నాయకులో నచ్చచెప్పి, ప్రజలకు నష్టం జరగకుండా చూసేవారని, చర్చిస్తున్న వారిలో ఎక్కువ మంది అభిప్రాయపడ్డారు. అయితే అధికారుల్లో ఎక్కువ మంది జీ హుకుం అనటం చేత, స్వలాభాపేక్షతో ప్రభుత్వంలోని నాయకులు వారితో తప్పులు చేయిస్తున్నారని తాము మాత్రం చట్టానికి దొరకకుండా తప్పుకుంటున్నారని కొందరు గట్టిగానే వాదించారు. భిన్నాభిప్రాయాలు వ్యక్తమైన రాజకీయ నాయకులు కానీ, అధికారులు కానీ క్రమేపీ ప్రజాభిప్రాయం మేరకు లొసుగులను సరిదిద్దే ప్రయత్నం ఈ మధ్యకాలంలో చేస్తున్నారని ఇది మంచి పరిణామమని కొందరు సర్దిచెప్పటంతో ఆ అంశంపై చర్చకు ఫుల్‌స్టాప్ పడింది. అమెరికన్ ప్రసిడెంట్ ట్రంప్ వల్ల విద్యార్థులకు ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లేవారికి వెళ్లిన వారికి తీరని నష్టం జరుగుతున్నదని, ఇప్పుడు అమెరికాకు వెళ్లి ఆర్థికంగా న్యాయసమ్మతంగా ఎదుగుతున్న యువతకు బ్రేకులు పడుతున్నాయని, అక్కడి పరిస్థితులూ, ట్రంప్‌విధానాల వల్ల యువత వెనక్కు మళ్లుతుందని, అలాని అది ఒక విధంగా దేశానికి లాభదాయకమే అని భావించారు. అయితే ఇతర దేశాలకు మనదేశం నుంచి వెళ్లేవారి సంఖ్య ఈమధ్య పెరుగుతున్నదని అది శుభపరిణామమని కూడాగుర్తించారు. అమెరికాలో ఉన్న వయసు మళ్లిన మన దేశస్థులూ ముఖ్యంగా తెలుగువారు ప్రస్తుతం నానా ఇబ్బందులకు గురవుతున్నారని వెనుక నుయ్యి, ముందు గొయ్యిలా వారి పరిస్థితి ఉందని ఆవేదనతో కొందరు చెప్పటం ఈ అంశంలో మరో కోణాన్ని కూడా చూపించినట్లయింది. ఈ అంశాలే కాదు, మరెన్నో అంశాలు చర్చల్లో చోటు చేసుకున్నాయి. గంభీరంగా చర్చలు సాగినా హాస్యం కూడా సభ్యులు మాటల్లో చిలకరించటంతో సాయంకాలం సమావేశానికి వింత శోభను చేకూర్చినట్లయింది. సీనియర్లు, జూనియర్లను ఏ మాత్రం తీసిపోని విధంగా వయసును లెక్క చేయకుండా డిబేట్లలో ఏమాత్రం తగ్గేదేలే అన్న విధంగా పాల్గొనటంతో వయసు మళ్లినాకుర్రతనం పోగొట్టుకోలేదని ఆనాటి సాయంకాలం రాత్రిగా మారి వెలుగులు విరజిమ్మినప్పుడు తెలిసింది. అనుభవాన్ని అందుకే ఎవరూ కాదనలేరుగా! •

# అధికార లాంఛనాలతో మాజీ సిఎం రూపానీ అంత్యక్రియలు



సోమవారం విజయ్‌రూపాని భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న గుజరాత్ సిఎం భూపేంద్ర పటేల్

**న్యూఢిల్లీ, జూన్16:** గుజరాత్ మాజీ ముఖ్య మంత్రి విజయ్ రూపానీ అంత్యక్రియలు సోమ వారం రాజ్‌కోట్‌లో అధికార లాంఛనాలతో జరి గాయి. అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో దుర్మరణం చెందిన సంగతి తెలిసిందే. ఆయన మృతదేహాన్ని డిఎన్ఎ పరీక్షల ద్వారా అధికారులు గుర్తించారు. లండన్ ఉంటున్న తన భార్య, కుమార్తెను కలిసేందుకు వెళుతుండగా విజయ్ రూపానీ ఈ ప్రమాదంలో చిక్కుకున్నారు. అంతకుముందు రెండుసార్లు మే 19న, జూన్ 5న ఆయన లండన్ ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు. విమానం ఎక్కే ముందు ఎయిర్‌పోర్ట్‌లో రూపానీ ఎంతో ఉత్సాహంగా కనిపించిన దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. ఇద్దరు బ్రిటిష్ జాతీయులు తీసిన వీడియోలో ఈ దృశ్యాలు రికార్డయ్యాయి. జూన్ 12వ తేదీన ఎయిరిండియాకు చెందిన బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం అహ్మదాబాద్ విమానాశ్రయంనుంచి టేకాఫ్ అయిన కొద్ది సేపటికే కుప్పకూలింది. ఈ విమానం సమీ పంలోని ఓ మెడికో హాస్టల్‌పై పడటంతో పెను విషాదం చోటుచేసుకుంది. విమానంలో సుదూర ప్రయాణానికి సరిపడా సుమారు 1,25,000 లీటర్ల ఇంధనం ఉండటంతో, కూలిన వెంటనే భారీగా మంటలుచెలరేగాయి. ప్రమాద సమ యంలో విమానంలో 230 మంది ప్రయాణి కులు, 12 మంది సిబ్బంది సహా మొత్తం 242 మంది ఉన్నారు. వీరిలో ఒకే ఒక ప్రయాణికుడు స్వల్ప గాయాలతో అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడగా, విజయ్ రూపానీతో సహా 241 మంది దుర్మరణం పాలయ్యారు. కాగా విమానం కూలిన ప్రదేశంలోని మెడికో హాస్టల్‌లో కూడా భారీ ప్రాణనష్టం సంభవించింది. ఇప్పటివరకు 35 మంది వైద్య విద్యార్థులు మరణించగా, మరికొందరు ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని, దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విజయ్ రూపానీ అంత్యక్రియలను ఈ రోజు రాజ్‌కోట్‌లో పూర్తి ప్రభుత్వ లాంఛ నాలతో నిర్వహించినట్లు అధికారులు చెప్పారు. ఆయన జ్ఞాపకార్థం రాష్ట్ర ప్రభుత్వం ఒకరోజు సంతాపదినంగా ప్రకటించింది. ఈ అంత్య క్రియలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు పలువురు జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రము ఖులు హాజరయ్యారు.



# బాణాసంచా ఫ్యాక్టరీలో భారీ పేలుడు

## ఆరుగురు మృతి, 9 మందికి గాయాలు

**లక్నో, జూన్ 16:** ఉత్తరప్రదేశ్‌లోని బాణాసంచా కర్మాగారంలో సోమవారం మధ్యాహ్నం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఆరు గురు మహిళలు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో తొమ్మిది మంది మహిళలకు తీవ్రగాయాలు అయ్యాయి. వీరందరినీ హుటాహుటిన దగ్గర లోని ఆస్పత్రులకు తరలించారు. అటార్సి గ్రామంలోని టపాసుల తయారీ కేంద్రంలో ఈ పేలుడు సంభవించింది. విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి అత్యవసర సేవలైన అగ్నిమాపక, అంబులెన్స్, పోలీసులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. చనిపోయిన వారి మృతదేహాలను పోస్టుమార్టంకోసం తరలించారు. ఈ ఘటనపై రాజబ్‌పూర్ పోలీసు స్టేషన్ అధికారిమాట్లాడుతూ..'సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు అటార్సీలోని లైసెన్స్ పొందిన బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సంభవించింది. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే పోలీసులు, అంబులెన్స్, అగ్నిమాపక దళం ఘటనా స్థలానికి చేరుకు న్నాయి. ఈ ప్రమాదంలో ఆరుగురు మహిళా కార్మికులు చనిపోయారు. తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం అస్పత్రికి తరలించాం. మృతదేహాలకు పోస్టు మార్టం జరుగుతోంది. పేలుడు వెనుకగల కార ణాన్ని దర్యాప్తుచేస్తున్నాం' అని వెల్లడించారు.



# 'జనగణన'కు నోటిఫికేషన్ జారీ

**న్యూఢిల్లీ, జూన్ 16:** దేశంలో 15 యేళ్ల తర్వాత చేపట్టబోయే జన గణనకు సంబంధించిన కేంద్ర హోమ్‌మంత్రిత్వ శాఖ సోమవారం గెటిజ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో జనాభా లెక్కింపు ప్రక్రియ సోమవారం నుంచే అధికారికంగా ప్రారంభమైనట్లయింది. మొత్తంగా రెండు దశల్లో జనాభాను లెక్కించనున్నారు. 2027 మార్చి 1వ తేదీ నాటికి జనగణన పూర్తి కానుంది. మంచు ఎక్కువగా ఉండే 'కేంద్రపాలిత ప్రాంతాలు జమ్మూకాశ్మీర్, లడ్డాఖ్‌తోపాటు హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో 2026 అక్టోబరు 1 అర్ధరాత్రి వరకు జన గణనను నమోదు చేయనున్నాం. ఇవి కాకుండా దేశవ్యాప్తంగా మిగతా ప్రాంతాలన్నింటిలో 2027 మార్చి 1 నాటికి జనాభా లెక్కను పూర్తి చేయనున్నాం' అని హోమ్‌మంత్రిత్వ శాఖ ఆ నోటిఫికేషన్‌లో వెల్లడించింది. ఇది మొత్తంగా 16వ, స్వాతంత్ర్యానంతరం చేపట్టబోయే 8వ జన గణన.

ఈసారి జన గణనతోపాటు కుల గణననూ చేపడుతున్నారు. ఇందుకోసం మొత్తం 34 లక్షల మంది గణకులు, సూపర్‌వైజర్లు, 1.34 లక్షల మంది సిబ్బంది పని చేస్తారు. ఈసారి జనాభా లెక్కల సేకరణ అంతా ట్యాబ్‌ల ద్వారా పూర్తిగా డిజిటల్ రూపంలోనే సాగుతుంది. ప్రభుత్వం వెల్లడించే పోర్టళ్లు, యూప్‌లలో ప్రజలు సొంతంగానే తమ వివరాలను నమోదు చేసే వెసులుబాటునూ కల్పిస్తున్నారు. డేటా భద్రత కోసం కఠినమైన చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర హోమ్ శాఖ వెల్లడించింది. సమాచార సేకరణ, బదలీ, స్టోరేజీని అత్యంత కట్టు దిట్టంగా చేపడుతున్నట్లు తెలిపింది.

సాధారణంగా పదేళ్లకోసారి జనాభా లెక్కలు నిర్వహిస్తారు. చివరిసారి 2011లో దీన్ని చేప ట్టారు. 2021 జనాభా లెక్కలకు సంబంధించి 2020లోనే ఈ ప్రక్రియ చేపట్టాల్సింది. కానీ, కొవిడ్ కారణంగా వాయిదా పడింది. ఈ క్రమంలోనే జనగణనతోపాటు కుల గణన చేపట్టాలని దేశవ్యాప్తంగా డిమాండ్ పెరగడం, కొన్ని రాష్ట్రాల్లో స్థానిక ప్రభుత్వాలు పూర్తి చేయడంతో కుల గణనకూ కేంద్రం సిద్ధమైంది. ఇప్పటికే జనాభా లెక్కల వివరాల నమోదుకు సంబంధించియ 30కి పైగా ప్రశ్నలను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

# అహ్మదాబాద్ దుర్ఘటనలో మ్యూజిక్ ఆల్బమ్స్ దర్శకుడు అదృశ్యం

## మహేష్ జీరావాల మరణించి ఉంటాడని భావిస్తున్న పోలీసులు

## డిఎన్ఎ పరీక్షలకు రక్త నమూనాలు ఇచ్చిన కుటుంబ సభ్యులు



**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** గుజరాత్ రాజధాని అహ్మదాబాద్‌లో ఈ నెల 12వ తేదీన జరిగిన విమాన దుర్ఘటన ఎన్నో కుటుంబాల్లో విషాదం నింపడం తెలిసిందే. ఈ దుర్ఘటనలో విమాన ప్రయాణీకులతో పాటు సిబ్బంది, విమానం కూలిన ప్రాంతంలోని మెడికల్ కాలేజికి చెందిన వైద్యులు, అక్కడి సిబ్బంది కూడా మరణించడం విదితమే. ఇదే సమయంలో ఆ మార్గంలో ప్రయాణించిన కొందరి ఆచూకీ ఇప్పుడు తెలియరావడం లేదు. గుజరాత్‌లో పేరున్న మ్యూజిక్ అల్బమ్స్ దర్శకుడు మహేష్ జీరావాల అలియాస్ మహేష్ కలావాడియా (55) కూడా ఇలా కనిపించకుండా పోయిన వారిలో వున్నారు. విమాన దుర్ఘటన జరిగిన రోజున మధ్యాహ్నం 12 గంటల వేళ జీరావాల కారులో ఇదే ప్రాంతంలోని లా గార్డెన్‌లో తన మిత్రుడు ఒకరిని కలిసేందుకు వెళ్లారు. 1.14 గంటల సమయంలో ఆయన తన భార్య హీతల్‌కు ఫోన్ చేసి మీటింగ్ అయిపోయింది, నేను ఇంటికి బయలు దేరాను, వచ్చేస్తున్నాను అని చెప్పాడు. అయితే అరగంట తరువాత కూడా ఇంటికి రాకపోవడంతో తాను కంగారుపడి తన భర్త జీరావాలకు 1.41 గంటలకు ఫోన్ చేయగా స్విచాఫ్‌గా వచ్చిందని హీతల్ తెలిపారు. అంతకు కొన్ని నిమిషాల ముందే ఇదే ప్రాంతంలో విమాన దుర్ఘటన జరగడం, 275 మందికిపైగా ప్రయాణీకులతో పాటు మెడికల్ కాలేజి విద్యార్థులు, సిబ్బంది మరణించిన విషయం తనకు తెలిసిందని హీతల్ తెలిపారు. దీనిపై తాను పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు తన భర్త ఫోన్ చివరి లొకేషన్‌ను పరిశీలించగా విమాన దుర్ఘటనకు 700 మీటర్ల దూరంలో వుందని ఆమె వెల్లడించారు. ఈ దుర్ఘటనలో తన భర్త కూడా మరణించి వుంటా డని ఆమె విలపిస్తున్నారు.

సాధారణంగా తన భర్త ఆ మార్గంలో ఎప్పుడు ప్రయాణం సాగించడని, ఆ రోజున ఎందుకు వచ్చాడో తెలియడం లేదని హీతల్ తెలిపారు. కాగా విమాన దుర్ఘటనలో మరణించిన వారి భౌతిక కాయాలను గుర్తించేందుకు డిఎన్ఎ పరీక్షలు కొనసాగుతుండడంతో జీరావాల కుటుంబీకులు కూడా డిఎన్ఎ పరీక్షలనిమిత్తం రక్త నమూనాలను ఇచ్చారు. ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు కేవలం 60మృతదేహాలను మాత్రమే గుర్తించారు. ప్రమాదం జరిగిన సమయంలో వెయ్యి డిగ్రీల ఉష్ణోగ్రత జనించ డంతో ప్రయాణీకులతో పాటు మెడికల్ కాలేజి విద్యార్థులు ఇతరుల శరీరాలు గుర్తు పట్టేందుకు వీల్లేకుండా కాలిపోయాయి. ఇందులో అనేక మృతదేహాలకు డిఎన్ఎ పరీక్షలు నిర్వహించడం కూడా కష్టంగా మారిందని అధికారులు చెబుతు న్నారు. జీరావాలకు భార్య హీతల్‌తో పాటు ఒక కుమార్తె, కుమారుడు వున్నారు. పలు మ్యూజిక్ అల్బమ్స్‌తో అతను గుజరాత్ సినీ ప్రేక్షకులకు దగ్గరయ్యాడు. దీంతో పాటు బాలీవుడ్‌లోనూ పలు చిత్రాలకు పనిచేశాడు.

# పహల్గాంలో మళ్లీ పర్యాటక ప్రాంతాలు కళకళ



**జమ్మూకశ్మీర్, జూన్16:** పహల్గామ్ ఉగ్రవాద దాడి యావత్ భారత్‌ను ఉలిక్కిపడేలా చేసిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 22న పహల్గామ్ సమీపంలోని బైసరన్ గడ్డి మైదానంలో ఆహ్లా దంగా గడుపుతున్న పర్యాటకులపై టెర్రరిస్టులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఆ ఘటనలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. కేవలం పురుషులే లక్ష్యంగా చేసుకుని జరిపిన ఈ ఉన్మాదంతో ఎంతో మంది మహిళలు తమ పసుపు కుంకుమలకు దూరమయ్యారు. అయితే ఈ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్‌పేరుతో ఉగ్రవాద స్థావరాలపై మెరుపుదాడులు చేసి ఉగ్రవాదులను చావుదెబ్బ కొట్టింది.

ఇదిలా ఉంటే పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత జమ్ముకశ్మీర్‌లోని పర్యాటక ప్రాంతాలపై తీవ్ర ప్రభావం పడింది. పహల్గామ్, చుట్టుపక్కల ప్రాంతాలలో పర్యాటకుల రాకపోకలు తగ్గిపో యాయి. అక్కడికి వెళ్లాలంటేనే ప్రజలు అమ్మో అంటూ భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే భద్రతా కారణాల దృష్ట్యా కొన్ని పర్యాటక ప్రాంతాలను తెరవలేదు. ఉగ్రవాద దాడి కశ్మీర్‌లోయలోని పర్యాటక రంగాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. జమ్మూలోని మతపర మైన యాత్రలపై కూడా ప్రభావం చూపింది. తాజాగా, ఈ విషయంపై జమ్మూ, కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా స్పందించారు. మూసి ఉన్న పర్యాటక ప్రదేశాలు తిరిగి తెరచుకోనున్నాయని ఆయన ట్వీట్ చేశారు. భద్రతా పరంగా తీసుకున్న ముందు జాగ్రత్తల కారణంగా తాత్కాలికంగా మూసిన జమ్మూ కశ్మీర్‌లోని కొన్ని పర్యాటక ప్రదేశాలను జూన్ 17 నుంచి తిరిగి ప్రారంభించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఇందులో పహల్గామ్ మార్కెట్, వెరినాగ్ గార్డెన్, కోకర్నాగ్, అచాబల్ గార్డెన్, బేతాబ్ వ్యాలీ, పార్కులు ఉన్నాయని వెల్ల డించారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగాన్ని తిరిగి నిలబెట్టేందుకు వివిధ చర్యలు తీసుకుంటోంది. గత నెలలో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పహల్గామ్‌లో క్యాబినెట్ సమావే శానికి హాజరై, బేతాబ్ వ్యాలీ వంటి మూసిఉన్న ప్రాంతాలను సందర్శించారు.

# విమానం పేలిన ప్రదేశం నుంచి నడుచుకుంటూ వచ్చిన రమేశ్!



## మృత్యుంజయుడి మరో విడియో వైరల్

**న్యూఢిల్లీ, జూన్ 16:** అహ్మదాబాద్ విమాన ప్రమాద సమయంలో.. రమేశ్ విశ్వాస్‌కుమార్ మృత్యుంజయుడిగా ప్రాణాలతో బయటపడిన విషయం తెలిసిందే. ఆ విమానంలో ఉన్న 242 మందిలో 241 మంది చనిపోగా, రమేశ్ ఒక్కడే సజీవంగా ఉన్నాడు. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే బిజె మెడికల్ కాలేజీపై విమానం కూలిన తర్వాత ఆ ప్రాంతం నుంచి విశ్వాస్‌కుమార్ నడిచి వస్తున్న దృశ్యాలు మొబైల్ ఫోన్లకు చిక్కిన విషయం తెలిసిందే. ఈ నెల 12న జరిగిన ఆ ప్రమాద ఘటనకు చెందిన మరో విడియో ఒకటి వైరల్ అవుతోంది.

కొత్త విడియో చాలా భయానకంగా ఉంది. విమానం కూలగానే భారీగా మంటలు, పొంగ వ్యాపించిన విషయం తెలిసిందే. అయితే ఆ ప్రాంతం నుంచి రమేశ్ ఒక్కడే నడుచుకుంటూ వచ్చాడు. అతని వెనుక భాగం దట్టమైన మంట, పొగలు చిమ్ముతున్నా.. రమేశ్ మాత్రం తన చేతిలో ఫోన్ పట్టుకుని రోడ్డు వైపు నడిచాడు. అయితే సమీపంలో ఉన్న కొందరు వ్యక్తులు.. రమేశ్‌ను సురక్షిత ప్రదేశానికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. రమేశ్ తెలుపురంగు టీషర్టు ధరించినట్లు విడియోలో ఉన్నది. ఎడమ చేతిలో మొబైల్ ఫోన్ పట్టుకుని ఉన్నాడు. అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్తున్న విమానం.. టేకాఫ్ తీసుకున్న 32 సెకన్లకే కుప్పకూలింది. ఎమర్జెన్సీ గేటు సమీపంలోని 11ఎ సీటులో కూర్చున్న రమేశ్ ఒక్కడే ఆ దుర్ఘటనలో ప్రాణాలతో బయట పడ్డాడు. ఎలా తాను బతికానో చెప్పడం కష్టమే అని అతడు మీడియాకు చెప్పాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతడిని ప్రధాని మోదీ సహా ఇతరులు పరామర్శించారు.

# విమాన దుర్ఘటనలో 99 మృతదేహాల గుర్తింపు

## కొనసాగుతున్న డిఎన్ఎ పరీక్షలు

**అహ్మదాబాద్, జూన్ 16:** ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మరణించిన వారి మృత దేహాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. అహ్మదాబాద్ సివిల్ ఆస్పత్రిలో డిఎన్ఎ పరీక్ష ద్వారా ఇప్పటివరకు 99 మృతదేహాలను అధికా రులు గుర్తించారు. 64 మంది మృతదేహాలను కుటుంబసభ్యులకు వారు అప్పగించారు. వారంతా ఖేడా, అహ్మదాబాద్, కోట, మహే సానా, భరూచ్, వడోదర, అరవల్లి, ఆనంద్, జునాగఢ్, అమ్రేలి, మహిసాగర్, భావ్‌నగర్‌కు చెందిన వారిగా అహ్మదాబాద్ సివిల్ ఆస్పత్రి అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రజనీష్ పటేల్ తెలిపారు. గత వారం ఎయిర్ ఇండియాకు చెందిన డ్రీమ్‌లైనర్ ఫ్లయిట్ అహ్మదాబాద్‌లో కుప్పకూలిన విషయం తెలిసిందే. లండన్ బయల్దేరిన విమానం టేకాఫ్ అయిన సెకన్ల వ్యవధిలోనే ఓ బిల్డింగ్‌పై కుప్పకూలిపోయింది. ఈ ఘటనలో దాదాపు 270 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు. క్షతగాత్రులు అహ్మదా బాద్‌లోని సివిల్ ఆస్పత్రిలో చికిత్స పొందు తున్నారు.



# నిలకడగా సోనియాగాంధీ ఆరోగ్యం

**న్యూఢిల్లీ, జూన్ 16:** కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ ఆరోగ్యం మెరుగుపడుతోంది. అనారోగ్య సమస్యలతో ఆదివారం ఆమె ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆస్పత్రిలో చేరిన సంగతి విదితమే. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఉదర సంబంధిత సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రిలోని గ్యాస్ట్రో విభాగంలో చేరినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులు నిశితంగా పరిశీలిస్తున్నట్లు ఆస్పత్రి చైర్మన్ అజయ్ స్వరూప్ వెల్లడించారు. ఈ నెల 9న సోనియా ఇదే ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కొన్ని రోజుల క్రితం సిమ్లా పర్యటనలో ఉన్న ఆమెకు రక్తపోటు ఎక్కువ కావడంతో అక్కడ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్న సంగతి తెలిసిందే.

# అమెరికాలో కాల్పులు, ముగ్గురు మృతి

**వాషింగ్టన్, జూన్16:** అగ్రరాజ్యం అమెరికాలో మరోమారు ఉన్మాదుల తుపాకుల తూటాలకు అమాయకుల ప్రాణాలు గాల్లో కలిసిపోతు న్నాయి. తాజాగా, ఉటా రాష్ట్రంలో జరిగిన ఓ పండుగలో చెలరేగిన కాల్పుల భీభత్సం, పసికందుతో సహా ముగ్గురిని బలిగొంది. ఈ దారుణ ఘటనతో యావత్ అమెరికా ఉలిక్కి పడింది, తుపాకీ సంస్కృతిపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళితే, ఉటా రాష్ట్రంలోని వెస్ట్ వ్యాలీ సిటీలో గల సెంటెని యల్ పార్క్‌లో 'వెస్ట్‌ఫెస్ట్' పేరిట జరుగుతున్న వార్షిక కార్నివాల్ ఆనందోత్సాహాల మధ్య ఈ విషాదం చోటుచేసుకుంది. కార్నివాల్ రైడ్‌ల సమీపంలో ఈ ఘాతుకం జరిగినట్లు తెలు స్తోంది. వెస్ట్ వ్యాలీ సిటీ పోలీసులు ఈ ఘటనను ధృవీకరిస్తూ, తమ అధికారిక ఎక్స్ ఖాతాద్వారా ప్రాథమిక సమాచారాన్ని వెల్లడిం చారు. 'సెంటెనియల్ పార్క్‌లో జరుగు తున్న వెస్ట్‌ఫెస్ట్‌లో కాల్పులుజరిగాయి. పలువురు బాధితులు ఉన్నారు'. అని పోలీసులు తమ పోస్టులో పేర్కొన్నారు. ఈ అమానుష కాల్పుల్లో 8నెలల పసికందు ఎజ్రా పంతలి యోన్, 20 ఏళ్ల పాల్ తాహి, 21 ఏళ్ల ఏంజె లికా చావెజ్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. మరో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగాగాయపడ్డారు. వైద్య బృందాలు ఘటనాస్థలికి చేరుకుని వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండగా, మరొకరికి ప్రాణాపాయం లేదని వైద్యులుతెలిపారు.

సమాచారం అందు కున్న వెంటనే అత్యవసర సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను హుటా హుటిన సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వెస్ట్‌వ్యాలీ సిటీ పోలీసులు ఈ ఘటనపై కేసునమోదుచేసి, దర్యాప్తును ముమ్మరంచేశారు. ప్రాథమిక సమా చారం ప్రకారం, రెండు వర్గాల మధ్య తలెత్తిన ఘర్షణ కాల్పులకు దారి తీసి ఉండవచ్చని, ఇది ప్రతీకారచర్యగా జరిగిన గ్యాంగ్ సంబంధిత దాడిగా పోలీసులు అనుమానిస్తున్నారు.

# ప్రపంచంలో బడులకు వెళ్లని పిల్లలు 27.2 కోట్లు

## యునెస్కో జిఇఎం తాజా నివేదిక

**న్యూఢిల్లీ, జూన్ 16:** ప్రపంచవ్యాప్తంగా పాఠశా లకు వెళ్లని పిల్లల సంఖ్య ప్రస్తుతం దాదాపు 27.2 కోట్లుగా ఉందని ఐక్యరాజ్య సమితికి చెందిన యునెస్కో గ్లోబల్ ఎడ్యుకేషన్ మానిట రింగ్ టీమ్ (జిఇఎం) తాజా నివేదిక పేర్కొంది. ఇది గత అంచనాల కంటే 2.1 కోట్లు ఎక్కువ అని తెలిపింది. ప్రాథమిక పాఠశాల వయస్సు పిల్లల్లో 11 శాతం మంది (7.8 కోట్లు), లోయర్ సెకండరీ స్కూల్ వయస్సు కౌమారదశ పిల్లల్లో 15 శాతం మంది (6.4 కోట్లు), అప్పర్ సెకండరీ స్కూల్ వయస్సు వాళ్లలో 31 శాతం మంది (13 కోట్లు) పాఠశాలకు దూరంగా ఉన్నారని వెల్లడించింది. పాఠశాలలకు వెళ్లని పిల్లల పెరుగుదలకు ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయని పేర్కొంది. 80 లక్షల మంది (38 శాతం) పెరుగుదలకు కొత్త ఎన్‌రోల్‌మెంట్, అటెండెన్స్ డేటా లేకపోవడం కారణమని పేర్కొంది. 2021లో అఫ్ఘానిస్థాన్‌లో సెకండరీ విద్యలో చేరే విద్యార్థినులపై విధించిన నిషేధం కూడా ఇందుకు దోహదం చేసిందని వెల్లడించింది. మరోవైపు అప్‌డేట్ చేసిన యుఎన్ జనాభా అంచనాల కారణంగా మరో 1.3 కోట్ల మంది (మిగతా 62 శాతం) పెరిగారని, ఇది మరొక కారణమని తెలిపింది.

# ప్రయాణికుల భద్రతే ప్రధానం

## 'మ్యాన్ ఆఫ్ ది మంత్' అవార్డుల ప్రదానోత్సవంలో రైల్వే జిఎం జైన్ ఉద్ఘాటన




రైల్వే జిఎం జైన్‌చే మ్యాన్ ఆఫ్ ది మంథ్ అవార్డును అందుకుంటున్న సిబ్బంది

**గుంతకల్లు రైల్వే, జూన్ 16,ప్రభాతవార్త:** వర్షాకాలం సీజన్ ప్రారంభం అయినందున రైలు ప్రయాణికుల భద్రతకు,రక్షణలకై ప్రతి రైల్వే ఉద్యోగి నిబద్ధత,చిత్తశుద్ధిలతో పనిచేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ఉద్ఘాటించారు. సోమవారం రైల్వే జోనల్ ప్రధాన కార్యాలయం రైల్ నిలయం నుంచి భద్రతపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు జీఎం నీరజ్ అగర్వాల్ ప్రిన్సిపల్ సిఎస్ఒ కె. వెంకటరమణారెడ్డిలతో కలిసి జోన్‌లో జరుగుతున్న రైల్వే పనితీరును సమీక్షించారు. ప్రయాణికుల భద్రతా నిమిత్తం అన్ని ప్రధాన రైల్వే స్టేషన్‌లలో మార్గదర్శకాలు అందించేం దుకు అవసరాలకు సరిపడా సిబ్బందిని నియ మించుకోవాలని ఆయన సంబంధిత ఉన్నతాధి కారులను ఆదేశించారు. ఈ ఏడాది మే మాసంలో జోన్ పరిధిలో వివిధ ప్రాంతాలలో భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించేందుకు కృషి చేసిన సికింద్రాబాద్ డివిజన్‌లో ముగ్గురికి, విజయవాడ డివిజన్‌లో ముగ్గురికి,గుంటూరు డివిజన్‌లో ఇద్దరికి, హైదరాబాద్ డివిజన్‌లో ఒకరికి కలిపి జోన్ వ్యాప్తంగా మొత్తం 9మంది రైల్వే సిబ్బందికి జీఎం జైన్ మే మాసపు మ్యాన్ ఆఫ్ ది మంథ్ అవార్డులను ప్రధానం చేశారు. విపత్కర పరిస్థితులను నివారించడంలో విధి నిర్వహణ పట్ల అప్రమత్తత,అంకితభావంతో పనిచేసిన వారికి ఈ అవార్డులను అందచేశారు. సమావేశంలో ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ కె వెంకటరమణారెడ్డి,జోన్‌కు చెందిన ఆయా కీలక విభాగాలకు చెందిన ప్రధాన అధికారులతో పాటు గుంతకల్లుసహా వివిధ డివిజన్లకుచెందిన డిఆర్ ఎంలు, ఆయా విభాగాలకు చెందిన సంబంధిత ఉన్నతాధికారులు,సీనియర్ సబార్డినేట్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.

# వైసిపి నేతలపై జెసి ప్రభాకర్ రెడ్డి ఫైర్

### మా ప్రభుత్వం వస్తే అంటూ వైసిపి నేతలు బెదరింపులా? - చంద్రబాబు చక్కని పాలన అందిస్తున్నారు

**తాడిపత్రి, జూన్ 16, (ప్రభాతవార్త)** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చక్కని పరిపాలన అందిస్తూ శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్నాడని, వైసిపి వారి మా ప్రభుత్వం వస్తే మీ కథ చూస్తామని మాట్లాడుతున్నారని టిడిపి నేత, తాడపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం తాడపత్రి లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురించి మాట్లాడుతారా ఆయన చాలా మంచోడు అన్నారు.సీఎంకు చేతకాక కాదు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం చూస్తున్నాడు . వైసిపి హయాంలో లోకేష్ బాబు యాత్ర పెడితే అడ్డుకోవడమే కాకుండా మాట్లాడకుండా మైక్లు కూడా లాక్కున్నారు అని ధ్వజమెత్తారు. చంద్రబాబు సీఎం అయ్యాక రివెంజ్ అనేది లేదు ఉంటే మీ పరిస్థితి ఏంటి అని ఆయన ప్రశ్నించారు.మేము వస్తే మేము ఏదో చేస్తామని వైసిపి వారు అంటున్నారు... మిమ్మల్ని ఇప్పుడే ఏదైనా చేస్తే మీకు ఎవరు దిక్కు అని జేసీ ప్రభాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ వాళ్ళు అన్ని మాటలు మాట్లాడుతుంటే టీడీపీ వాళ్ళు ఏమి చేస్తున్నారు ఆయన ప్రశ్నించారు. వైసీపీ నాయకుడు దేవినేని అవినాష్ నువ్వు గాలి వస్తే పోయేలా ఉన్నావ్ నువ్వు కూడా మాట్లాడతావా అని ఆయన ఆరోపించారు.నా భార్య పై 10కేసులు, నా కోడలిపై రెండు కేసులు.. నా కొడుకు పై ఎన్నో కేసులు ఉన్నాయి అని జెసి ప్రభాకర్ రెడ్డి చెప్పుకొచ్చారు. వైసీపీకి జనం వస్తున్నారు అంటున్నారు దమ్ముంటే తాడిపత్రికి రమ్మనండి చూద్దాం అని ఆయన సవాలు విసిరారు. ఇప్పుడు వైసిపి వారు తమకు కోర్టు ఆదేశాలు ఉన్నాయంటున్నారు. మేము కూడా సుప్రీంకోర్టుకు వెళ్ళాము అప్పుడు స్టేలు ఏమయ్యాయి అని జెసి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నించారు. ఆరోజు వైసిపి వారికి తెలియదా మేము పోయి టిడిపి వారు అధికారంలోకి వస్తే పరిస్థితి ఏంటి అని ఆయన ప్రశ్నించారు. గత 5ఏళ్లు ఎప్పుడు చూసినా పోలీసులు, జైళ్లను చూసాం ఎప్పుడూ చూసిన హౌస్ అరెస్టులు అని ఆయన వెల్లడించారు.

మేధావులకు చెప్తున్నా అన్ని ఆధారాలతో నేను రెడీ మీరు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. మిమ్మల్ని ఇప్పుడే కొడితే ఎవరేం చేస్తారో చూస్తాం.. ఐఏఎస్ , ఐపీఎస్ లు గత ఐదేళ్లు చెడగొట్టి పోయారు వాటిని సీఎం సరి చేస్తున్నాడు ఆయన వెల్లడించారు.

వైసిపి వాళ్ళకి చంద్రబాబు నాయుడు అండగా ఉన్నాడు టిడిపి వాళ్లకు అండగా లేడు ఆయన వ్యాఖ్యానించారు.

చంద్రబాబు నాయుడు సీఎం గా గెలిచి మీకు అండగా నిలిచాడు లేకపోతే మీ పరిస్థితి ఇలా ఉండేది కాదు అని ఆయన చెప్పారు.

# దుర్గమ్మవారి బంగారం వెండి అప్పగింత

### - సేవాదారులే సారధులు - భద్రతలో రాజీలేదు: ఇఒ



అమ్మవారి బంగారం, వెండి స్వాధీనం చేస్తున్న పూర్వపు ఇఓ


**ఇంద్రకీలాద్రి, జూన్ 16, ప్రభాతవార్త** బెజవాడ దుర్గమ్మవారికి సంబంధించిన బంగారం, వెండి ఆభరణాలను ప్రస్తుత ఇఓ వికె శీనానా నాయక్కు పూర్వపు ఇఓ కెఎస్ రామారావు సోమవారం లెక్కలతో సహా అప్పగించారు. మంగళవారం బ్యాంకులాకర్లలో వున్న వస్తువులు అప్పగించే కార్యక్రమం జరుగుతుందని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. నిస్వార్ధంగా సేవలందించే సేవకులే అమ్మవారి సన్నిధిలో సారధులని ఇఓ వికె శీనానాయక్ అన్నారు. సోమవారం శ్రీ అమ్మవారి సేవకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దుర్గమ్మవారిని దర్శించుకోడానికి వచ్చే భక్తులకు మంచినీరు అందించడం, అన్నప్రసాద వితరణ, క్లోక్రూం, చెప్పులస్టాండ్, మొబైల్ భద్రపరిచే ప్రదేశం, భక్తుల ఫీడ్బ్యాక్ కౌంటర్, లిఫ్ట్క్యూ వద్ద, దేవస్థానం బస్క్యూ వద్ద, టోల్గేట్ వద్ద వాహనాల క్రమబద్ధీకరణ తదితర సేవలందించే భక్త బృందాల సేవలను వినియోగిస్తామన్నారు. ఆన్లైన్, ఆఫ్లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ అప్లికేషన్లు సిద్ధమయ్యాయన్నారు. శక్తి సేవ అని నామకరణం చేయాలని భక్తులు ఇఓను కోరారు. తిరుమల తరహా వసతి, రవాణా, లాకర్, అన్నప్రసాదం, సేవకులకు గుర్తింపుకార్డు, వసతి నుండి దేవస్థానంకు రవాణా సదుపాయాలు కల్పించాలని ఇఓ వారిని కోరారు. దుర్గమ్మవారి ఆలయ భద్రతలో రాజీ పడవద్దని ఇఓ ఆదేశించారు. సోమవారం దేవస్థానంలో కొత్తగా విధులు నిర్వర్తించడానికి వచ్చిన కొత్త బ్యాచ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీస్ సిబ్బందితో ఇఓ వికె శీనా నాయక్ సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఆలయంలో విధులు నిర్వర్తించే సమయంలో సెల్ ఫోన్లు వాడరాదని, సూపర్వైజర్ వద్ద మొబైల్ అనుమ తించబడుతుందని, సిబ్బంది సహకరిం చాలన్నారు.

## సచివాలయ ఉద్యోగుల హేతుబద్ధీకరణకు విధివిధానాలు జారీ

**విజయవాడ జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** గ్రామ వార్డుసచివాలయ ఉద్యోగుల హేతుబద్దీకరణకు ఏపీ ప్రభుత్వం విధివిధానాలు జారీ చేసింది. ఈ ఏడాది మే 31 నాటికి 5 ఏళ్ల పూర్తి చేసుకున్న వారిని తప్పనిసరిగా బదిలీ చేయాలని నిర్దేశించింది. 5 ఏళ్ల కాలం పూర్తి కానివారు వ్యక్తిగత అభ్యర్థన మేరకే బదిలీలకు అర్హులని పేర్కొంది. ఉద్యోగికి తన స్వగ్రామం మండలంలో ఎట్టి పరిస్థితుల్లోనూ పోస్టింగ్ ఇవ్వొద్దని ఆదేశించింది. భార్యాభర్తలిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైతే ఎకే ప్రాంతంలో పోస్టింగ్కు ఇవ్వాలని స్పష్టం చేసింది. ఈ మొత్తం బదిలీ ప్రక్రియ ఈ నెల 30 లోపు పూర్తిచేయాలని ఆదేశించింది.

## పరిశ్రమల శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్లుగా పదోన్నతులు

**విజయవాడ జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** పరిశ్రమల శాఖలో పనిచేసే పలువురు జాయింట్ డైరెక్టర్లకు అడిషనల్ డైరెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతి పొందిన స్థానంలో 15 రోజుల్లోగా బాధ్యతలు చేపట్టాలని వారిని ఆదేశించింది. ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్గా సుధాకర్, పరిశ్రమల శాఖ కమిషనరేట్ కార్యాలయం అదనపు డైరెక్టర్గా రామలింగేశ్వరరాజు, ఏపీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్గా ప్రతాప్లు వ్యవహరిస్తారని పేర్కొంది. 2024-25 ప్యానల్ సంవత్సరానికి సంబంధించి పదోన్నతులు కల్పించేందుకు ఆరుగురితో అధికారులు జాబితా రూపొందించారు. మొదటి మూడు స్థానాల్లో ఉన్నవారికి పదోన్నతి కల్పించారు.



## 2026హజ్ యాత్ర ప్రక్రియ ప్రారంభం

### - పాస్పోర్టులు సిద్ధం చేసుకోవాలని సూచన

**గుంతకల్లు రైల్వే, జూన్ 16,ప్రభాతవార్త** వచ్చే ఏడాది మే మాసంలో జరగబోవు హాజ్ యాత్ర-2026(1447-హెచ్)కు సంబంధించిన ప్రక్రియ ప్రారంభమైంది. భారత్ హజ్ కమిటీ ఆఫ్ ఇండియా కార్యనిర్వాహక ముఖ్యఅధికారి(సిఇఒ) సి. షానవాజ్ సోమవారం ఈ మేరకు సర్క్యులర్ (నెంబర్ 01తేదీ 16-06-2025)జారీ చేశారు. సౌదీ అరేబియా ప్రభుత్వ హజ్, ఉమ్రా మంత్రిత్వ శాఖ సూచనల మేరకు వచ్చే ఏడాది మే మాసంలోజరగబోవు హజ్-2026(1447-హెచ్)లో పాల్గొన్న/వెల్లదలచుకునే యాత్రికులు తమ ప్రాథమిక ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని పేర్కొంటూ 2026డిసెంబరు 31వ తేదీ వరకు చెల్లుబాటు అయ్యే తమ తమ పాస్పోర్టులను సిద్ధం చేసుకోవాలని, పాస్ పోర్టులలో అక్షర దోషాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. హజ్-2026(1447-హెచ్)కు సంబంధించిన పూర్తిస్థాయి నోటిఫికేషన్ జూలైలో విడుదల చేయనున్నట్లు ఆయన తమ సర్క్యులర్ పేర్కొన్నారు.

# ఎసిబికి చిక్కిన అవినీతి చేప

### - లంచం పుచ్చుకుంటూ దొరికిన ఇరిగేషన్ శాఖ అధికారి
### - కార్యాలయం సోదాలో ఎసిబికి దొరికిన మద్యం

**మార్కాపురం ,జూన్ ,16 ప్రభాతవార్త** జల వనరుల శాఖ మార్కాపురం డివిజన్ కార్యాలయం పై సోమవారం అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు నిర్వహించారు, ఈ దాడులలో ఒక గుత్తేదారుడినుండి 30 వేల రూపాయలను లంచంగా పుచ్చుకుంటూ ఇరిగేషన్ శాఖ సీనియర్ అసిస్టెంట్ , కార్యాలయ హెడ్ది కే శ్రీనివాసరావు ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు, అంతేకాకుండా అధికారులు కార్యాలయం సోదా నిర్వహించినప్పుడు శ్రీనివాసరావు ఆఫీసుగదిలో మద్యం దొరికినట్లు తెలిసింది, ఈ సందర్భంగా ఏసీబీ అధికారి పాత్రికేయులతో మాట్లాడుతూ జల వనరులకు సంబంధించి ఒక గుత్తేదారుడు చేసిన మూడు అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు మంజూరు కావలసి ఉంది, సదరూ బిల్లులను సకాలంలో తయారుచేసి మంజూరు చేయించేందుకుగాను గుత్తేదారుడు నుండి సీనియర్ అసిస్టెంట్ అయిన కే శ్రీనివాసరావు 30 వేల రూపాయలను లంచంగా ఇవ్వమని కోరినట్లు గుత్తేదారులు అనిశా అధికారుల దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు, గుత్తేదారుడు అనిశా అధికారులకు ఆశ్రయించడంతో సోమవారం ఏసీబీ బృందం గుత్తేదారుడు ప్రణాళిక ప్రకారం కార్యాలయం పై దాడులు నిర్వహించారు, గుత్తేదారుడు నుండి ఇరిగేషన్ శాఖ సీనియర్ శ్రీనివాసరావు నగదును పుచ్చుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్లు తెలిపారు, ఇదే సమయంలో అధికారులు కార్యాలయంలో సోదాలు నిర్వహించి దస్త్రాలు పరిశీలిస్తున్న సమయంలో కార్యాలయంలో మద్యం సీసాలు లభ్య మయ్యాయి, ఈ విషయాన్ని పాత్రికేయులు ఏసిబి అధికారులకు ప్రశ్నిస్తూ ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు అని అడగగా పూర్తి వివరాలు తర్వాత వెల్లడిస్తామని దాటవేశారు ఈ దాడులలో నెల్లూరు ప్రకాశం జిల్లాల ఏసీబీ డీఎస్పీ ఎస్ శిరీష సిబ్బంది పాల్గొన్నారు

## డిఎస్సీ సోషల్ స్టడీస్ పరీక్షకు 95.11 శాతం హాజరు

### నేటి నుంచి (17.6.25) స్కూల్ అసిస్టెంట్ కన్నడ, ఒడియా, తమిళం ఉర్దూ పరీక్షల ప్రాథమిక కీ విడుదల

**విజయవాడ,జూన్16,ప్రభాతవార్తప్రతినిధి :**మెగా డీఎస్సీ నిర్వహణలో భాగంగా సోమవారం జరిగిన స్కూల్ అసిస్టెంట్ (నాన్ లాంగ్వేజ్) సోషల్ స్టడీస్ పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా 38,243 అభ్యర్థులకు దరఖాస్తు చేసుకోగా 36,372 (95.11 ) మంది హాజరయ్యారని మెగా డీఎస్సీ-2025 కన్వీనర్ ఎం.వి.కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు227 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు ఉదయం అనంతపురం జిల్లాలో (97.84 ) మంది, మధ్యాహ్నం చిత్తూరు జిల్లాలో (97.98 )అత్యధికంగా అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు.మైనర్ మీడియా లాంగ్వేజెస్ కీ విడుదల.. స్కూల్ అసిస్టెంట్ (లాంగ్వేజెస్) మైనర్ మీడియా కన్నడ, ఒడియా, తమిళం, ఉర్దూ విభాగాలకు చెందిన ప్రాథమిక కీ ఈ నెల 17 నుండి వెబ్ సైటులో, రెస్పాన్స్ షీట్ అభ్యర్థుల లాగిన్ లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. అభ్యర్థులు ప్రాథమిక కీ పై తమ అభ్యంతరాలను తగిన ఆధారాలతో ఈ నెల 23లోపు వెబ్ సైట్ ద్వారా మాత్రమే తెలియజేయాలని మెగా డీఎస్సీ-2025 కన్వీనర్ ఎం.వి.కృష్ణారెడ్డి తెలిపారు.

## గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)కు రజత ఉత్సవ శుభాకాంక్షలు - సిఎంచంద్రబాబు

**విజయవాడ,జూన్16,ప్రభాతవార్త ప్రతినిధి:** గ్రామాల ఆర్థిక అభివృద్ధి కోసం, గ్రామాల్లో పేదరిక నిర్మూలన కోసం తీసుకొచ్చిన గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)ను మహిళలు ఓ ఉద్యమంలా తీసుకెళ్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు (దిలీ ద్భిఙ్ఖ్య ఫ్మ్య) కొనియాడారు. తొలుత వెలుగు అనే ఓ కార్యక్రమాన్ని చేపట్టగా.. అది కాలక్రమేనా సెర్ప్గా రూపాంతరం చెందిందన్నారు. సెర్ప్ను తీసుకొచ్చి నేటికి 25 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా గ్రామీణ మహిళలకు, సెర్ప్ ఉద్యోగులకు సీఎం అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్ లో ముఖ్యమంత్రి సరిగ్గా 25 సంవత్సరాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు అనే ఒక మారుమూల ప్రాంతంలో వెలుగు అనే ఒక కార్యక్రమాన్ని ప్రారంభించాను. గ్రామీణ ప్రాంత మహిళల భాగస్వామ్యంతో గ్రామాల ఆర్థికాభివృద్ధిని సాధించడమే ఆనాటి ప్రాజెక్టు లక్ష్యం. అది కాలక్రమంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (శీనిళిశి)గా రూపాంతరం చెందింది.

అప్పటి నుంచి లక్షలాది గ్రామీణ మహిళల జీవితాలలో, వేలాది గ్రామాలలో నిరంతరం అభివృద్ధి వెలుగులు నింపుతూ గ్రామీణ పేదరిక నిర్మూలనకు సెర్ప్ నిరంతరం కృషి చేస్తోంది. సెర్ప్ కార్యకలాపాలలో భాగస్వాములవుతూ... నవసమాజ నిర్మాతలై గ్రామీణ పేదరిక నిర్మూలనను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకువెళ్తున్న

గ్రామీణ మహిళలకు... వారిని ప్రగతి పథంలో నడిపిస్తున్న సెర్ప్ ఉద్యోగులకు ఈ సందర్భంగా అభినందనల్తు అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

## నీట్లో అర్హత సాధించిన డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ గురుకులాల విద్యార్థులకు అభినందనలు

### - సాంఘిక సంక్షేమ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

**సచివాలయం.జూన్16,ప్రభాతవార్త:** నీట్లో అర్హత సాధించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల విద్యార్థులను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అభినందించారు. మొత్తం 143 మంది అర్హత సాధించగా.. వారిలో 32 మందికి ఎంబీబీఎస్ సీట్లు దక్కే అవకాశముందని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయస్థాయి ప్రవేశ పరీక్షలో గురుకుల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రశంసించారు. పేదింటి బిడ్డలు డాక్టర్లు, ఇంజనీర్లు కావాలన్నదే సీఎం చంద్రబాబు స్వప్నమన్నారు. గురుకులాల్లో జేఈఈ, నీట్ కోచింగ్ సెంటర్లను ఈ ఏడాది 3 నుంచి 10కి పెంచినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

నాడు జగన్ నాన్నకు ఇంధనం పేరుతో నకిలీ మద్యంతో పేదల నుంచి రూ.వేల కోట్లు దోపిడీ చేస్తే.. నేడు చంద్రబాబు తల్లికి వందనంతో పేద విద్యార్థులకు రూ.10 వేల కోట్లు ఇచ్చారని అన్నారు. పేద విద్యార్థులను అత్యున్న స్థాయికి తమ ప్రభుత్వం తీసుకుని వెళ్తుందన్నారు.

# కళాత్మకయోగాతో ప్రజలలో మరింత చైతన్యం

### యోగాసనాలపై రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నాం: సెకెండరీ హెల్త్డైరెక్టర్ డా.ఎ.సిరి

**విజయవాడ జూన్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** కళాత్మక యోగసనాలతో ప్రజలకు మరింత చైతన్యం చేసేందుకు యోగాసనాలపై విభిన్న పోటీలను నిర్వహించి నైపుణ్యవంతులైన కళాకారులతో యోగాసనాలకు విస్తృత ప్రాచుర్యం కల్పిస్తున్నామని సెకండరీ హెల్త్ డైరెక్టర్ డా.ఎ.సిరి చెప్పారు. రాష్ట్రంలో 2 కోట్ల 20 లక్షల మంది యోగాసనాలను ఆచరించాలనే లక్ష్యంతో యోగాంధ్ర కార్యక్రమానికి రూపకల్పన చేసినట్లు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే టీమ్లను ఎంపిక చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల విజేతలతో సోమవారం ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి సమీపంలోని డాన్బాస్కో పబ్లిక్ స్కూల్లో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న పోటీలను సెకండరీ హెల్త్ డైరెక్టర్ డా.ఎ.సిరి, జిల్లా కలెక్టర్ డా.లక్ష్మీశ జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ లు జ్యోతి ప్రజ్వోలన చేసి ప్రారంభించారు. అనంతరం హెల్త్ డైరెక్టర్ డా.ఎ.సిరి మాట్లాడుతూ కళాత్మకమైన అంశాలతో కూడిన యోగాసనాలను ప్రదర్శించడం ద్వారా ప్రజలను యోగా పట్ల మరింత చైతన్యవంతులను చేయాలనే లక్ష్యంతో వివిధ విభాగాలలో యోగసనాలపై పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగా నృత్యం, యోగా చిత్రలేఖనం, యోగా చిత్రలేఖనం, యోగా ఫోటోగ్రాఫీ, యోగా స్లోగన్ వంటి అంశాలపై జిల్లా స్థాయిలో పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లా స్థాయి విజేతలకు రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించి ప్రతిభావంతులను గుర్తించనున్నామన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న మాసోత్సవాల ద్వారా ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా లక్ష్యాలాధి మంది ప్రజలను చైతన్యవంతులను చేసి యోగసనాల వైపు ఆకర్షితులను చేశామన్నారు. జనాభాలో కనీసం 40 శాతం రిజిస్ట్రేషన్ చేయించాలనే లక్ష్యంతో 2 కోట్ల 20 లక్షల మందిని యోగాలో రిజిస్ట్రేషన్ చేశామన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో వీరికి శిక్షణ ఇచ్చామన్నారు. రిజిస్ట్రేషన్ అయిన వారందరికీ యోగాపై శిక్షణ ఇవ్వడం జరిగిందని ,వీరికి శిక్షణ ఇచ్చేందుకు ప్రతి జిల్లాల్లో మాస్టర్ ట్రైనర్స్ ను గుర్తించి ఒక్కొక్క జిల్లాకు 100 మంది మాస్టర్ ట్రనర్స్తో ఐదు రోజులు శిక్షణ ఇచ్చామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1 లక్ష 25 వేల మంది శిక్షకులు యోగా కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు తీసుకున్నామన్నారు. 2 కోట్ల 20 లక్షల మంది ప్రజలకు శిక్షణ ఇచ్చే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామన్నారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు 15 కేటగిరిలో జూనియర్, యంగ్, సీనియర్ గ్రూపులలో గెలుపొందిన విజేతలు మండల జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి వచ్చారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 100కు పైగా ప్రముఖ పర్యాటక కేంద్రాలను గుర్తించి పర్యాటకులతో యోగా శిక్షణ నిర్వహించాలని లక్ష్యంగా చేసుకుని ఇప్పటికే 76 పర్యాటక కేంద్రాలలో శిక్షణ పూర్తి చేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ దిన చర్యలో భాగం చేసుకుని కనీసం 20 నిమిషాలు యోగా చేయాలన్నారు. యోగా మన జీవితంలో భాగం కావాలని, ఒత్తిడిని దూరం చేసి మానసిక ప్రశాంతతకు యోగా ఉపయోగపడుతుందన్నారు. ఈనెల 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో యోగా చేసే అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ మే 21వ తేదీ నుండి జూన్ 21వ తేదీ వరకు యోగాంధ్ర మాసోత్సవంలో భాగంగా జిల్లా వార్డు గ్రామ స్థాయిలో పెద్ద ఎత్తున యోగా నిర్వహించి పలు విభాగాలలో పోటీలు నిర్వహించామన్నారు. జిల్లాలో 10 లక్షల మందికి యోగా శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. జిల్లాలో 241 పడవలపై కృష్ణమ్మ ఒడిలో ఒకేసారి వందలాదిమంది యోగాసనాలతో ఫ్లోటింగ్ యోగా నిర్వహించి ప్రపంచ రికార్డు సాధించామన్నారు. రాష్ట్ర స్థాయి విజేతల ఎంపికను పారదర్శకంగా నిర్వహించేందుకు ఇతర జిల్లాల నుండి యోగా టీచర్లను న్యాయనిర్ణితలా నియమించామన్నారు. సమాజంలోఅందరూ ఆరోగ్యంగా ఉంటూ మంచి ఆలోచనలతో మెరుగైన సమాజ సాధన దిశగా వికసిత్ భారత్, విజన్ ఆంధ్ర 2047 సాధనకు యోగా దోహదపడుతుందన్నారు.

## బిహెచ్ఇఎల్, దుగరాజపట్నం ఓడరేవుల పనులు వెంటనే ప్రారంభించాలి

### - కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్

**వెంకటగిరి, జూన్ 16, ప్రభాతవార్త** దుగరాజపట్నం ఓడరేవు, బీహెచ్ఈఎల్ ఫ్యాక్టరీలను ప్రారంభించి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని మాజీ కేంద్రమంత్రి డాక్టర్ చింతా మోహన్ తెలిపారు. వెంకటగిరి లోనే పోలేరమ్మ గుడి కూడలి వద్ద ప్రభుత్వం డిమాండ్లను పరిష్కరించాలని ధర్నా చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు రాజధాని అంటూ ఇతర అభివృద్ధి పథకాలలో చేపట్టడం లేదని తెలిపారు. రాజధాని ప్రాంతాల్లో బంధువులు ఎక్కువగా ఉన్నందున ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి వారికి మేలు చేసే ప్రయత్నాలు చేస్తున్నట్లు విమర్శించారు. రాష్ట్రంలో నిరుద్యోగ సంస్థ చేర్చేందుకు మన్న వరం వద్ద ఉన్న బిహెచ్ఇఎల్ ఫ్యాక్టరీ పనులు వెంటనే పూర్తి చేయించాలని కోరారు. గూడూరు వద్ద ఉన్న దుగరాజు పట్నంవాడరేవు పనులను కూడా ప్రారంభించి పూర్తి చేయాలని కోరారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చిన సంక్షేమ పథకాలను కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. కూటమి ప్రభుత్వం మీద వ్యతిరేకత బాగా పెరిగిందని తెలిపారు. మొదట్లో నా మిత్రుడు చంద్రబాబు నాయుడు బాగా చేస్తాడని కానీ బందు ప్రీతి చూపిస్తున్నట్లు తెలిపారు. మన వరం బెల్ ఫ్యాక్టరీ పనులను వెంటనే పూర్తి చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న మాజీ కేంద్రమంత్రి డాక్టర్ చింతా మోహన్


### ఇరాన్ టివి లైవ్లో ఉండగానే స్టూడియోపై ఇజ్రాయెల్ దాడి

## యాంకర్కు ఊహించని అనుభవం!

**టెల్అవీవ్, జూన్ 16:**'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరిట ఇరాన్పై ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. సైనిక స్థావ రాలు, చమురు క్షేత్రాలు, అణుశుద్ధి కేంద్రాలే లక్ష్యంగా చేసుకొని భీకర దాడులు చేస్తోంది. ఈ క్రమంలోనే ఇరాన్ అధికారిక టివి (ఐఆర్ఐబి) యాంకర్కు ఊహించని అనుభవం ఎదురైంది. ఆమె వార్తల ప్రత్యక్ష ప్రసారంలో ఉండగానే స్టూడియోపై దాడి జరిగింది. దీంతో ప్రాణభయంతో ఆమె వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటనకు సంబం ధించిన దృశ్యాలు నెట్టింట వైరల్గా మారాయి. ఈ ఘటనతో ఐఆర్ఐబి తన ప్రత్యక్ష ప్రసారాన్ని నిలిపివేసింది. టెహ్రాన్లో టివి స్టూడియోలు ఉన్న ప్రాంతాన్ని ఖాళీ చేయాలని అంతకు గంటముందే ఇజ్రాయెల్ హెచ్చరికలు జారీ చేయడం గమనార్హం. ఇదిలా ఉండగా ఇరాన్పై వైమానిక ఆధిపత్యం సాధిం చామని టెల్అవీవ్ సోమవారం ప్రకటించింది. పశ్చిమ ఇరాన్ నుంచి రాజ ధాని టెహ్రాన్ వరకు గగనతలం తమ నియంత్రణలో ఉన్నట్లు వెల్లడించింది.

## ఇది యుద్ధాల శకం కాదు: సైప్రస్ అధ్యక్షుడితో భారత ప్రధాని మోడీ

**నికోసియా, జూన్ 16:** ఆపరేషన్ సిందూర్ సమయంలో సీమాంతర ఉగ్రవాదంపై భారత్ పోరాటానికి నిరంతరం మద్దతు ఇచ్చినందుకు సైప్రస్ అధ్యక్షుడు క్రిస్టోడౌలైడ్స్కు ప్రధాని మోడీ కృతజ్ఞతలు తెలిపారు. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం వల్ల పశ్చిమాసియాలో తలెత్తుతున్న ఉద్రిక్తతలపై ఇరువురు చర్చించుకున్నట్లు తెలిపారు. పశ్చిమాసియా, యూరప్లో కొనసాగుతున్న సంఘర్షణలపై ఆందోళన వ్యక్తం చేశారు. చర్చల ద్వారానే సమస్యలకు శాంతియుత పరిష్కారం పొందవచ్చని అన్నారు. ఇయు అధ్యక్ష పదవి సైప్రస్కు రావడంపై ఆ దేశానికి శుభాకాంక్షలు తెలిపారు. ఆ దేశ నాయకత్వంలో ఇయుతో భారత్కు మరింత మెరుగైన సంబంధాలు ఏర్పడతాయని అన్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్కు శాశ్వత సభ్యత్వం కోసం ఆ దేశం ఇయు మద్దతు సాధిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.



**సరికొత్త అధ్యాయం లిఖించేందుకు సువర్ణావకాశం..**

ఈ పర్యటనను ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో సరికొత్త అధ్యాయం లిఖించేందుకు సువర్ణావకాశంగా ప్రధాని మోడీ పేర్కొన్నారు. సైప్రస్కు భారత్ అత్యంత విశ్వసనీయ దేశమని అన్నారు. ప్రజాస్వామ్యం, చట్టబద్ధ పాలనపై పరస్పర విశ్వాసం ఇరు దేశాల సంబంధాలకు బలమైన పునాదిగా నిలుస్తుందన్నారు. సైప్రస్ ప్రభుత్వంతో రక్షణ, భద్రత, వాణిజ్యం, సాంకేతికకత, ఆరోగ్య సంరక్షణ, పునరుత్పాదక ఇంధనం వంటి రంగాలలో సహకారం గురించి చర్చలు జరిపినట్లు తెలి పారు. ఇరు దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలను ఎలా బలోపేతం చేయాలనే విషయాలపైనా తాము మాట్లాడుకున్నామన్నారు. సైప్రస్లో యోగా, ఆయుర్వేదం ప్రజాదరణ పొందుతుండడం ఆనందంగా ఉందని అన్నారు. వీలైనంత త్వరగా భారత్ను సందర్శించా ల్సిందిగా సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలైడ్స్ను మోడీ ఆహ్వానించారు. భారతీయులకు సైప్రస్ మంచి పర్యాటక ప్రాంతమని ఇరుదేశాల మధ్య నేరుగా విమాన సర్వీసుల ను తీసుకువచ్చేలా చర్చలు జరుగుతున్నాయని తెలిపారు.

ప్రధాని మోడీ ఆదివారం సాయంత్రం సైప్రస్ చేరుకు న్నారు. ఆయనకు లార్నాకా అంతర్జాతీయ విమానాశ్ర యంలో ఆ దేశ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలైడ్స్ సాదర స్వాగతం పలికారు. రెండు దశాబ్దాల తర్వాత భారత ప్రధాని సైప్రస్కు వెళ్లడం ఇదే తొలిసారి.

మోడీని అక్కడి ప్రభుత్వం ఆ దేశ అత్యున్నత పురస్కారమైన 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ఆర్డర్ మకరియోస్ 3'తో సత్కరించింది. ఈ పర్యటన తర్వాత.. ప్రధాని మోడీ కెనడా వెళ్లి అక్కడ జరగనున్న జి-7 సదస్సులో పాల్గొంటారు. అక్కడి నుంచి క్రొయేషియా పర్యటనకు వెళ్తారు.

## రాళ్ల దాడి కుట్రే :ఎస్సి సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్బాబు

**సచివాలయం,జూన్16,ప్రభాతవార్తప్రతినిధి:** పొగాకు రైతుల సమస్యలను తెలుసుకునేందుకు పొదిలికి వెళ్లిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి కాన్వాయ్ పై కుట్ర పూరితంగానే టిడిపి రాళ్లదాడి చేయించిందని వైకాంగ్రెస్ పార్టీ ఎస్సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు సుధాకర్బాబు పేర్కొన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

జగన్ ఎక్కడకు వెళ్లినా ప్రజల నుంచి వస్తున్న ప్రజాధరణను చూసి ఓర్వలేక టిడిపి ప్రణాళిక ప్రకారం ఇలా దాడులు చేయిస్తోందన్నారు. జగన్ ర్యాలీపై టిడిపి కార్యకర్తలు దాడులు చేస్తున్నట్లు వీడియోలు

ఉన్నప్పటికీ వైసిపి కార్యకర్తలపై పోలీసులు కేసులు నమోదు చేసి

అరెస్టు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.



తూర్పుగోదావరి, కాకినాడ

డా.బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

మంగళవారం 17 - జూన్ - 2025




# లబ్ధిదారుల గృహాలకుసోలార్ రూఫ్ టాప్ ప్యానల్ ఏర్పాటు వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ సగిలి సన్మోహన్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , జూన్ 16, ( ప్రభాతవార్త ) :**



జిల్లాలో గ్రామీణ ప్రాంతాలతో పాటు అర్బన్ ప్రాంతాల్లో పీఎం సూర్య ఘర్ పథకం కింద లబ్ధి గృహలపై సోలార్ రూఫ్ టాప్ ప్యానల్ ఏర్పాటు చేసుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో పీఎం సూర్య ఘర్ పథకం కింద లబ్ధి గృహలపై సోలార్ రూఫ్ టాప్ ప్యానల్ ఏర్పాటు, రిజిస్ట్రేషన్ పురోగతి, డ్వాక్రా మహిళలకు స్త్రీ నిధి రుణాలు మంజూరు వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. ఏపీఈపీడీసీఎల్, డీఆర్డీఏ, మెప్మా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూజిల్లాలో సోలార్ రూఫ్ టాప్ ప్యానల్ ఏర్పాటు వేగవంతం చేయాలన్నారు. ప్రాముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలతో పాటు అర్బన్ ప్రాంతాల్లో పీఎం సూర్య ఘర్ పథకం కింద లబ్ధిదారుల గృహలపై సోలార్ రూఫ్ టాప్ ప్యానల్ ఏర్పాటు చేసుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో మండల వారిగా లక్ష్యానికి అనుగుణంగా నూరు శాతం కృషి చేయాలని ఆయన తెలిపారు. సోలార్ రూఫ్ టాప్ ప్యానల్ ఏర్పాటుకు బ్యాంకర్ల ద్వారా రుణం మంజూరు ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలన్నారు. జిల్లా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థకు చెందిన క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా పీఎం సూర్య ఘర్ పథకం ప్రయోజనాలపై పట్టణ లబ్ధిదారులకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. పట్టణాల వారిగా సోలార్ రూఫ్ టాప్ ప్యానెల్ ఇన్స్టాల్ చేసే వేండర్స్ ను మెప్మా సిబ్బంది సమన్వయం చేసుకొని ఆయా పట్టణాల్లో లబ్ధిదారులతో సమావేశాలు ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జి.ప్రసాద్, డీఆర్డీఏ పీడి జీ. శ్రీనివాసు రావు, మెప్మా పీడీ బి.ప్రియంవద, ఎల్డీఎం సీహెచ్ఎస్వీ ప్రసాద్, ఏపీవోలు, ఆర్పీలు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం, ఆనందం, యోగాతోనే సాధ్యం : ఎమ్మెల్యే బండారు

**ఆత్రేయపురం , జూన్ 16, ( ప్రభాతవార్త ) :**



మనిషి దైనందిన జీవితంలో ఆరోగ్యంగా ఆనందంగా ఉండాలంటే ప్రతి ఒక్కరు క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం అవసరమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, ఆర్డీవో శ్రీకర్, ఈవో నల్లం సూర్య చక్రధరరావులతో కల్సి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శరీరం, మనసులను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి యోగా అత్యుత్తమమార్గమన్నారు. ప్రస్తుతం ఆధునిక జీవన శైలి వల్ల ప్రజలు అనేక మానసిక,శారీరక రుగ్మతలకు గురవుతున్నారన్నారు. నిత్యం యోగ, ప్రాణాయామం సాధన చేయడం ద్వారా రుగ్మతలు లేని జీవితాన్ని పొందవచ్చని సూచించారు. యోగాను ప్రతీ ఒక్కరూ తమ నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని అన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో ఆహ్లాదకర వాతావరణంలో యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనడం సంతోషాన్ని ఇచ్చిందని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో ముళ్ళపూడి భాస్కరరావు , కరుటూరి నరసింహారావు, కాయల జగన్నాథం, ఏపుగంటి వెంకటేష్, కూటమి నాయకులు, అధికారులుతదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి : ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**ఆత్రేయపురం , జూన్ 16, ( ప్రభాతవార్త ) :**

కూటమి ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆ దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు అన్నారు. సోమవారం ఆత్రేయపురంలో రూ. 20.65లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన సీసీ రహదారుల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. అనంతరం రజకపేటలో 40 వేల లీటర్ల కెపాసిటీతో, రూ. 77లక్షల అంచనా విలువతో నిర్మించనున్న వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బండారు కాలనీలో 60వేల లీటర్ల కెపాసిటీతో, రూ. 84 లక్షల వ్యయంతో నిర్మించనున్న వాటర్ ట్యాంక్ కు శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మండల టిడిపి అధ్యక్షులు కూసం పూడి రామకృష్ణంరాజు, సర్పంచ్ గెడ్డం సుధ, జిల్లా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు,ముదునూరి వెంకటరాజు, కాయల జగన్నాథం, ఎంపిడిఓ వెంకట్రామన్, ఆర్ డబ్ల్యుఎస్ జె ఈ, శ్రీధర్,కూటమి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ 2025 విద్యార్థులకు ఆకాష్ ఘన సత్కారం

**కాకినాడ రూరల్ , జూన్ 16, ( ప్రభాతవార్త ) :**



వైద్య కోర్సుల్లో చేరేందుకు అర్హత సాధించిన ఆకాష్ విద్యాసంస్థ ర్యాంకర్లను యాజమాన్యం ఘనంగా సత్కరించింది. ఈ మేరకు సోమవారం కాకినాడ లోని తమ కార్యాలయంలో నిర్వహించిన అభినందన సభలో బ్రాంచ్ మేనేజర్ సూర్య భాస్కర్, అకాడమిక్ హెడ్ మని శేఖర్, పణి కుమార్ మాట్లాడుతూ ఇటీవల విడుదలైన నీట్ 2025 ఫలితాల్లో దేశ వ్యాప్తంగా లక్షలాదిమంది పోటీపడిన ఆకాశ్ విద్యార్థులు మొదటి 10 లో 2,3,5, 9,10 ర్యాంకులను కైవసం చేసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఇండియా లో ఉత్తమ ర్యాంక్ 297 నిఖిల్ సాయి కాకినాడ బ్రాంచ్ కు చెందిన విద్యార్థిగా ఆకాష్ ,కాకినాడకు చెందిన లాస్య శ్రీరెడ్డి 982వ ర్యాంకులను సొంతం చేసుకోవడం జరిగిందన్నారు. అదేవిధంగా తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎం కునాల్ 479, రుత్విక్ జోష్ 557, తేజేశ్వర్ కృష్ణ మూర్తి 620 వ ర్యాంకు, హర్షత 5513, తేజస్వీ సత్య 6646, ఆరుని బెహరా 10420, దీప్తి సాయి 17838 ర్యాంక్ పొందారు. 100లోపు 29 ర్యాంకులు సాధించినట్టు వెల్లడించారు. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా ఉత్తమ ర్యాంకుల సాధనలో తమ సంస్థ ముందంజలో ఉందన్నారు. విద్యార్థుల పట్ల స్థాయి శ్రద్ధ చూపుతూ వారు ర్యాంకులు సాధించే దిశలో సిబ్బంది చేసిన కృషిని చీఫ్ అకాడమిక్ హెడ్ & బిజినెస్ హెడ్ ధీరజ్ మిశ్రా స్టేట్ హెడ్ ఆర్వీఎస్ నారాయణమూర్తి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సంస్థ ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం..డిగ్రీ కళాశాల విద్యార్థులకు యోగాపై అవగాహన




**రావులపాలెం , జూన్ 16, ( ప్రభాతవార్త ) :**

యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా సోమవారం రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు యోగా సాధనపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు యోగ, ధ్యానం చేయడంతో పాటు వ్యాయామంలో మెళకువలను నేర్చుకున్నారు. ప్రతి ఒక్కరూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని, యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యంలభిస్తుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ అధికారి ఎస్.అరుణ్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ ఎన్.యువరాజ్, వైస్ ప్రిన్సిపాల్ యు.రమేష్ బాబు, అధ్యాపకులు బి.పి.ఎన్.రెడ్డి, సుభాషిని, సుమలత, రజిని, శ్రీనివాస్, దుర్గాదేవి, సౌజన్య, సిద్ధార్థ, విద్యార్థులు పాల్గొన్నారు.

# అన్నవరం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

**అన్నవరం , జూన్ 16, ( ప్రభాతవార్త ) :**

లయన్స్ క్లబ్ ఆఫ్ అన్నవరం శ్రీ సత్యదేవ నూతన కార్యవర్గాన్ని సోమవారం ప్రకటించారు. 2025 - 26 వ సంవత్సరమునకు లయన్స్ క్లబ్ నూతన ప్రెసిడెంట్గా అడపా సత్తి బాబు, సెక్రటరీగా పొన్నాడ సూరిబాబు ట్రెజరర్ గా బుడ్డిగా వాసు ని సభ్యులంతా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ద్వారా సమాజానికి సేవ చేసే అవకాశం లబించిందని నూతన కార్యవర్గ సభ్యులు సంతోషం వ్యక్తం చేసారు. వీరికి గత అధ్యక్ష, కార్యదర్శి లు, మచ్చా నాగేశ్వరావు, కాలుబోయిన సత్తిబాబు, పంచాది గుర్రాజుతో పాటు సభ్యులు దొంకాడ గిరి పర్వత జానకి, ప్రకాష్, నానాజీ అభినందనలు తెలియజేసారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు రూ.4 కోట్లతో ఉపకరణాలు : మంత్రి సుభాష్

**కోనసీమ బ్యూరో , జూన్ 16, ( ప్రభాతవార్త ) :**




ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగులకు అండగా ఉండి ఆదుకుంటామని, మీరు మనో ధైర్యంతో, ఆత్మ నిబ్బరంతో ముందుకు సాగాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వానంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (అలింకో) ద్వారా ఏర్పాటుచేసిన కృత్రిమ ఉపకరణాలను మంత్రి సుభాష్ చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకొని సకలాంగులు మాదిరిగా సమాజంలో ఉన్నతంగా ఎదగాలని మంత్రి సుభాష్ విభిన్న ప్రతిభావం తులైన దివ్యాంగులకు పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో సుమారుగా రూ. 86 లక్షలతో 290 మంది దివ్యాంగులకు 554 కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆలింకో భారత ప్రభుత్వం లోని సామాజిక న్యాయం,సాధికారత మంత్రిత్వ శాఖలోని దివ్యాంగుల సాధికారత సంక్షేమం కోసం పనిచే స్తుందన్నారు. కృత్రిమ అవయవాలు ఉపకరణాలు వాటి భాగాల లభ్యత, వినియోగం, సరఫరా పంపిణీని ప్రోత్సహిస్తుం దన్నారు. ముఖ్యంగా ఆర్థోపెడిక్, దృష్టిలోపం, వినికిడి లోపం, మేధో వైకల్యం గల వికలాంగుల ఆరోగ్య సంరక్షణ కొరకు పరికరాలు వ్యక్తిగత రక్షణ కిట్లు ఉచితంగా అందిస్తుందన్నారు. వికలాంగుల రక్షణ సిబ్బంది, ఆసుపత్రులు ఇతర సంక్షేమ సంస్థలకు చేయూతనంది స్తుందన్నారు పిల్లలు, మహిళలు, వృద్ధులు మరియు వికలాంగు లకుతగిన శిక్షణ కార్యక్ర మాలను నిర్వహిస్తుందన్నారు. గత సంవత్సరం నవంబర్ 4 వ తేదీన నియోజకవర్గ పరిధిలో ఆలింకో సంస్థ దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించి వికలాంగత్వ లోపాలను శాస్త్రీయ పరంగా గుర్తించి అర్హులైన వారికి కృత్రిమ అవయవాలు పంపిణీకి చర్యలు చేపట్టిందన్నారు. అదేవి ధంగా కృత్రిమ అవయవా ల పంపిణీకై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు రూ. 4 కోట్లు సంస్థ కేటాయించిందని దీనిలో భాగంగా రామచంద్రపురం నియోజకవర్గానికి రూ. 86 లక్షలు వెచ్చించినట్లు తెలిపారు. బ్యాటరీ ఆపరేటర్ మోటార్ సైకిల్లు 68, ట్రై సైకిళ్లు 41, వీల్ చైర్లు 62, నడక కర్రలు 30, మందికి, అత్యధిక డిజిటల్ వినికిడి యంత్రాలు బ్యాటరీలతో సహా 22 మందికి ఉచితంగా ఆయన సంస్థ తరుపున పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో ఆలింకో సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ సంజయ్ సింగ్, పి ఓ రవి శంకర్, శివాసిస్ పట్నాయక్, జిల్లా పరిషత్ సీఈవో వి వి వి ఎన్ లక్ష్మణరావు, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, మున్సిపల్ చైర్ పర్సన్ రాదంశెట్టి శ్రీదేవి, ఎంపీపీ, ఎంపీడీవోలు పద్మజ్యోతి, రాంబాబు, శ్రీనివాస్, కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా లంకాలమ్మ అమ్మవారి జాతర



**అంబాజీపేట , జూన్ 16, ( ప్రభాతవార్త ) :**

మండలంలోని ముక్కామల గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ లంకాలమ్మ అమ్మవారి జాతరను సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. జాతరలో ఏర్పాటు చేసిన గరగ నృత్యాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మంగళవారం అమ్మవారి తీర్ధంను నిర్వహిస్తున్నామన్నారు. అలాగే తొండవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారి తీర్ధంను మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

# మండల వ్యవసాయాధికారిగా ధర్మప్రసాద్

**అంబాజీపేట , జూన్ 16, ( ప్రభాతవార్త )**



మండల వ్యవసాయా ధికారిగా కె.ధర్మ ప్రసాద్ ఉద్యోగ బాధ్యతలను సోమవారం చేపట్టారు. సాధారణ బదిలో భాగంగా అమలాపురంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. అలాగే ఏఈఓగా జి.శివమోహన్ అల్లవరం నుండి అంబాజీపేటకు బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఏఓ సీహెచ్. డి.విజయ్ కుమార్, ఏఈఓ డి. దుర్గారావులు స్థానిక భూసార పరీక్షా కేంద్రానికి బదిలీ అయ్యారు.

# సైఫాన్ నిర్మాణ పనులు పరిశీలించిన జిల్లా కలెక్టర్



**ఆత్రేయపురం,జూన్ 16, ( ప్రభాతవార్త ) :**

ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న సైఫాన్ పనులను సోమవారం జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ , ఇరిగేషన్ ఎస్.ఈ కె గోపీనాథ్, డ్రైన్స్ డిఈఈ నాగార్జున్ రావు పరిశీలించారు. రైతులకు వర్షాకాలం ముంపు సమస్యలు తలెత్తకుండా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న సైపాన్లు లొల్ల , వాడపల్లి, మెర్లపాలెం, ర్యాలి, గ్రామాల రైతులకు ఇబ్బందులు లేకుండా పనులు త్వరగా చేయాలని ఆయన కాంట్రాక్టర్కు ఆదేశించారు. ఆయన వెంట డ్రైన్స్ జేఈ జయలక్ష్మి,ఉన్నారు.

# త్వరలో కమ్మిరెడ్డి పాలెం నుంచి వాడపాలెం రహదారి అభివృద్ధి : ఎమ్మెల్యే సత్యానందరావు

**కొత్తపేట , జూన్ 16, ( ప్రభాతవార్త ) :**



వైసిపి హయంలో నిర్లక్ష్యానికి గురైన రహదారుల నిర్మాణం, అభివృద్ధి పనులకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. కొత్తపేట నుంచి వాడపాలెం వరకూ రూ. 3కోట్లతో త్వరలో నిర్మాణం చేపట్టనున్న రహదారిని సోమవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ ఆఫీసర్ పి రామకృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ డివిజనల్ ఆఫీసర్ ఏవి సూర్యనారాయణ లతో కల్సి పరిశీలించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించనున్న ఈ రహదారికి ఇటీవలే నిధులు మంజూరు అయ్యాయి. అత్యంత పారదర్శకంగా రహదారి నిర్మాణ పనులను చేపట్టి, త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమం లో జె ఈ వీరభద్రరావు, తాసిల్దార్ రాంబాబు,త్సమా బాబు,బూసి జయలక్ష్మి భాస్కరరావు, అధికారులు మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# మామిడికుదురు ఎంఆర్వోగా పి.సునీల్ కుమార్

**మామిడికుదురు , జూన్ 16, ( ప్రభాతవార్త ) :**

మామిడికుదురు మండల రెవెన్యూ అధికారిగా పి.సునీల్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కాట్రేనికోన ఎమార్వోగా పనిచేస్తున్న సునీల్ కుమార్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించడానికి వచ్చిన ఎమ్మార్వో ను కార్యాలయ ఉద్యోగులు సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. డిప్యూటీ ఎమ్మార్వో శరణ్య కార్యాలయ సిబ్బందిని, వీఆర్వోలను,పలు విభాగాలకు చెందిన ఉద్యోగులను పరిచయం చేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎమ్మార్వోఇటీవల పదవీ విరమణ పొందడంతో డిప్యూటీ ఎమ్మార్వో శరణ్య ఇంతవరకు ఇంచార్జ్ ఎమ్మార్వోగా బాధ్యతలు నిర్వహించారు.

# శ్రీ రావులమ్మ తల్లికి రజత ఆభరణాలు బహూకరణ

**కోనసీమ బ్యూరో , జూన్ 16, ( ప్రభాతవార్త ) :**



అయినవిల్లి మండలం లోని, కె.జగన్నాధపురం గ్రామంలో వెలసిన గ్రామదేవత శ్రీ రావులమ్మ తల్లి జాతర, తీర్థ మహోత్సవాలు సందర్భంగా,అదే గ్రామానికి చెందిన కీ'శే ఓదూరి పద్ద రాజు సత్యవతి దంపతుల చిన్న కుమారుడు వెంకటేశ్వరరావు(చిన్న), సీతారత్నం దంపతులు రజిత కిరీటం, నేత్రాలు,కను బొమ్మలు,నాశికా భరణాలు బహుకరించారు. గ్రామప్రజల ఇలవేల్పుగా,కొంగుబంగారమై భాసిల్లే రావులమ్మ తల్లి సేవలో భాగస్వామ్యం కావటం ఆనందకరమని ఈ సందర్భంగా దాతలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పునః నిర్మాణ కమిటీ యర్రంశెట్టి శ్రీనివాస రావు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. 18న పెద్ద జాగరం, 19న తీర్థ మహొత్సవము జరుగునని యావన్మంది గ్రామ ప్రజలు ,భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకుని చల్లని తల్లి కృపకు పాత్రులు కాగలరని కోరారు. ముఖ్య అతిధులుగా బొక్క శ్రీనివాసరావు (పోలీస్ డిపార్ట్మెంట్) మీసాల పెద్ద కాపు,మల్లాది మల్లిబాబు మాస్టారు పాల్గొన్న ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గుత్తుల రవి,గంగుమళ్ళ శ్రీనివాస్,మిద్దె పట్టాభి,నందుల నాగయ్య,గనిశెట్టి వెంకటేశ్వరరావు(బాబీ మాస్టారు) బొబ్బిలి బాలాజీ,వల్లభ రెడ్డి సూరిబాబు,నల్లా సత్తిబాబు,మల్లాది రామలింగేశ్వరరావు,నల్లా ఏడుకొండలు,నల్లా గణేష్,ములికి వీర వెంకట సత్యనారాయణ మూర్తి,గాలి దేవర సతీష్,మేడిశెట్టి సత్యనారాయణ మరియు మహిళలు గ్రామ ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


**కౌలు టెండరు కమ్ బహిరంగ వేలం ప్రకటన హక్కు**

కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సర్పవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ భావనారాయణ స్వామివారి దేవస్థానమునకు చెందిన పిఠాపురం, రాజుపూడి, ఎ.విజయనగరం, మాధవపట్నం, సర్పవరం గ్రామంలో గల భూములకు మరియు సర్పవరం గ్రామంలో సర్వే నెం. 35లో య.2.50 సెంట్లు రాజ్యలక్ష్మి ఉద్యానవనం నందు గల చెరువునకు సాగు చేసుకొను హక్కు మరియు భూమికి కౌలు హక్కుకు 3 సంవత్సరముల కాలపరిమితి అనగా 2025-26 సంవత్సరం నుండి 2027-28 సంవత్సరం వరకు ది.27.06.2025 తేదీన ఉదయం 10:00 గంటలకు దేవస్థానం వద్ద టెండర్ కమ్ బహిరంగ వేలం పాటలు నిర్వహించబడును. కావున ఆసక్తి గలవారు వేలంపాట నందు పాల్గొనవలసిందిగా తెలియపరచడమైనది మిగిలిన వివరములు దేవస్థానం కార్యాలయం నందు సంప్రదించవలెను.

సర్పవరం
17-06-2025.

మాచిరాజు లక్ష్మీనారాయణ
కార్యనిర్వాహణాధికారి

# జాబ్ మేళాలో 78 మందికి ఉద్యోగ అవకాశం

## - వాసంశెట్టి సత్యం, కంపెనీ ప్రతినిధులుచే నియామక పత్రాలు అందజేత

**కోనసీమ బ్యూరో , జూన్ 16, ( ప్రభాతవార్త ) :**

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో సోమవారం రామచంద్రపురంలోని ఉపాధి కార్యాలయంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం పర్యవేక్షణలో నిర్వహించిన జాబ్ మేళాలో 78 మంది ఎంపిక అయ్యారు. ఇందులో డిక్సన్ లో 11 , టైటే కెమ్బింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ లో 08 , మేడ్ ప్లస్ లో 15 ,మెట్రో కేం 17 , డిమార్ట్ 05 , ఎస్ బి ఐ కార్డ్స్ లో 22 వెరసి మొత్తం 78 మంది ఎంపిక అయ్యారు. ఎంపికైన వారికి సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, కంపెనీ ప్రతినిధుల సమక్షంలో సోమవారం ఉపాధి కార్యాలయంలో నియామక పత్రాలు అందించడం జరిగింది. మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో ప్రతివారం రామచంద్రపురంలోని ఉపాధి కార్యాలయంలో పలు కంపెనీలు జాబ్ మేళా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. నియోజవర్గంలో నిరుద్యోగ సమస్యను రూపుమాపేందుకు రాష్ట్రంలోని పలు కంపెనీలతో ఒప్పందం చేసుకొని దశలవారీగా జాబ్ మేళాను నిర్వహించి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నారు. ఉపాధి కల్పన నిరంతర ప్రక్రియగా సాగాలనదే మంత్రి సుభాష్ అభిమతం. కంపెనీ ప్రతినిధులు హర్ష, దుర్గ ప్రసాద్, తేజ, సతీష్, తదితరులు , ఉపాధి ప్రాజెక్ట్ డైరెక్టర్ రామ్ కుమార్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం తమకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన కంపెనీ హెచ్ఆర్ లకు, ఉపాధి కార్యాలయం, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ కు ఉద్యోగ అవకాశం పొందిన వారు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం మంగళవారం మంత్రి సుభాష్ పుట్టినరోజును పురస్కరించుకుని ఉద్యోగ భవన్లో కేకు కోసి ముందస్తు వేడుకలు నిర్వహించారు.

# విద్య ద్వారానే పెను మార్పులు : సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ



**కాకినాడ టౌన్ , జూన్ 16, ( ప్రభాతవార్త ) :**

విజ్ఞానంతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారానే దేశంలో పెను విప్లవాత్మక మార్పులు వస్తాయని సిబిఐ విశ్రాంత జేడీ వివి లక్ష్మీనారాయణ అన్నారు. విలువలతో కూడిన విద్యుత్ అభ్యసించడం ద్వారా వారు దేశాభివృద్ధితో పాటుగా దేశ నిర్మాణానికి కూడా ఎంతో ఉపయోగపడతారని చెప్పారు. అందుకే బలమైన పునాదితో కూడిన విద్య చాలా అవసరమని జేడీ చెప్పారు. సోమవారం కాకినాడ గాంధీ నగర్లో ఉన్న భారతీయ విద్యా భవన్కు చెందిన బాల వాటిక అనే కేంద్ర పాఠ్యాంశాలతో కూడిన పాఠశాలను జేడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యతోనే సమాజంలోనూ ఎంతో మార్పు వస్తుం దన్నారు. భారతీయ విద్యా భవన్ దేశ విదేశాల్లో ఎంతోమందికి ఉన్నతమైన విద్యను అందించి వారిలో వృత్తి శిక్షణ, నైపుణ్యాభివృద్ధిని పెంచి దేశ నిర్మాణానికి ఎంతో విలువైన కూడిన విద్యను విద్యార్థులకు అందిస్తోందన్నారు. ఈ పాఠశాలలో విజ్ఞానంతో పాటుగా కళలు, పరిజ్ఞానం వంటి పునాది నుండే నేర్పుతారని జేడీ చెప్పారు. ఎంతో అనుభవం ఉన్న వారంతా మంచి విద్యను అందించాలని లక్ష్యంతో భారతీయ విద్యా భవన్ బాల ఆధ్వర్యంలో బాల వాటిక (ప్రీస్కూల్) ప్రారంభించి మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ పాఠశాలలో విద్యను అభ్యసించే వారికి ఉన్నత విలువలతో చదువు చెప్పి వారిని ఉన్నత స్థితికి తీసుకెళ్లడమే లక్ష్యంగా తామంతా పనిచేస్తామని ఆశ్రమ పాఠశాల మాజీ చైర్మన్ డివి కృష్ణంరాజు తెలిపారు. ఈ సమావేశంలో పి రఘుపతి రాజు, యు విశ్వనాథరాజు పెద్దాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు తదితరులు పాల్గొన్నారు.

# యోగ డే ప్రోగ్రాం ఇన్చార్జిగా తుమ్మలపల్లి నారాయణరావు నియామకం..హర్షం వ్యక్తం చేసిన బిజెపి శ్రేణులు



**కాకినాడ రూరల్ , జూన్ 16, ( ప్రభాతవార్త ) :**

యోగ డే జిల్లా ప్రోగ్రాం ఇన్చార్జిగా కాకినాడ సిటీ,రూరల్ భారతీయ జనతా పార్టీ మీడియా కోఆర్డినేటర్ తుమ్మలపల్లి నారాయణరావు నియామకం పట్ల కాకినాడ భారతీయ జనతా పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో జరుగుతున్న సుపరిపాలన 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామంలో వికసిత భారత్ 2047 ప్రతిజ్ఞ చేశారు. బిజెపి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యోగ డే జిల్లా ప్రోగ్రాం ఇన్చార్జిగా నియమితులైన నారాయణరావును పిన్నింటి రాంబాబు, గౌతు చిన్న బిజెపి కార్యకర్తలతో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ అసెంబ్లీ కో కన్వీనర్ ఘంటసాల గోవిందరాజులు, గాజుల రోజా రమణి, నాగరాజు, మండల అధ్యక్షుడు బల్ల సుధాకర్, సత్తిబాబు అధిక సంఖ్యలో బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# తొర్రిగడ్డ ఎత్తిపోతల పథకం పరిశీలించిన ఎమ్మెల్యే బత్తుల



**సీతానగరం , జూన్ 16, ( ప్రభాతవార్త ) :**

మండలంలోని పురుషోత్తపట్నం గ్రామంలో ఉన్న తొర్రిగడ్డ ఎత్తిపోతల పథకాన్ని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సోమవారం పరిశీలించారు. రైతులకు సాగునీరు సకాలంలోఅందేలా కాలువల పూడికతీత పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది ప్రతీ సంవత్సరం కంటే వారం ముందు గానే సాగునీరు అందించాలని, తొర్రిగడ్డ ఎత్తిపోతల పథకాన్ని మరమ్మత్తులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతులు సాగునీరు అందక ఇబ్బందులు పడ్డారని, ఎత్తిపోతల పథకాల మరమ్మత్తులు, కాలువల పూడికతీత పనులు చేపట్టకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుతం తాత్కాలిక మరమ్మత్తులు చేయాల్సిన అవసరం ఉందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చక్కబడగానే ఎత్తిపోతల పథకాలను పూర్తి స్థాయిలో ఆధునీకరిస్తామని తెలిపారు. మోటార్లు, పైప్లైన్లు మార్చి, కాలువల్లో పూడికలు తీసి, రిటైనింగ్ వాల్స్ నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు.రైతులకు సాగునీరు ఇబ్బంది లేకుండా ఉండేందుకు పరిస్థితులన్నీ ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని, ఈ మేరకు ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు,జిల్లా కలెక్టర్ పి. ప్రశాం తిలను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ ఏడాది రెండు పంటలకు రైతులకు ఇబ్బందులు లేకుండా కాలువల్లో పూడికలు తీసేందుకు చైర్మన్ శ్రీను, వైస్ చైర్మన్ రాజు, కూటమి నేతలు కలిసి రైతులకు సాగునీరు విషయంలో ఇబ్బంది లేకుండా చూస్తామని ఎమ్మెల్యే బత్తుల తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 80 దొంగతనం కేసులలో..అంతర్ రాష్ట్ర దొంగ అరెస్ట్..465 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం

**రాజమహేంద్రవరం , జూన్ 16, ( ప్రభాతవార్త ) :**

పలు కేసుల్లో మోస్ట్ వాంటెడ్ ముద్దాయిగా పేరుగాంచిన అంతర్ రాష్ట్ర దొంగను ఎట్టకేలకు రాజమండ్రి ప్రకాష్ నగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సుమారు 80 దొంగతనం కేసులలో ప్రమేయం ఉన్న అంతర్రాష్ట్ర దొంగ, గత కొంతకాలంగా వరుస ఇంటి దొంగతనాలకు పాల్పడుతున్న బులా నాగ సాయి ను అరెస్టు చేసినట్లు సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేష్ బాబు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్ లో సిఐ ఎస్.కే.బాజీలాల్, ఎస్ఐ సతీష్ లతో కలిసి డీఎస్పీ రమేష్ బాబు ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖపట్నం జిల్లా గాజువాక సింహ గిరి కాలానీకి చెందిన బులా నాగ సాయి, దొంగతనం చేసిన బంగారాన్ని దాచి పెడుతూ ముద్దాయికి సహకరించిన అతని చిన్ననాటి స్నేహితుడు భీమవరానికి చెందిన మహమ్మద్ సోనులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందన్నారు. ముద్దాయిల ఇద్దరి వద్దనుండి 465 గ్రాముల బంగారాన్ని (రూ 50 లక్షల విలువ గల) స్వాధీనం చేసుకున్నామన్నారు. నెల్లూరు, ఒంగోలు కడప రాజమండ్రి తదితర జిల్లాల్లో ఇంటి దొంగతనాలు పాల్పడుతూ ఇంతవరకు 500 గ్రాములపైగా చోరీ చేసినట్లు తెలిపారు. రాజమండ్రి ధనలక్ష్మి టెక్స్టైల్ వీధిలో ఒక డూప్లెక్స్ ఇంటిలో 250 గ్రాముల బంగారాన్ని దొంగలించగా, వాటిలో 246 గ్రాముల బంగారం రికవరీ చేయడం జరిగిందన్నారు. కడప, నెల్లూరు ఒంగోలు పరిధిలో చేసిన దొంగతనాలు సంబంధించి ఆయా ఎస్పీలకు సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. ముద్దాయి బులా నాగసాయి 2007 సంవత్సరం నుండి గాజువాక, వైజాగ్ సిటీ, రాజమండ్రి, కడప, నెల్లూరు, ఒంగోలు, అత్తిలి, తణుకు, తాడేపల్లిగూడెం, కావలి, బెంగళూరు, ఏరియాలలో ఇంటి దొంగతనాలు చేస్తూ చివరిసారిగా బెంగుళూరు పోలీస్ వారికి 2023 సం లో పట్టుబడి, బెంగుళూరు జైలులో సంవత్సరం పాటు శిక్ష అనుభవించి, బెయిల్ పై బయటకి వొచ్చి, మరల అప్పటినుంచి పలు చోట్ల ఇంటి దొంగతనాలు చేస్తూ పోలీస్ లకు పట్టుబడకుండా తప్పించుకుని తిరుగుతున్నాడని, ప్రకాష్ నగర్ సీఐ బాజీలాల్ మరియు సిబ్బంది ప్రత్యేక నిఘా పెట్టి సదరు ముద్దాయిని అరెస్ట్ చేసి, అతని ద్వారా నాగసాయి దొంగతనం చేసిన బంగారాన్ని కొంటున్న భీమవరానికి చెందిన మహమ్మద్ అలీఅహ్మద్ ఖాన్ ఏ సోను ను కూడా అరెస్ట్ చేయడం జరిగిందన్నారు.

# ఆ పథకాలనే ఎందుకు అమలు చేస్తున్నారు : ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

**మండపేట రూరల్ , జూన్ 16, ( ప్రభాతవార్త ) :**

గత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పేద ప్రజల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన పథకాలు ఎందుకు కొనసాగిస్తున్నారని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుని మండపేట వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సభ్యులు ప్రశ్నించారు . సోమవారం మండపేట విజయలక్ష్మి నగర్ పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జగన్ హయాంలో నిరుపేదలు ఎంతో ఆనందంగా ఉండేవారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వచ్చిన తరువాత గత ఏడాదిగా నిరుపేదలు సంక్షేమ ఫలాలు అందక అనేక ఇబ్బందులకు గురవుతున్నారనీ ఆరోపించారు. పథకాలు కొనసాగితే మరో శ్రీలంకల రాష్ట్రం అవుతుందని గ్లోబల్ ప్రచారం చేసిన కూటమి నేతలు ప్రస్తుతం వాటిని ఎందుకు పేర్లు మార్చి అనుసరిస్తున్నారనీ నిలదీశారు. జగన్మోహన్ రెడ్డి అవలంబించిన విధానాలు అవలంబిస్తున్నారని ఎద్దేవా చేశా



రు. జగన్ పథకాలు లేకపోతే కూటమి ప్రభుత్వంకి అధోగతి పడుతుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమం లో ఆయనంటే నమ్మకం చంద్రబాబు అంటే మోసం అన్న పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. గత ఏడాదిగా కూటమి ప్రభుత్వం చేసిన అరాచకా లు దుర్మార్గాలను ఆయన వివరించారు. రాష్ట్రంలో 766 మంది వైసీపీ నాయకులు కార్యకర్తలపై అత్యాయత్నాలు జరిగాయన్నారు. 390 మంది వైసీపీ కార్యకర్తలను కూటమి ప్రభుత్వం హత్య చేయించిందన్నారు. 203 మంది మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు జరిగాయన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం కాకుండా కూటమి ప్రభుత్వం లోకేష్ రాజ్యాంగం, రెడ్ బుక్ రాజ్యాంగాన్ని రాష్ట్రంలో అమలు చేస్తుందని మండిపడ్డారు. వైసిపి వీటిని ప్రతిఘటిస్తుందన్నారు. వైయస్సార్సీపీ నాయకులు కార్యకర్తలపై 2466 అక్రమ కేసులు బనాయించి 500 మందిని జైలులో పెట్టారన్నారు. 249 సోషల్ మీడియా యాక్టివిస్టులపై 729 అక్రమ కేసులు పెట్టి వారిలో 79 మందిని జైలుకు పంపారన్నారు. పాత్రికేయులను కూడా కూటమి ప్రభుత్వం వదల్లేదన్నారు. 11 మంది పాత్రికేయులపై భౌతిక దాడులు జరిగాయని అవేదన వ్యక్తం చేశారు. 63 మంది పాత్రికేయులపై అక్రమ కేసులు పెట్టి 8 మందిని జైల్లో పెట్టారన్నారు. నాలిక మందం తమకే ఉందని నాలిక మొద్దు మారిపోయి అవాకులు చవాకులు మాట్లాడుతు న్నారన్నారు.

నాలుగు పర్యాయాలు ముఖ్యమంత్రి గా పని చేసిన బాబు ఏనాడైనా నిరుపేదల సంక్షేమానికి కృషి చేశారా అంటూ ప్రశ్నించారు. ఏ ఒక్క పథకమైన ఉచితంగా పేద లకు అమలు చేశారా అని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో మండపేట పుర పాలక సంఘం చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి మున్సి పల్ కోఆప్షన్ సభ్యులు రెడ్డి రాజ బాబు, కర్రి పాపారాయుడు, ఎంపీపీలు నౌడు వెంకటరమణ, ఉండమట్ల శ్రీనివాసు, విప్పు పోతంశెట్టి ప్రసాద్, టౌన్ పార్టీ ప్రెసిడెంట్ ము మ్మిడివరపు బాపిరాజు, పిల్ల వీరబాబు, సిరిపురం శ్రీనివాస్, కుడిపూడి రాంబాబు, దూల వెంకన్న బాబు, సలాది వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# మండల వ్యవసాయ అధికారిగా సత్యనారాయణ



**మామిడికుదురు , జూన్ 16, ( ప్రభాతవార్త ) :**

మామిడికుదురు మండల వ్యవసాయ అధికారిగా ఎన్ వివి సత్యనారాయణ సోమ వారం బాధ్యతలు చేపట్టారు.అల్లవరం మండలంలో ఎ.ఓ.గా పనిచేస్తున్న ఆయన ఇక్కడికి బదిలీ పై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణ ను కార్యాలయ ఉద్యోగులు అభినందించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండలం లో రైతులకు అందుబాటులో ఉండి సేవలను అందిస్తానన్నారు. పంటల సాగుపై రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు.ఇప్పటివరకు ఇక్కడ ఏఓ గా పని చేసిన మృదుల కాట్రేనికోన బదిలీపై వెళ్లారు.

# మండల అగ్రికల్చరర్ అధికారిగా జోకా అమృత



**ప్రత్తిపాడు , జూన్ 16, (ప్రభాతవార్త )**

మండల అగ్రికల్చరర్ అధికారిగా జోకా అమృత సోమ వారం బాధ్యతలు స్వీకరించారు .ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన ఏవో గంగాధర్ పిఠాపురం బదిలీపై వెళ్లారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏవో అమృత స్థానిక వ్యవసాయ సిబ్బందితో సమావేశమై మాట్లాడుతూ సమన్వయంతో విధులు నిర్వహించి, రైతులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి రైతుకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.క్షేత్రస్థాయిలో రైతులకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించాలన్నారు.అనంతరం ఆమెను వ్యవసాయ సిబ్బంది బొకేలతో స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు.

# డెంగ్యూతో వణుకుతున్న ఈనాం.. పరిశీలించిన ఎండిఓ,ఈ.ఓ.పి.ఆర్.డి



**రౌతులపూడి , జూన్ 16, ( ప్రభాతవార్త )**

మండలంలోని ఎన్ ఎన్ పట్నం శివారు సిహెచ్ వి పడా లపురం( ఈనాం) గత10 రోజుల నుండి డెంగ్యూతో వణుకుతుంది. ప్రతి ఇంట్లోనూ ఒకరిద్దరూ డెంగ్యూ బారినపడి నర్సీపట్నం, తుని,డి. పోలవరం లో రక్త పరీక్షలు చేయించుకొని ప్రైవేట్ ఆస్పత్రులలోవైద్యం పొందుతున్నారు. స్థానిక వైద్య సిబ్బంది ఎవరు గ్రామాన్ని సందర్శించి ఫీవర్ సర్వే చేసిన దాఖలాలు లేవని ఆ గ్రామస్తులు వాపోయారు. రౌతులపూడి సిహెచ్సి, ము లగపూడి పి.హెచ్. సి దూరం కావడంతో ప్రభుత్వ వైద్య సేవలు పొందలేకపోతున్నామన్నారు. ఆర్థిక భారం అయినప్పటికీ ప్రైవేట్ వైద్యం పొందుతున్నా మన్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఎండిఓజి శివరామ కృష్ణయ్య, ఈ.ఓ.పి.ఆర్.డి. శ్రీరామ చంద్ర మూర్తి ఆ గ్రామాన్ని సందర్శించి డెంగ్యూ బాధితులను పరామర్శించారు. పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి,ఆరోగ్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ఫీవర్ సర్వే లైన్స్ చేశారు. దోమల నివారణకు లార్వా మందు, అబేట్ స్ప్రే చేయించారు.ఇళ్లలో నిల్వఉన్న నీటిని తొలగించాలని సూచించారు.

# పేదలు సాగు చేసుకుంటున్నా భూములకు హక్కులు కల్పించాలి : లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బంగార్రాజు

**ప్రత్తిపాడు , జూన్ 16, ( ప్రభాతవార్త ) :**

ఏళ్ల తరబడి వ్యవసాయ కూలీలు సాగు చేసుకుంటున్నా భూములకు హక్కులు కల్పించాలని, రైతాంగానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రాజు డిమాండ్ చేశారు. లిబరేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పార్టీ కార్యాలయం నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్ సూర్యప్రభకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు సాగు చేసుకుంటున్నా భూములు కి హక్కులు కల్పించాలని, ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని, జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న పేదలకు 600 రూపాయలు వేతనం ఇవ్వాలని 200 రోజులు పని దినాలు కల్పించి ఉపాధి హామీ పథకంలో పని చేసే కార్మికులకు చట్టబద్ధంగా 14 రోజుల్లో వేతనం ఇవ్వాలని ఉ



పాధి హామీ పథకాన్ని రైతాంగానికి అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు.వ్యవసాయ ఆధారిత ప్రైవేటు పరిశ్రమలలో 80 శాతం స్థానికులకు అవకాశాలు కల్పించాలని వలస కార్మికులకు రక్షణ హామీ చట్టాన్ని అమలు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు రక్షణ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏగిపాటి అర్జున్ రావు, రాజాల రత్నం, పేరూరి లక్ష్మి, సామి రెడ్డి నారాయణమూర్తి, రేచు కట్ల సింహాచలం, మానుకొండ లచ్చబాబు, తాడి నాగేశ్వరరావు, చిన్నం అర్జునరావు, గూడ శివ, అనుసూరి లక్ష్మి, మాస రాజమణి, లిబరేషన్ కార్యకర్తలు, వ్యవసాయ కూలీలు తదితరులు పాల్గొన్నారు

# డయేరియాతో మంచం పట్టిన గిరిజనులు



**రౌతులపూడి , జూన్ 16, ( ప్రభాతవార్త ) :**

మండలంలోని రాఘవపట్నం పంచాయతీ శివారుదబ్బాది, సత్యవరం గ్రామాలకు చెందిన గిరిజనులు డయేరియాతో మంచం పట్టారు. వారు రౌతులపూడి సిహెచ్ సి లో వైద్యం పొందు తున్నారు. దీనికి సంబంధించి వారి బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.ఈనెల 15న ఆయా గ్రామాలకు చెందిన 65 మంది గిరిజనులు పిల్లాపాపలతో కలిసి అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరులో కొలువై ఉన్నమోదకొండమ్మ తల్లి దర్శనానికి ఐసర్ వ్యాన్ లో బయలుదేరి వెళ్లారు. బయలుదేరే ముందు రోజు ఇంటి వద్ద పులిహార తయారు చేసుకున్నారు. ఈ ఆహారాన్ని నాతవరంలో కొంతమంది తిన్నారు. మిగిలిన ఆహారాన్ని పాడేరు చేరుకున్న తర్వాత తిన్నారు. వెళ్లిన వారంతా మో దకొండమ్మ తల్లి మొక్కులు తీర్చుకున్నారు. పులిహారం తిన్న వారంతా వాంతులు విరోచనాలతో ఇబ్బందులకు గురయ్యారు. వెంటనే అక్కడి నుంచి పాడేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడనుండి మెరుగైన వైద్యం కోసం రౌతులపూడి సిహెచ్సి కి తరలించారు. వెంటనే వైద్యులు స్పందించి డయేరియా బాధితులకు చికిత్స అందించారు. కొంతమంది కోలుకొని ఇంటికి చేరుకున్నారు. మరి కొంతమంది వైద్యం పొందుతున్నారు.

# కూటమి ప్రభుత్వానిది అంబేద్కర్ రాజ్యాంగ పాలన : టిఏసి సభ్యులు మేకల కృష్ణ

**శంఖవరం , జూన్ 16, ( ప్రభాతవార్త ) :**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు,కార్యకర్తలకు ఇప్పుడు అంబేద్కర్ రాజ్యాంగం గుర్తుకు రావడం చాలా విడ్డూరంగా ఉన్నాదని జిల్లా టెలీకమ్యూనికేషన్స్ సలహమండలి సభ్యులు మేకల కృష్ణ వైయస్సార్ సిపి నాయకులను ఎద్దేవా చేశారు. 2019-2024 మధ్య 5 సంవత్సరాల కాలంలో అంబేద్కర్ రాజ్యాంగం గుర్తుకు రాలేదని నాటి జగన్ పాలనలో జనసేనపార్టీ అధ్యక్షులు కొణెదల పవన్ కళ్యాణ్ ను పెళ్ళిలు గూర్చి,కుటుంబసభ్యుల గూర్చి నాటి సైకో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వకార్యక్రమాల వేదికలపై విమర్శలు చేస్తున్నప్పుడు,తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు భార్యని అసెంబ్లీసాక్షిగా అవమానించినప్పుడు గుర్తుకు రాని అంబేద్కర్ రాజ్యాంగం వల్లభనేని వంశి,పోసాని మురళీ,బొరుగెడ్డ అనిల్,రాజు కసిరెడ్డి,నాటి ప్రభుత్వంలో పనిచేసిన అవినీతి ఐఏఎస్ ఐపీఎస్ అధికారులను అరెస్టు చేసేటప్పుడుకి గుర్తుకు రావడం వైయస్సార్ సిపి నాయకుల అవకాశవాదరాజకీయం తెలుస్తుందన్నారు ,నేడు కూటమి ప్రభుత్వం అంబేద్కర్ రాజ్యాంగం ప్రకారం అనాడు 2019-2024 మద్య ఆంధ్రప్రదేశ్ పాలన సాగించిన వైయస్సార్ సిపి ప్రభుత్వ ముసుగులో ఆక్రమాలు చేసిన అధికారులను,వైయస్సార్ సిపి నాయకులను శిక్షిస్తుంటే రెడ్ బుక్కు రాజ్యాంగం అని వైయస్సార్ సిపి నాయకులు కూటమి ప్రభుత్వాన్ని విమర్శలు చేస్తున్నారని, కావున ఇప్పుడైనా వైసీపీ నాయకులు,వైసిపి కార్యకర్తలు సిగ్గు తెచ్చుకుంటే బాగుంటుందని,గత వైయస్సార్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులు పాలు జేసి,అభివృద్ధిని,భవిష్యత్తు సర్వనాశనం చేసినది.2024 సంవత్సరంలో గెలిచిన కూటమి ప్రభుత్వం ఎన్ని అప్పులు ఉన్నా,ఎన్ని కష్టాలు ఉన్నాకాని రాష్ట్రాన్ని



మళ్ళీ ఈ సంవత్సరకాలంలో కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వపాలనను గాడిలో పెట్టి సక్రమమైన పాలన దిశగా వెళ్ళుతూ...కూటమి ఎన్నికల హామీలు ,సూపర్ సిక్స్ లో 3 గ్యాసు సిలెండరు ఉచితం,తల్లికి వందనం పేరు ఇంటిలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి 13000 చొప్పున అందిస్తున్నాది... త్వరలోనే రైతు బొరోసా,ఉచిత బస్సు, ఆడబిడ్డలకు నెలకు 15,000/- పథకం అమలు చేయడం జరుగుతుం దని జిల్లా టెలికమ్యూనికేషన్ సలహా మండలి సభ్యులు తెలియజేశారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

# గడువు తేదీ చూస్తున్నారా?



మార్కెట్లో ఏ వస్తువు కొన్నా.. దానిపై తయారీ తేదీ, గడువు తేదీలు కచ్చితంగా రాసుంటాయి. అవి ఎప్పుడు తయారయ్యాయి? ఎంతకాలం వరకు వినియోగించడానికి సురక్షితం? అనే విషయాల్ని ఇవి తెలియజేస్తాయి. అయితే వీటితో పాటు షెల్ఫ్‌లైఫ్/ యూజ్ బై అని కూడా కొన్నిటి మీద రాసుంటుంది. చాలామంది ఇది, గడువు తేదీ ఒకటేనేమో అని పొరబడుతుంటారు. కానీ ఈ రెండింటికీ స్వల్ప వ్యత్యాసం ఉందంటున్నారు నిపుణులు. లేబుల్‌ని సునిశితంగా పరిశీలిస్తే ఆ తేడాను ఇట్టే పసి గట్టేయచ్చంటున్నారు. మరి, అదేంటో తెలుసుకుందాం..

**రెండాంటి మధ్య తేడా ఏంటంటే...** మార్కెట్లో కొనే ఉత్పత్తులపై తయారీ, గడువు తేదీలు ఉంటాయన్న విషయం తెలిసిందే! అయితే వీటితో పాటు షెల్ఫ్‌లైఫ్‌ని కూడా ఆయా సంస్థలు లేబుల్‌పై పేర్కొంటాయి. కానీ ఇది, గడువు తేదీ ఒకటేనేమోనని అనుకుంటారు కొందరు. అయితే ఈ రెండింటి మధ్య స్వల్ప వ్యత్యాసం ఉందంటున్నారు నిపుణులు.

**గడువు తేదీ అంటే...** ఒక ఉత్పత్తిని ఎన్ని రోజుల తర్వాత అస్సలు వాడకూడదో తెలియజేసే కాల పరిమితి. ఆ తర్వాత దాని ప్రభావం తగ్గిపోవడమే కాదు.. అది హానికరం కూడా అని దీని అర్థం.

**అదే షెల్ఫ్ లైఫ్ విషయానికొస్తే..** ఉత్పత్తిని తెరిచిన తర్వాత.. దాని లేబుల్‌పై పొందుపరిచిన నియమ నిబంధనలకు అనుగుణంగా సరైన నాణ్యతా ప్రమాణాలతో దాన్ని నిల్వ చేయడం/భద్రపరచడం చేస్తే అది ఎంత కాలం సురక్షితంగా ఉంటుందని తెలియజేసే సూచిక ఇది. ఉదాహరణకు 12ఎం అని ఉంటే.. దానికి 12 నెలల షెల్ఫ్ లైఫ్ ఉందని అర్థం! సాధారణంగా దీన్ని ఉత్పత్తిపై 'యూజ్ బై' లేదా సెల్ బై అనే పదాలతో సూచిస్తారు.

షెల్ఫ్ లైఫ్ దాటినప్పుడు ఒకవేళ గడువు తేదీ మీరకపోయినా ఆయా ఉత్పత్తుల్ని వాడకపోవడమే మంచిదంటున్నారు నిపుణులు. ఆహారం, మందులు, కాస్మెటిక్స్. వంటి ఉత్పత్తుల్ని ఉపయోగించే క్రమంలో ఈ రెండు తేదీల్ని దృష్టిలో పెట్టుకోవడం ముఖ్యమంటున్నారు. తద్వారా ఆహారం, అందంపై ప్రతికూల ప్రభావం పడకుండా జాగ్రత్తపచ్చంటున్నారు.

**నిల్వ చేయడమూ ముఖ్యమే!...** అయితే మార్కెట్లో కొన్ని ఉత్పత్తి ఏదైనా సరే.. వాటిపై పేర్కొన్న గడువు, షెల్ఫ్ లైఫ్ తేదీలకు అనుగుణంగా మన్నాలంటే దాన్ని నిల్వ చేసే లేదంటే భద్రపరిచే విషయంలో తగిన జాగ్రత్తలు



తీసుకోవాలంటున్నారు నిపుణులు. లేదంటే వాటి నాణ్యత తగ్గిపోయే ఆస్కారం ఉందంటున్నారు ఇందులోసం ఆయా ఉత్పత్తులపై పేర్కొన్న లేబుల్స్‌ని సునిశితంగా పరిశీలించాలంటున్నారు. ఉదా: ఫ్రిజ్‌లో పెట్టే ఉత్పత్తుల్ని లేబుల్‌పై పేర్కొన్న ఉష్ణోగ్రత వద్ద భద్రపరచడం ముఖ్యం అలాగే ఆహారం, మందుల్ని ఫ్రిజ్‌లో లేదంటే బయట ఉంచినా.. సరైన నిల్వ ప్రమాణాల్ని పాటించాలి. □

# సాటి మహిళల్లో స్ఫూర్తి నింపుతూ..



ఎవరెస్ట్ కల ఎంతోమందిని ఊరిస్తుంటుంది. కానీ దీన్ని నెరవేర్చుకోవాలంటే ధైర్యం, పట్టుదల కావాలి. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా వాటిని దాటుకుంటూ వెళ్లే సాహసం ప్రదర్శించాలి. 'కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం(సిఐఎస్ఎఫ్)'లో సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తోన్న గీతా సమోటా ఇలాంటి ధైర్యసాహసాలకు పెట్టింది పేరు. ఈ దూకుడుతోనే ఇటీవలే ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిందామె. తద్వారా 'కేంద్ర పారిశ్రామిక భద్రతా' నుంచి ఈ ఘనత సాధించిన తొలి వ్యక్తిగా చరిత్ర సృష్టించింది. మన ఆత్మవిశ్వాసం ముందు ఎలాంటి శిఖరాలైనా తలవంచాల్సిందే అంటోన్న ఈ డేరింగ్ ఉమన్ స్ఫూర్తి గాథ మీకోసం! రాజస్థాన్ సికర్ చక్ అనే గ్రామంలో పుట్టిపెరిగింది గీత. ఐదుగురు అక్కచెల్లెళ్లలో ఒకరైన ఆమెది సంప్రదాయ కుటుంబం. అయినా ఆటల పట్ల మక్కువ చూపిందామె. కాలేజీలో చదువుతున్న సమయంలోనే హాకీ క్రీడాకారిణిగా రాణించిన గీత. దేశం గర్వించదగ్గ హాకీ ప్లేయర్‌గా పేరు తెచ్చుకోవాలనుకుంది. కానీ అలా జరగలేదు. గాయం కారణంగా ఆటకు పూర్తిగా దూరమవ్వాల్సి వచ్చింది. ఈ సమయంలోనే కేంద్ర సాయుధ బలగాల్లో చేలనుకుందామె. అలా 2011లో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సిఐఎస్ఎఫ్)' సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా విధుల్లో చేరిన గీత.. ప్రస్తుతం ఉదయ్‌పూర్ ఎయిర్‌పోర్ట్ యూనిట్‌లో విధులు నిర్వర్తిస్తోంది.

**పర్వతారోహణ అలా పరిచయమైంది!** కేంద్ర సాయుధ దళ సిబ్బంది పలు సాహస కృత్యాల్లో తరచుగా పాల్గొంటారు. వీటివల్ల వారు తమ వృత్తికి సంబంధించిన నైపుణ్యాలు పెంచుకుంటారు. తనకూ సీఐఎస్ఎఫ్లో చేరాకే మౌంటెనీరింగ్ పరిచయమైందంటోంది 35 ఏళ్ల గీత. మా బ్యాచ్ నేనొక్కదాన్నే మహిళను. అలాగని నన్ను నేను ఎప్పుడూ తక్కువ చేసి చూసుకోలేదు. ఏ విషయంలోనూ పరిమితులు విధించుకోలేదు. విధుల్లో చేరాక నా బృందంతో కలిసి చేసిన సాహస కృత్యాల్లో పర్వతారోహణ నన్నెంతో ఆకట్టుకుంది. అందుకే ముందుగా ప్రాథమిక శిక్షణ తీసుకున్నా. ఆపై అడ్వాన్స్ ట్రైనింగ్ తీసుకొని ఇందులో పూర్తి స్థాయి నైపుణ్యాలు పెంచుకున్నా. శిక్షణ పూర్తయ్యాక చిన్న చిన్న పర్వతాల్ని అధిరోహిస్తూ అనుభవం గడించా. ఇక 2019లో ఉత్తరాఖండ్‌లోని 'మౌంట్ సటోపంత్', నేపాల్‌లోని 'మౌంట్ లోబుచే' ని అధిరోహించడంతో నా ఆత్మవిశ్వాసం రెట్టింపయింది.. అంటూ సాగుతున్న గీత.. అడుగడుగునా సవాళ్లు విసిరే ఈ రెండు పర్వతాల్ని అలవోకగా అధిరోహించింది.

**నెరవేరిన ఎవరెస్ట్ కల** అయితే ఎన్ని పర్వతారోహణలు చేసినా.. గత నాలుగేళ్లుగా ఆమె ఎవరెస్ట్ కలగానే మిగిలిపోయింది. అందుకే ఈసారి పూర్తి దృష్టి పెట్టింది గీత. ఈసారి ఎలాగైనా ఎవరెస్ట్ శిఖరాగ్రానికి చేరుకోవాలనుకున్న ఆమె.. అనుకున్నట్లుగానే ఇటీవలే తన కలలను సాకారం



చేసుకుంది. ఫలితంగా కేంద్ర పారిశ్రామిక దళాల నుంచి ఎవరెస్ట్‌ను అధిష్టించిన తొలి వ్యక్తిగా చరిత్ర సృష్టించింది. 12. పర్వతారోహణ చేయాలంటే శారీరక దృఢత్వంతో పాటు మానసికంగా సన్నద్ధమవడమూ ముఖ్యమే! నేను సాధించిన ఈ ఘనతకు దేశవ్యాప్తంగా ప్రశంసలు కురుస్తున్నాయి. ఇందుకు గర్వంగా ఉంది. అయితే నా మౌంటెనీరింగ్ కెరీర్‌లో ఇలాంటి అవార్డులురివార్డులెన్నో సాధించా. కానీ మహిళలకు ఏదైనా సాధ్యమే అని నా ధైర్యసాహసాలతో నిరూపించడం అన్నింటి కంటే సంతృప్తినిస్తోంది. ఆత్మవిశ్వాసం ఉంటే ఎంపిక రంగంలో మనకు తిరుగుండదు.. అంటూ తన మాటలతోనూ సాటి మహిళల్లో స్ఫూర్తి నింపుతున్న ఈ డేరింగ్ ఆఫీసర్.. త్వరలోనే మిగతా మూడు ఎత్తైన పర్వతాలు అధిరోహించి.. అందుకే సెవెన్ సమిట్స్ చాలెంజ్ పూర్తిచేయాలన్న ఆలోచనతో ఉంది. □

# వానల్లో పెద్దవాళ్ల కోసం !

ఇంట్లో అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్యల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు మారుతున్న సీజన్ తగ్గట్లుగా జాగ్రత్తలు తీసుకొంటూ పరిరక్షించాలి. వర్షాకాలంలో వారినెలా సంరక్షించాలో చూద్దాం.



+ కాచి చల్లార్చిన లేదా గోరువెచ్చని నీటిని తరచూ తీసుకోవడం అలవాటు చేయాలి. సాధారణ వర్షా కాలంలో నీటి ద్వారా కలరా, టైఫాయిడ్, డయేరియా వంటి అనారోగ్యాలు దరి చేరే ప్రమాదం ఉంది. దీని నిరోధించాలంటే వేడి నీటిని మాత్రమే తాగాలి. స్నానానికి కూడా గోరువెచ్చని నీటిని ఏర్పాటు చేయాలి. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు ఉండాలి. రయిన్‌కోటు వంటి ఏర్పాట్లు ఉండేలా జాగ్రత్త పడాలి.

+ వ్యాధులెక్కువగా ప్రబలే సీజన్ కావడవంతో వ్యాధినిరోధక శక్తిని పెంచేలా ఆహారాన్ని అందించాలి. వాతావరణంలో మార్పులు, అతి చల్లదనం. తరచూ చినుకుల్లో తడవడంవల్ల జలుబు, జ్వరం దగ్గు బాధిస్తాయి. వీటికి దూరంగా ఉంచాలంటే గింజధాన్యాలు, పోషక విలువలు ఉన్న ఆహారాన్ని అందించాలి. వాతావరణంలో మార్పులు అతి చల్లదనం, తరచూ చినుకుల్లో తడవడంవల్ల జలుబు, జ్వరం, దగ్గు బాధిస్తాయి. వీటికి దూరంగా ఉంచాలంటే గింజధాన్యాలు, పోషక విలువలు ఉన్న ఆహారాన్ని ఇవ్వాలి. తీపి, నూనె పదార్థాలు, ప్రాసెస్డ్ ఫుడ్‌కు దూరంగా ఉంచాలి. ఇంటి భోజనానికి పెద్దపీట వేసేలా చూడాలి. తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు సహా పీచు ఎక్కువగా ఉండే ఆహారానికి ప్రాధాన్యతనివ్వాలి. దీంతో జీర్ణశక్తి మెరుగుపడుతుంది. త్వరగా అనారోగ్యాలు దరిచేరవు.

+ వీరు విశ్రాంతి తీసుకునే గది, దాని చుట్టుపక్కల పరిశుభ్రంగా ఉండాలి. గదికి సమీపంలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తపడాలి. లేదంటే వాటిపై దోమలు పెరిగే ప్రాదం ఉంది. గదిలో వెలుతు ఉండేలా చూడాలి. ఇండోర్ ప్లాంట్స్ పెంపకం మంచిది. వీరు నిద్రపోయే గది వెచ్చగా ఉంటే రక్తప్రసరణ మెరుగ్గా ఉంటుంది. దోమలెక్కువగా ఉండే ప్రాంతమైతే ఈ సీజన్‌లో కిటికీలకు నెట్ వేయడం మంచిది. లేదంటే దోమకాటు కూడా తీవ్ర అనారోగ్యాలకు దారి తీస్తుంది. □

# ఇవి తింటే కంటికి మంచిది !

ఒకప్పుడు వయసు పైబడినవారికి చూపు మందగించేది. ఇప్పుడలా కాదు, పిల్లలకి కూడావచ్చేస్తోంది. మన ఆహారంలో కొన్ని మార్పులు చేసుకుంటే. ఆ సమస్యకు కొంతవరకు = పెట్టొచ్చు. ఎ, సి, ఇవిటమిన్లు, ఒమేగా3 అధికంగా ఉన్న పదార్థాలు తరచుగా తింటుంటే కంటిచూపు మెరుగ్గా ఉంటుంది. ఏయే పదార్థాల్లో ఈ విటమిన్లు లభిస్తాయంటే. ఈవిటమిన్, కోడిగుడ్డు, క్యారెట్, గుమ్మడికాయ, లివర్, పాలు, మొదలైనవాటిల్లో ఈ విటమి విస్తారంగా ఉంటుంది. సివిటమిన్ క్యాబేజీ, క్యాలీఫ్లవర్, నిమ్మకాయలు, నారింజపండ్లలో సి విటమిన్ పుష్కలంగా ఉంటుంది. ఇవిటమిన్: బాదంపప్పు, పొద్దుతిరుగుడు గింజలు, బఠాణీలలో ఇవిటమిన్ అధికంగా ఉం ఒమేగా3 చేపల్లో ఇది ఎక్కువగా ఉంటుంది. □




# అభద్రతా భావం బయటపడాలంటే..

కొంతమంది తమలో సమర్థత ఉన్న తమను తాము తక్కువగా అంచనా వేసుకుని అభద్రతకు లోనవుతారు. ఇలా వివిధ కారణాలతో అభద్రతా భావానికి లోనై మానసిక వేదన పడేవారి సంఖ్య ఇటీవల పెరిగిపోతోందని నిపుణులు చెబుతున్నారు. దీనిని ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. ఈ మనలోని అభద్రతా భావాన్ని ఎలా గుర్తించాలి? దీన్నుంచి ఎలాబయటపడాలి? తెలుసుకుందాం..

**తక్కువ చేసి చూసుకొని...** ప్రతి ఒక్కరికీ ఏదో ఒక ప్రత్యేక నైపుణ్యం ఉంటుంది. కానీ కొంతమంది మాత్రమే దానిని సరైన రీతిలో వినియోగించు కుంటారు. అయితే అభద్రతా భావం ఉన్న వారిలో కూడా మంచి నైపుణ్యాలున్నా.. తమను తాము తక్కువగా అంచనా వేసుకుంటారని నిపుణులు చెబుతున్నారు. వారు సరిగా పని చేసినా తరచుగా ఇతరుల అభిప్రాయం కోరుతుంటారు! అవతలి వారి నుంచి సానుకూల స్పందన వస్తేనే సంతృప్తి పడడం.. లేదంటే బాధపడడం జరుగుతుందిట. అయితే వారు ఇలాంటి స్వీయ నమ్మకం పెంపొందించుకోవడం ముఖ్యమని **నిపుణులు సూచిస్తున్నారు.**

ఇతరులతో పోల్చుకుంటూ.. అభద్రతకు లోనయ్యే వారు ఇతరులతో ఎక్కువగా పోల్చుకుంటార! వారు సాధించిన విజయాలను సాధించాలని



ఆరాటపడడం, వారిపై అసూయ పడడం, ఒకవేళ వాటిని చేరుకోలేకపోతే కుంగిపోవడం అభద్రతకు లోనయ్యే వారిలో కనిపించే ముఖ్య లక్షణాలను నిపుణులు చెబుతున్నారు.

**నిందించడమే పనిగా..!** అభద్రతా భావం ఉన్న వారు తమ సమస్యను పరిష్కరించుకోవడానికి బదులుగా కప్పిపుచ్చుకోవడానికి ఎక్కువగా ప్రయత్నిస్తార! ఈ విధంగా వారి లోపాలకు ఇతరులను బాధ్యులను చేస్తూ వారిని నిందిస్తుంటారు. అయితే వీరు అప్పటికప్పుడు సంతృప్తి పొందినా భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయని అంటున్నారు. కాబట్టి ఇలాంటి స్వభావం ఉన్న తమ సమస్యను పరిష్కరించుకోవడానికి నిపుణుల సహాయం తీసుకోవడం మంచిది.

**భవిష్యత్తు గురించి ఆందోళన..** అభద్రతాభావం ఉన్నవారిలో భవిష్యత్తు గురించిన ఆదోళనలు అధికంగా ఉంటాయి. ఈ క్రమంలో ప్రతి చిన్న విషయం గురించి ఎక్కువగా ఆలోచిస్తుంటారు. ఇది క్రమంగా ఒత్తిడికి దారి తీస్తుంటుంది. ఆ ఒత్తిడిని ఇతరులపై చూపించడం వల్ల రిలేషన్‌షిప్‌లోనూ సమస్యలు ఎదురువుతాయని చెబుతున్నారు నిపుణులు. □

# వీర హనుమ



సామర్థ్యం రామభక్త హనుమంతుడికి మాత్రమే ఉందని అందుకు పురికొల్పారు. ఇక మారుతి తన శక్తిని మననం చేసుకుని, వానరులకు ధైర్యం కలిగించేలా మహా రూపం ధరించాడు. ఒక దూత పాటించాల్సిన ఉత్తమ లక్షణాలను సముద్రాన్ని దాటడంలో చూపాడు. అతిథ్యం స్వీకరించమని కోరిన మైనాకుణ్ణి సున్నితంగానే తిరస్కరించి, ఆపై దీవించి సంతృప్తిపరిచాడు. కార్యదక్షతను పరీక్షించడానికి వచ్చిన నాగమాత సురసు యుక్తితో మెప్పించి ఆశీర్వాదం పొందాడు. తన వేగాన్ని నిరోధించబోయిన సింహికను సంహరించాడు. లంకలో అడ్డొచ్చిన లంకినిని దండించి, సీతమ్మ చెంతకు వెళ్లాడు. చూడగానే కంగారు పడక ఆమేనని తేల్చుకుని ధైర్యమిచ్చేలా శుభవచనాలు పలికాడు. శ్రీరాముడి దూతనని పరిచయం చేసుకుని రామయ్య గుర్తులు చెప్పి సీతమ్మ ఆశలకు జీవం పోశాడు. ఆమె వెలిబుచ్చిన సంశయాలకు చాలా వినయంగా 'అమ్మా! ఇటువంటి పనులకు అతి మామూలువారిని పంపిస్తారు. అతి సామాన్యుణ్ణి నేను. సుగ్రీవుడి దగ్గర నాకంటే అధికులు, నాతో సమానులు ఉన్నారే గానీ నాకంటే తక్కువ ఎవరూ లేరు. త్వరలోనే రామలక్ష్మణులు వానరసేన సమేతంగా లంకపై దండెత్తి రావణ సంహారం చేస్తారని సీతమ్మకు భరోసా కలిగించాడు. కార్యసాధనుడు ఎలా ఉండాలో చూపించాడు. రావణాసురుడి పుత్రుణ్ణి, మంత్రి ప్రహస్తుడి కుమారుణ్ణి అడ్డొచ్చిన వారిని సంహరించాడు. చాకచక్యంగా వ్యవహరించి రామణసభకు చేరుకుని లంకేశుడుకి రామ హెచ్చరికలు వినిపించి, రాక్షసుల ఆగడాలను తిప్పికొట్టి మరొక్కసారి సీతమ్మకు అభయం కల్పించాడు. ఆమె ఆశీర్వాదం తీసుకుని ఇవతలి ఒడ్డుకు చేరుకున్నాడు. 'చూశాను సీతమ్మను'.. అనే ఒక్క మాటతో జాంబవ, సుగ్రీవ, అంగద వానర సైన్యానికి ఉత్సాహం కలిగించి, రామలక్ష్మణులకు ఉపశమనం కలిగించాడు. ఇలా సుందరకాండలో అడుగడుగునా వీరత్వం, సమయస్ఫూర్తి, వినయవిధేయుతలు ప్రదర్శించి వినయ విధేయ వీర హనుమగా నిలిచాడు. □

ఆధ్యాత్మికం

# నీటి పరిశుభ్రతకు ..



తాగడానికి, వంటకు ఉపయోగించే నీళ్లు పరిశుభ్రంగా ఉంటేసగం జబ్బులు రావు. నీటి కాలుష్యాన్ని నివారించడానికి వాటర్ క్యాన్ తెప్పించుకుంటాం కదా! దానికి వాటర్ డిస్పెన్సర్ బిగిస్తే నీళ్ల పరిశుభ్రంగా ఉంటాయి. వంపడం తేలికవు తుంది. పనయ్యాక తీసి ఇంకోదానికి అమర్చవచ్చు. ఇది మేలురకం ప్లాస్టిక్‌తో రూపొందిచ్చారు హానికరం కాదు. దీన్ని శుభ్రపరచడమూ సులువే. □

# ఆరోగ్యానికి 'సూపర్ సిక్స్'

ఆహారం ప్రపంచంలో అత్యున్నతమైనవిగా. సూపర్‌ఫుడ్స్‌కి పేరు. అసలు వీటిని ఎవరు, ఎప్పుడు ప్రచారంలోకి తెచ్చారో తెలియదు కానీ ఈ జాబితాలో చాలానే ఉన్నాయి. అకైబెర్రీ, అవకాడో, కాలే, మాచా వంటివి ఎక్కువగా ఆదరణ పొందుతున్నాయి. వీటిల్లో విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు వంటి పోషకాలు పుష్కలం. అయితే, అదే స్థాయిలో న్యూట్రియంట్లను నింపుకొన్ని దేశీయన సూపర్‌ఫుడ్స్ ఏంటో చూద్దాం.

**సూపర్‌ఫుడ్స్,,** ఈ మధ్యకాలంలో బాగా వినబడుతోన్న పదం. వీటిల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయనీ, దీర్ఘకాలిక వ్యాధుల్ని అదుపులో ఉంచుతాయనీ చెబుతున్నారు. అలాంటి వాటిల్లో ఎక్కువగా విదేశీ రకాలే కనిపిస్తున్నాయి కానీ, వాటికి దేశీయ ప్రత్యామ్నాయాలూ ఉన్నాయంటారు పోషక నిపుణులు.



**అకై బెర్రీ-ఉసరి..** చూడడానికి అచ్చం నల్లనద్రాక్షలా ఉండే అకై బెర్రీ, ఉసిరి రెండు ఒకే రకమైన ఆరోగ్య ప్రయోజనాలు కలిగి ఉన్న శక్తివంతమైన సూపర్‌ఫుడ్‌లు. విటమిన్ సి నిల్వల్లో అకై బెర్రీని మించిన ప్రయోజకారి ఉసిరి. దీంతో పాటు యాంటీ ఆక్సిడెంట్లు, పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. పైగా ఉసిరిలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్,యాంటీవైరల్ లక్షణాలూ నిండుగా ఉంటాయి. ఇది దీర్ఘకాలిక వ్యాధుల్నే కాదు.. కాలేయ ఆరోగ్యం, అధికబరువుని తగ్గించడంలోనూ కీలకంగా పనిచేస్తుంది.

**మాచా మునగ ...** మాచా అనేది నీడలో పెరిగే లేత తేయాకుని సంప్రదాయ పద్ధతుల్లో చేసే పొడి. తీపి, చేదు, వగరు కలగలిపిన రుచిలో ఉండే దీనిలో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ. ఇవి సెల్ డ్యామేజీని నిరోధించడంతోపాటు వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించడంలోనూ కీలకంగా పనిచేస్తాయి. దీనికి భారతీయ ప్రత్యామ్నాయాన్ని మునగాకు అందిస్తుంది. ఇందులో కీలక విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లతో పాటు తోణ శక్తినిందించే గుణాలూ ఎక్కువే. అందుకే దీన్ని పోషకాల పవర్‌హౌస్ అని పిలుస్తారు.



**చియా సీడ్స్-సబ్జాగింజలు..** చియా గింజల్నే మెక్సికన్ సీడ్స్ అని కూడా అంటారు. వీటిల్లో ఫైబర్, ఒమేగా-3 సమృద్ధిగా ఉంటాయి. ఒంట్లో వ్యాధినిరోధకతను పెంచుతాయి. ఈ గింజలు జిగురుగా ఉండటం వల్ల వీటినెక్కువగా స్మూతీలు, సాధారణ పుడ్డింగ్‌లను చిక్కబరచడానికి వాడతారు. అయితే వీటి కంటే ఖరీదు తక్కువగా ఉండే సబ్జా గింజల్ని దేశీయ సూపర్‌ఫుడ్‌గా వినియోగించొచ్చని అంటున్నారు నిపుణులు. ఎక్కువ ప్రొటీన్, తక్కువ కెలోరీలు ఉన్న ఇవి ఒంట్లో వేడిని నియంత్రించడంతోపాటు అవసరమైన శక్తినీ ఇస్తాయి. ఈ గింజల్లో ఐరన్ ఫైబర్ పుష్కలంగా ఉండి జీర్ణవ్యవస్థ పనితీరునీ మెరుగుపరుస్తాయి.





**పాలకూర ...** కాలే సూపర్ ఫుడ్ మాత్రమే కాదు. వంటకాలకు ప్రత్యేక రుచినీ అందిస్తుంది. దీనికి ప్రత్యామ్నాయం అదే విధమైన పోషకాలు, రుచితో ఊడిని ఇండియన్ సూపర్‌ఫుడ్ పాలకూర. విటమిన్ ఎ,సి,కెలతో పాటు ఇనుము, కాల్షియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు శక్తిమంతమైన యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉంది. బచ్చలికూర కూడా కాలేకు గొప్ప ప్రత్యామ్నాయంగా పనిచేస్తుంది. అదే విధమైన ఆరోగ్య ప్రయోజనాలనూ, రుచినీ అందిస్తుంది.

**క్వినోవా- ముతక గోధుమ రవ్వ ...** ప్రొటీన్, ఫైబర్‌లు ఎక్కువ ఉండే క్వినోవాను తీసుకోవడం మంచిదే కానీ, దానికి ప్రత్యామ్నాయంగా ముతక గోధుమ రవ్వనూ వాడుకోవచ్చు. ఇందులో మెగ్నీషియం, ఐరన్, బి విటమిన్లతో పాటు ప్రొటీన్, ఫైబర్, పలు రకాల ఖనిజ లవణా దండిగా ఉంటాయి. క్వినోవాలనే ముతక గోధుమ రవ్వ కూడా తొమిది ముఖ్యమైన అమైనో ఆమ్లాలతో కూడిన పూర్తి ప్రొటీన్ ఆహారం. శాకాహారులు మంచి ఎంపిక.



**మకా వేర్లు :** పెరూ దేశానికి చెందిన మకా వేర్లు అంతర్జాల ట్రెండింగ్ ఆహారాల్లో సూపర్‌ఫుడ్‌గా దూసుకుపోతున్నాయి. ఇవి మెనోపాజ్ దశలో హార్మోన్ల అసమతుల్యతను సరిచేయగలవు. మెదడు ఆరోగ్యాన్నీ, జీవనక్రియల్నీ మెరుగుపరుస్తాయి. మన దేశంలో దొరకడం కాస్త కష్టమే. లభించినా ఖరీదు ఎక్కువే. అయితే దీనికి ప్రత్యామ్నాయంగా శతావరిని వాడొచ్చు. దీన్నే ఆస్పరాగస్ అని కూడా అంటారు. ఇది మాకా వేర్లకంటే అద్భుత ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇందులో ప్రొటీన్, కార్బోహైడ్రేట్స్ థయామిన్, విటమిన్ సి.ఇ.కె. క్యాల్షియం, ఇనుము మాంగనీస్ వంటి పోషకాలు ఎక్కువ. ఒత్తిడి, కుంగుబాటుల్ని అదుపులో ఉంచుతుంది. అజీర్తి, గుండెల్లో మంట మూడ్ స్వింగ్స్ వంటివాటిని తగ్గి)స్తుంది. □



# 'అఖండ2: తాండవం' నేటి నుంచే ఆర్ఎఫ్‌సిలో షూటింగ్

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ మేకర్ బోయపాటి శ్రీను హైలీ యాంటిసిపేటెడ్ అఖండ2: తాండవం కోసం నాల్గవ సారి కొలాబరేట్ అయ్యారు. ఈ హైఆక్టేన్ సీక్వెల్ కథ, స్కేల్, నిర్మాణం, సాంకేతిక నైపుణ్యం.. ప్రతి అంశంలో అఖండను మించి ఉంటుందని హామీ ఇస్తోంది. ప్రతి ష్టాత్మకమైన 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై నిర్మాతలు రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట అత్యంత భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఎం.తేజస్విని నందమూరి సగర్వంగా సమర్పిస్తున్నారు. ఇటీవలే జార్జియాలోని గ్రాండ్ లోకేషన్స్‌లో కీలకమైన యాక్షన్ సీన్స్‌ని షూట్ చేశారు. నేటి నుంచి ఆర్ఎఫ్‌సీలో అఖండ2 కొత్త షూటింగ్ షెడ్యూల్ ప్రారంభం కానుంది. ఈ షెడ్యూల్‌లో బాలకృష్ణతో పాటు యూనిట్ అంతా పాల్గొంటున్నారు. సినిమాలోని చాలా కీలకమైన సన్నివేశాలని చిత్రీకరించనున్నారు. బాలకృష్ణ పుట్టినరోజుకు సందర్భంగా రిలీజ్ చేసిన టీజర్‌కు నేషనల్ వైడ్‌గా సెన్సేషనల్ రెస్పాన్స్ వచ్చింది. రికార్డ్ బ్రేకింగ్ వ్యూస్‌తో టీజర్ అదరగొట్టింది. టాలీవుడ్ లక్కీ చార్మ్ సంయుక్త ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తుంది. డైనమిక్ ఆది పినిశెట్టి ఇంటెన్స్ పాత్రని పోషిస్తున్నారు. టాప్ టెక్నికల్ టీం ఈ సినిమాకి పని చేస్తోంది. సంగీత సంచలనం ఎస్ థమన్ సంగీతం అందిస్తున్నారు, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సి రాంప్రసాద్ డీవోపీగా పని చేస్తున్నారు. ఎడిటర్ తమ్మిరాజు. ఎఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్. దసరా కానుకగా సెప్టెంబర్ 25న అఖండ2 పాన్ ఇండియా గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. నటీనటులు: గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, సంయుక్త, ఆది పినిశెట్టి, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: బోయపాటి శ్రీను, నిర్మాతలు: రామ్ ఆచంట, గోపి ఆచంట, బ్యానర్: 14 రీల్స్ ప్లస్ సమర్పణ: ఎం తేజస్విని నందమూరి, సంగీతం: థమన్ ఎస్, డీవోపీ: రాంప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కోటి పరుచూరి ఆర్ట్: ఏఎస్ ప్రకాష్, ఎడిటర్: తమ్మిరాజు ఫైట్స్: రామ్ లక్ష్మణ్, పీఆర్వో: వంశీ. శేఖర్.



# 'కుబేర' ప్రి రిలీజ్ ఈవెంట్

సూపర్ స్టార్ ధనుష్, కింగ్ నాగార్జున, రష్మిక మందన్న, హైలీ యాంటిసిపేటెడ్ పాన్‌ఇండియా మూవీ శేఖర్ కమ్ముల కుబేర. అద్భుతమైన తారాగణంతో కుబేర ఇండియన్ సినిమాలో గేమ్‌ఛేంజర్‌గా నిలవబోతోంది. ఇప్పటికే విడుదలైన కుబేర ప్రమోషనల్ కంటెంట్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. పోయిరా మామ, ట్రాన్స్ ఆఫ్ కుబేర, పీపీ డమ్‌డమ్ సాంగ్స్ చార్ట్ బస్టర్ రెస్పాన్స్‌తో మ్యూజిక్ చార్ట్స్‌లో టాప్ ట్రెండింగ్‌లో వున్నాయి. శేఖర్ కమ్ముల అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి ఎస్‌విసిఎల్ఎల్‌పిపై సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ రావు ఈ చిత్రాన్ని హై బడ్జెట్ హై ప్రొడక్షన్ వాల్యూస్‌తో నిర్మిస్తున్నారు. కుబేర తెలుగు,తమిళం,హిందీ, కన్నడ, మలయాళ భాషలలో జూన్ 20న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. దర్శక ధీరుడు ఎస్ఎస్ రాజమౌళి చీఫ్ గెస్ట్‌గా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్‌గా జరిగింది. ప్రీరిలీజ్ ఈవెంట్‌లో రాజమౌళి కుబేర ట్రైలర్‌ని లాంచ్ చేశారు. గ్రాండ్‌గా జరిగిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో దర్శక ధీరుడు ఎస్ఎస్ రాజమౌళి మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. శేఖర్ కమ్ముల చాలా సాఫ్ట్‌గా హంబుల్‌గా ఉంటారు. ఆయనను చూసిన వెంటనే మనకి అలానే అనిపిస్తుంది. కానీ ఆయన చాలా దృఢ నిశ్చయం కలిగిన మనిషి. తను నమ్మిన సిద్ధాంతానికి ఏది అడ్డు వచ్చినా ఒక్క ఇంచ్ కూడా పక్కకు జరగరు. ఆ క్వాలిటీని నేను చాలా ఎడ్మైర్ చేస్తాను. శేఖర్ ఆయన నమ్మిన సిద్ధాంతాల మీద సినిమాలు తీస్తారు. నేను నమ్మిన సిద్ధాంతాలకి నేను చేసే సినిమాలకి సంబంధం ఉండదు. మేము కంప్లీట్ అపోజిట్ పోల్స్. ఆయన అంటే నాకు అపారమైన గౌరవం. ఆయన ఇండస్ట్రీకి వచ్చి 25 సంవత్సరాల అయిందంటే నాకు నమ్మబుద్ధి కావడం లేదు.




ఆయన నాకు జూనియర్ అనుకున్నాను కానీ నాకంటే వన్ ఇయర్ సీనియర్ తను. ఈ 25 సంవత్సరాల్లో అలాగే ఉన్నాడు. తను నమ్మిన సిద్ధాంతాలతోనే సినిమాలు తీశాడు. ఆయన అలాగే కొనసాగాలని కోరుకుంటున్నాను. నాగార్జున, శేఖర్ కమ్ముల, టైటిల్ కుబేర.. ఈ అనౌన్స్మెంట్ వచ్చిన వెంటనే ఫెంటాస్టిక్‌గా అనిపించింది. ధనుష్ కూడా ఇందులో ఉన్నారని తెలిసిన తర్వాత అద్భుతమైన కాంబినేషన్ అనిపించింది. ట్రాన్స్ ఆఫ్ కుబేర రిలీజ్ అయిన తర్వాత మైండ్ బ్లోయింగ్ అనిపించింది. ఒక రిచ్ ప్రపంచంలో నాగర్జున, పూర్ ప్రపంచంలో ధనుష్.. సినిమా కథ గురించి ఏమి చెప్పకుండా ఈ రెండు క్యారెక్టర్స్‌ని చూపించడం చాలా ఇంట్రెస్ట్ క్రియేట్ చేసింది. శేఖర్ కమ్ముల తన సినిమాని ట్రైలర్‌లోనే చెప్పేస్తారు. కానీ కుబేర విషయానికి వస్తే నాకు ఒక సస్పెన్స్ సినిమా లాగా అనిపిస్తుంది.

# 'మిస్టీరియస్' టైటిల్ పోస్టర్ లాంచ్

మహి కోమటిరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన మిస్టీరియస్ తెలుగు సస్పెన్స్ థ్రిల్లర్, రోహిత్ సహాని (బిగ్ బాస్ ఫేమ్), అబిద్ భూషణ్ (నాగభూషణం మనవడు), రియాకపూర్, మేఘనా రాజ్‌పుత్ ప్రధాన పాత్రల్లో త్వరలో విడుదలకు సిద్దమవుతుంది. ఆష్లీ క్రియేషన్స్ బ్యానర్‌పై ఉషా మరియు శివాని నిర్మించిన ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. ఫైనల్‌మిక్సింగ్ జరుగుతుంది, ఆడియో లాంచ్ త్వరలో షెడ్యూల్ చేయబడుతుంది. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సౌత్ ఇండియా లెవెల్లో చేస్తున్నఈ సినిమా సౌత్‌లో ఉన్న అన్ని భాషలలో చేస్తున్న సినిమా చాలాబాగుంది. పోస్టర్‌సినిమా కూడా బాగుంటుంది అని ఆశిస్తున్నాను. మిస్టీరియస్ టీంకి శుభాకాంక్షలు తెలియజేశారు. దర్శకుడు మహి కోమటిరెడ్డి మాట్లాడుతూ, మిస్టీరియస్ చిత్రం ప్రతి పాత్ర అనుమానాస్పదంగా ఉండేలా సస్పెన్స్ మిస్టరీతో ప్రేక్షకులను కట్టిపడేసేలా నిర్మించాము. చిత్రకథ మరియు స్క్రీన్ ప్లే సునిశితంగా రూపొందించిన ఈ చిత్రం క్రమ క్రమంగా క్లూలను బహిర్గతం చేస్తూ ప్రేక్షకులను చివరి వరకు ఉత్సాహంగా ఉంచుతుంది. ఈ చిత్రం షాకింగ్ ట్విస్ట్‌లు కథను కొత్త ఎత్తులకు తీసుకెళ్లి వీక్షకులను రంజింప చేస్తుంది, యాక్షన్స్, థ్రిల్లింగ్ ప్రేక్షకులకు గూస్ బంప్స్ వచ్చేవిధంగా ఉంటాయి అని వివరించారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డికి థాంక్స్ మా టైటిల్ పోస్టర్ లాంచ్ చేయటం. చిత్రాన్ని ఉన్నతవిలువలతో రూపొందించడానికి అన్ని విధాలుగా సహకారం అందించిన నిర్మాతను ఆయన అభినందించారు.




# నేడు 'మై లవ్' టైటిల్ ఆవిష్కరణ

ఐటీ ఇండస్ట్రీస్ మినిస్టర్ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు చేతుల మీదుగా మినిస్టర్ క్వార్టర్స్ బంజారాహిల్స్‌లో మంగళవారం మై లవ్ సినిమా పోస్టర్ ఆవిష్కరణ రంగరంగా వైభావంగా జరిగింది, ఈ సందర్భంగా ఐటీ ఇండస్ట్రీస్ మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ మొదటగా సంజోష్ తగరంకి అభినందనలు ఎన్నో ఏళ్ళు కష్టపడి సిని పరిశ్రమలో ఉండి జోష్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ సంస్థ స్థాపించి ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో వందలాది సినీ కళాకారులకు టెక్నీషియన్స్ సేవరంగల వారికీ అవార్డ్స్ ఇచ్చి వారి ప్రతిభను వెలుగులోకి తీసుకు వచ్చి విజయవంతం అయ్యారు, ఆలా అంచలంచలుగా ఎదుగుతూ ఇప్పుడు జోష్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ప్రొడక్షన్స్‌లో సినిమా చెయ్యడం నిజంగా అభినందనీయం, నా సమర్పణలో జరుగుతున్న ఈ మై లవ్ సినిమాకి జోష్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ప్రొడక్షన్స్ వారికీ డైరెక్టర్ సంజోష్ తగరంకి మరియు ఈ సినిమా నిర్మాతలకి ప్రభుత్వం తరుపున, నా తరుపున అన్ని విధాలుగా అండగా



ఉంటానని తెలియజేశారు. జోష్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ ఫౌండర్ చైర్మన్ సంజోష్ తగరం మాట్లాడుతూ, మాకు మొదటి నుండి అన్ని విధాలుగా ప్రభుత్వం నుండి సహాయ సహకారాలు అందిస్తున్న మా ఐటీ ఇండస్ట్రీస్ మినిస్టర్ దుద్దిళ్ళ శ్రీధర్ బాబుకి ప్రతేక్య కృతజ్ఞతలు, నేను దర్శకత్వం వహిస్తున్న నా మొదటి సినిమా టైటిల్ ఆవిష్కరణ ఐటీ ఇండస్ట్రీస్ మినిస్టర్ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు చేతుల మీదుగా జరగడం మా మొదటి విజయం, ఈ సినిమా ఆన్నారు.





# 'రాజా సాబ్' టీజర్

రెబల్ స్టార్ ప్రభాస్, టాలెంటెడ్ డైరెక్టర్ మారుతి, ప్రెస్టీజియస్ ప్రొడక్షన్ హౌస్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కాంబినేషన్‌లో రూపొందుతున్న క్రేజీ మూవీ రాజా సాబ్. ఈ చిత్రంలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ది కుమార్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. రాజా సాబ్ సినిమా డిసెంబర్ 5న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ రాబోతోంది. హైదరాబాద్‌లో ఈ చిత్ర టీజర్ లాంచ్ ఈవెంట్‌ను అభిమానులు, మూవీ లవర్స్ కేరింతల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొడక్షన్ డిజైనర్ రాజీవన్ మాట్లాడుతూ, రాజా సాబ్ సినిమా కోసం మూడున్నరేళ్లుగా పనిచేస్తున్నాం. ఇదొక వండర్ ఫుల్ ఎక్స్‌పీరియన్స్. ఇప్పటికీ ఈ మూవీ కోసం డిజైన్స్ చేస్తున్నాం. మీరు రాజా సాబ్ హవేలీని, సినిమాకు చేసిన ఇతర ఆర్ట్ వర్క్‌ను ఇష్టపడతారు అన్నారు సినిమాటోగ్రాఫర్ కార్తీక్ పళని మాట్లాడుతూ, ఇలాంటి పెద్ద వేదిక మీద మాట్లాడటం నాకు ఇదే ఫస్ట్ టైమ్. రాజా సాబ్ సినిమాకు ఎంజాయ్ చేస్తూ వర్క్ చేశాం. ప్రభాస్‌తో నేను చేస్తున్న రెండో చిత్రమిది. ఆయన గురించి మీ అందరికీ తెలుసు. రాజా సాబ్ సినిమాకు పనిచేయడం గొప్ప అనుభూతిని కలిగించింది అన్నారు. క్రియేటివ్ ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ మాట్లాడుతూ, రాజా సాబ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కృతి బర్త్ డే. ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం. రాజా సాబ్ సినిమా టీజర్ చూశాక నిర్మాత విశ్వప్రసాద్ విజన్ ఏంటో మీ అందరికీ తెలిసి ఉంటుంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పేరు ఎప్పటికీ గుర్తుండేలా రాజా సాబ్ సినిమా ఉంటుంది. దర్శకుడు మారుతి ప్రతిభ ఒక స్నేహితుడిగా నాకు తెలుసు. మారుతి వాళ్ల నాన్నగారు మచిలీపట్నం సిరి కాంప్లెక్స్ థియేటర్ దగ్గర అరటిపళ్లు అమ్మేవారు. అప్పుడే మారుతి ఒక కలగన్నాడు. ఏదో ఒకరోజు తన బ్యానర్ కూడా ఆ థియేటర్ దగ్గర పెడతారని నమ్మాడు.



# 'ఆంధ్రా కింగ్ తాలూకా' టాకీ పార్ట్ షూటింగ్

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని యూనిక్ ఎంటర్‌టైనర్ ఆంధ్రా కింగ్ తాలూకా. మహేష్ బాబు పి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర ఈ మూవీలో పవర్ ఫుల్ రోల్ చేస్తున్నారు. ఈ చిత్రంలో ఆయన సూపర్ స్టార్ సూర్య కుమార్ అనే పాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో రామ్, ఉపేంద్ర పాల్గొంటున్నారు. కీలక టాకీ పార్ట్ షూట్ చేస్తున్నారు. రామ్, ఉపేంద్ర కాంబినేషన్‌లో వచ్చే ఈ సీన్స్ సినిమాలో మేజర్ హైలెట్‌గా ఉండబోతున్నాయి. ఈ సినిమాలో రామ్ ఇప్పటివరకు చేయని ఒక యూనిక్ క్యారెక్టర్‌ని చేస్తున్నారు. ఇటీవలే రామ్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. దర్శకుడు మహేష్ బాబు పి ఈ సినిమా కోసం యూనిక్ కథని రాశారు. ఈ సినిమా ఆడియన్స్‌కి గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్‌ని అందించబోతోంది. ఈ చిత్రంలో రామ్ సరసన భాగ్యశ్రీ బోర్స్ కథానాయికగా నటిస్తోంది. అద్భుతమైన తారాగణం, ఆసక్తికరమైన కథాంశంతో ఈ సినిమా భారీ అంచనాలని పెంచుతోంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీని సిద్ధార్థ నూని, మ్యూజిక్ వివేక్-మర్విన్. జాతీయ అవార్డు విజేత శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్, ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా. తారాగణం: రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే, రావు రమేష్, మురళి శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, జుగిజు గణేష్ తదితరులు. సాంకేతిక సిబ్బంది: కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం: మహేష్ బాబు పి. నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, ప్రొడక్షన్ హౌస్: మైత్రీ మూవీ మేకర్స్. సిఇఒ: చెర్రీ, సంగీతం: వివేక్ మెర్విన్, సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ నుని, ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్.



# ద్విభాషా చిత్రంలో అమ్ము అభిరామి!

ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ రఫ్ నోట్ ప్రొడక్షన్ నిర్మాణంలో, ప్రముఖ దర్శకుడు మరియు సినిమాటోగ్రాఫర్ విజయ్ మిల్టన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తమిళతెలుగు ద్విభాషా చిత్రంలో ఇప్పటికే పలువురు తారలు ఈ చిత్రంలో ముఖ్యపాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. రాజ్ తరుణ్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో ప్రేమిస్తే భరత్, సునీల్, పాలడబ్బా తదితరులు ముఖ్యపాత్రలో నటిస్తున్నారు. ఇప్పుడు వీరి జాబితాలో ప్రముఖ తమిళ నటి అమ్ము అభిరామ్ చేరారు. తమిళ చిత్రలు రాట్సానన్, అసురన్ చిత్రంలో ఈ ఈమె తన అభినయంతో మంచి పేరు తెచ్చుకున్నారు. గోలీసోడా ఫ్రాంఛైజీగా ప్రముఖ దర్శకుడు, కెమెరామెన్ ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తన దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నాడు. గతంలో విజయ్ మిల్టన్ దర్శకత్వంలో వచ్చిన గోలీసోడా వెబ్ సిరిస్‌లో కూడా అమ్ము అభిరామి మంచి పాత్రను చేశారు. ఇది ఈ ఇద్దరి కలయికలో రెండో చిత్రం. ఈ చిత్రంలో అమ్ము అభిరామి పాత్ర ఎంతో పవర్‌ఫుల్‌గా, ఎమోషనల్‌గా కూడా ఉంటుందని, ఆమె అభినయం, పాత్ర చిత్రానికి ప్లస్ అవుతుందని, ఆమెలోని పలు కొత్తకోణాలు ఈ చిత్రంలో ఆవిష్కరించబోతున్నామని అంటున్నారు దర్శకుడు విజయ్ మిల్టన్.



# 'విజనరీ స్టూడియోస్ ప్రొడక్షన్ నంబర్ 2 షురూ'

కలర్ ఫోటో, రైటర్ పద్మభూషణ్, అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్ వంటి హిట్లతో హీరో సుహాస్ తనదైన ముద్ర వేశారు. ఆయన కొత్త చిత్రానికి డెబ్యూ డైరెక్టర్ గోపి అచ్చర దర్శకత్వం వహిస్తున్నారు. త్రిశూల్ విజనరీ స్టూడియోస్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నంబర్ 2గా బి నరేంద్ర రెడ్డి నిర్మించనున్న ఈ చిత్రం ఒక యూనిక్ కాన్సెప్ట్‌తో కూడిన అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్. రైటర్ పద్మభూషణ్‌తో ప్రశంసలు అందుకున్న షణ్ముక ప్రశాంత్ ఈ చిత్రానికి కథను అందించారు. ఈ చిత్రం ఈరోజు పూజా కార్యక్రమంతో గ్రాండ్‌గా ప్రారంభమైంది. చిత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో దర్శకుడు నాగ్ అశ్విన్, హీరో సత్యదేవ్ స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందజేశారు. ముహూర్తం షాట్‌కు సత్యదేవ్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నాగ్ అశ్విన్ క్లాప్ కొట్టారు. వంశీ నంది పాటి ఫస్ట్ షాట్‌కు దర్శకత్వం వహించారు. సుహాస్ ఈ చిత్రంలో హిలేరియస్ క్యారెక్టర్ పోషించనున్నారు. గతంలో ఆయనతో కలిసి నటించిన అంబాజీ పేట మ్యారేజ్ బ్యాండ్ ఫేం శివాని నగరం ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. నరేష్, సుదర్శన్, అన్నపూర్ణమ్మ కూడా ముఖ్యమైన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి మహిరెడ్డి పండుగుల సినిమా టోగ్రఫర్‌గా, విప్లవ్ నైషదం ఎడిటర్‌గా, ఎ రామ్ కుమార్ ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. రమణ రెడ్డి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. ఈ నెల నుంచి ఈ చిత్రం షూటింగ్ ప్రారంభమవుతుంది. తారాగణం: సుహాస్, శివాని నగరం, నరేష్, సుదర్శన్, అన్నపూర్ణమ్మ, దర్శకత్వం: గోపీ అచ్చర, నిర్మాత: బి నరేంద్ర రెడ్డి, బ్యానర్: త్రిశూల్ విజనరీ స్టూడియోస్, డీవోపీ: మహి రెడ్డి పండుగల, ఎడిటర్: విప్లవ్ నిషాదం, ఆర్ట్ డైరెక్టర్: ఎ రామ్ కుమార్.



# స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ అధిష్ఠానం కార్యాచరణ

## మండల,జిల్లా పార్టీ కమిటీలకు పక్షంరోజుల్లో పూర్తి స్వరూపం

## గెలుపు లక్ష్యంగా ఇన్-చార్జి మంత్రులకు బాధ్యతల అప్పగింత

**హైదరాబాద్,జూన్ 16,ప్రభాతవార్త :** స్థానిక సంస్థ ఎన్నికలకు కాంగ్రెస్‌పార్టీ శ్రేణులను సన్నదం చేయడానికి ఓవైపు ఇన్‌చార్జీ మంత్రులకు బాధ్యతలు అప్పగించేందుకు జాతీయ కాంగ్రెస్‌పార్టీ కసరత్తు చేస్తూనే మరోవైపు మండల జిల్లా కమిటీలకు పూర్తిస్వరూపం తీసుకొచ్చేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నది. రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు మంత్రులు,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుపిసిసి నేతలు గ్రామాల్లో విరివిగా పర్యటించాలని హైకమాండ్ ఆదేశించింది. స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపు బాటపట్టడానికి మండల,జిల్లా కమిటీలు జూన్ చివరివారం వరకు నియామకాలు పూర్తి చేయడానికి వేగం పెంచారు.మంగళవారం నాటికి మండల, జిల్లా కమిటీ అధ్యక్షులు నియామకాలకు పేర్లు స్వీకరించి అఖిలభారత కాంగ్రెస్ కమిటీకి నివేదించాలని పిసిసి సూచించారు. మరోవైపు తెలంగాణలోని 33 జిల్లాలోని స్థానిక సంస్థల గెలుపోటముల బాధ్యత ఇంచార్జ్‌ల మంత్రులు తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టమైన సంకేతాలు ఇవ్వడమే కాదు,ఎన్నికల ఫలితాలు మదింపు ఇంచార్జీ మంత్రుల పనితీరు ప్రాతిపదికన మంత్రిమండలిని పునర్వ్యవస్థీకరణ కూడా చేస్తామని ఖాళీగా ఉన్న మూడు మంత్రుల పోస్టులు కూడా అప్పుడే యోగ్యులకు కట్టబెడతామనే భావనతో కాంగ్రెస్ అధినాయకత్వం పావులు కదుపుతోన్నది. లోకల్‌బాడీ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాని జిల్లాలో బాధ్యులైన మంత్రులను తప్పించి కొత్తవారిని తీసుకోవాలని హైకామాండ్ నిర్ణయానికి వచ్చిందని కాంగ్రెస్‌పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది.స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపుకోసం ఇంచార్జీ మంత్రులు కాంగ్రెస్ పార్టీలోకి వలసవచ్చిన కొత్త,పాత రాజకీయ నాయకుల మధ్య సమన్వయం కోసం సమావేశాలు ఏర్పాటు చేయాలని ఏఐసిసి ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ ఆయా జిల్లాల ఇంచార్జీలకు సూచనలు చేశారు.మంత్రివర్గం రెండోసారి ఇటీవల విస్తరించి కొత్తగా ముగ్గురు మంత్రులను నియమించాక ఇంచార్జీ మంత్రులను మార్పుచేశారు. ఇంచార్జీ మంత్రులు స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం దిశగా దృష్టిసారించాలని ఏఐసిసి ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ ఆదేశించినట్లు తెలిసింది.బిజెపి,బిఆర్ఎస్ పార్టీలకు పట్టు ఉన్న జిల్లాలో స్థానిక సంస్థలలో విజయం పొందేందుకు ఇంచార్జీ మంత్రులు అత్యధిక శ్రద్ధను పెట్టాలని ఆమె సూచించినట్లు తెలిసింది.కొన్ని జిల్లాల్లో ప్రభుత్వ కార్యక్రమాలపై సరైన ప్రచారం లేదని, జిల్లా ముఖ్యనేతలు పట్టించుకోవడం లేదని ఎఐసిసి రాష్ట్ర ఇన్చార్జి మీనాక్షి నిర్వహించిన సమీక్షల్లో ఫిర్యాదులు అందాయి. వాటిని కూడా పార్టీ అత్యంత ప్రాధన్యతతో పరిశీలిస్తోంది. ఎక్కడెక్కడ లోపాలున్నాయనేది గుర్తించి సరిదిద్దే బాధ్యతలను పిసిసికి అప్పగించింది. పిసిసి వైస్ ప్రసిడెంట్‌లను 27 మందిని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా మరో 69 మందిని నియమించారు. వీరంతా క్షేత్రస్థాయిలో విరివిగా పర్యటించాలని వారికి సూచించింది. ఏ జిల్లాలో, "ఏ అసెంబ్లీ నియోజకవర్గంలో పార్టీ బలహీనంగా ఉంది. ఎక్కడ వర్గాలున్నాయి. విభేదాలకు కారణాలేంటనేది పార్టీ నియమించిన జిల్లా పరిశీలకుల ద్వారా నేరుగా మీనాక్షి నటరాజన్ నివేదికలు తెప్పించుకుంటోంది. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా స్థానిక నేతలతో మీనాక్షి నేరుగా మాట్లాడుతూ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు, రాహుల్ గాంధీకి సమాచారం ఇస్తున్నారు. కొత్తగా మంత్రులుగా తీసుకున్న అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి, వివేక్‌ను జిల్లా ఇన్చార్జి మంత్రులుగా నియమించడం కూడా నూతనోత్సాహంతో పనిచేయాలని చెప్పడంలో భాగమేనని పార్టీ శ్రేణులు భాష్యం చెప్పుకొంటున్నాయి.జూలై మొదటివారంలో మంత్రులతో మీనాక్షి నటరాజన్ సమావేశమై సీనియర్లు,జూనియర్లు అనే మినాహాయింపులేకుండా అందరికి లక్ష్యాలను నిర్దేశించి ప్రతికూల ఫలితాలు వస్తే ఏలాంటి శశబిషలు లేకుండా చర్యలు తీసుకొంటామని ఖరాఖండిగా చెప్పబోతున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు చర్చించుకొంటున్నారు. సంస్థాగతంగా ఒకే జట్టుగా పనిచేయకపోతే స్థానికసంస్థల ఎన్నికల్లో ప్రస్తుతం ఉన్నపరిస్థితిలో మెరుగైన ఫలితాలు సాధించడంకష్టమనే భావనతో పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం ఆవరించింది.పదవులు రాలేదని,పనులు కావడంలేదని ఉదాసీనంగా ఉన్న కార్యకర్తలను స్థానికసంస్థల ఎన్నికల్లో సమరోత్సాహంతో పోరాడేందుకు అభివృద్ధి పనులు సంబంధించిన పెండింగ్ బిల్లులు కూడావెంటనే చెల్లించాలని ఎఐసిసి రాష్ట్రప్రభుత్వంకు సూచించింది. ప్రతిపక్షాలు చేసేవ్యతిరేకప్రచారం ఎక్కువగా జనంలోకి వెళ్ళుతున్నా క్షేత్రస్థాయిలో ఉండేగ్రామీణ,బూత్‌లెవల్ కాంగ్రెస్ శ్రేణులు ప్రేక్షపాత్ర వ్యవహరిస్తున్నారని దీనిని సరిదిద్దేందకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు విరివిగా పర్యటించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా జిల్లా పర్యటనలు చేపట్టాలని ఎఐసిసి నుంచి ఆదేశాలు వచ్చినట్లు పార్టీలో చర్చించుకొంటున్నారు.

## అమెరికాలో తెలంగాణ వాసులకు అండగా నిలవాలి

### ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ చిన్నారెడ్డి

**హైదరాబాద్ జూన్ 16 ప్రభాతవార్త:**అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాల వల్ల అమెరికాలో ఇబ్బందులు ఎదురుకుంటున్న తెలంగాణ విద్యార్థులు, ఎన్ఆర్ఐలకు న్యాయపరంగా అండగా ఉండాలని రాష్ట్రప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి అమెరికా న్యాయ నిపుణుల బృందానికి సూచించారు.సోమవారం ప్రజా భవన్‌లో టిపిసిసి ప్రవాసివిభాగం కన్వీనర్ బొజ్జ అమరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో అమెరికా న్యాయశాఖ ఆటార్నిలు జోషువా డాల్రైంపుల్,యహ్వా తాబిట్,సోమిరెడ్డి సంతోష్ రెడ్డి, విజయ్ ఎల్లారెడ్డిగారితో కూడిన న్యాయ నిపుణుల బృందం చిన్నారెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయింది.ఈ సందర్బంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ అమెరికాలో నివాసం ఉంటున్న వారితోపాటు ఉన్నత విద్యాభ్యాసం కోసంవెళ్లిన విద్యార్థులు కూడా తీవ్ర భయాందోళనలతో ఉన్నారన్నారు.వారికి ఇమ్మిగ్రేషన్, వీసాలు,ఉద్యోగ అభద్రత,కార్పొరేట్ లీగల్ సపోర్ట్ అందించాలని ఆయన అమెరికా న్యాయనిపుణులకు సూచించారు.అంతర్జాతీయస్థాయిలో న్యాయసేవలందించే అమెరికా సంస్థ తెలంగాణలో తమ సేవలను ప్రారంభించడం రాష్ట్ర వాసులకు భరోసానిస్తుందన్నారు.ప్రవాస భారతీయుల వీసా సమస్యలపై, అమెరికాలో వ్యాపారం చేయదలచిన సంస్థలకు న్యాయ సహాయం,లిటిగేషన్ సేవలు, విద్యార్థులకు యూఎస్‌శిక్షణ అవకాశాలు – ఇవన్నీ హైదరాబాద్ నుంచే నిర్వహించేందుకు సోమిరెడ్డి లా గ్రూప్ సీ.ఈ.వో. సంతోష్ రెడ్డి ముందుకు రావడం హర్షణియమన్నారు.తెలంగాణను గ్లోబల్ లీగల్, టెక్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ఇది ఒక గొప్ప అడుగన్నారు.అమెరికాలోని సోమిరెడ్డి లా గ్రూప్ వ్యవస్థాపకుడు,సిఇవో సోమిరెడ్డి సంతోష్ రెడ్డి నేతృత్వంలో ప్రతినిధి బృందం చిన్నారెడ్డిని కలిసింది.

## తప్పు చేయనప్పుడు భయమెందుకు కెటిఆర్!

### టిపిసిసి ఉపాధ్యక్షులు, ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్

**హైదరాబాద్,జూన్ 16,ప్రభాతవార్త:** తప్పు చేయనప్పుడు జైలుకు వెళ్తాననే భయమెందుకు నీకు కెటిఆర్ అని టిపిసిసి ఉపాధ్యక్షులు, ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్ ప్రశ్నించారు. గాంధీభవన్‌లో సోమవారం విలేఖరులతో మాట్లాడుతూ ఆయన మంత్రిగా ఫార్ములా ఈ కార్ రేసులో నిబంధనలకు విరుద్ధంగా నిధులు విడుదల చేశారని నీపై ఆరోపణలు ఉన్నాయని వివరించారు. కెటిఆర్ చేసిన తప్పులకు అడ్డంగా బుక్ అయి ఇప్పుడు,అడ్డదిడ్డంగా మాట్లాడితే ఎట్లా అని ప్రశ్నించారు. ఆరోపణలు వచ్చినప్పుడు మూడు సార్లు, కాదు 30 సార్లు కాదు 300 సార్లు ఐనా విచారణకు వెళ్లాల్సిందే అని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలతో పని చేస్తే, నువ్వు ఇప్పటికే ఎక్కడో ఉండే వాడివి అని నిలదీశారు.మీరు అధికారంలో ఉన్నప్పుడే ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కక్ష సాధింపు చేశారని గుర్తుచేశారు.జైలులో పెట్టి రాక్షసానందం పొందింది మీరు కాదా అని ప్రశ్నించారు.నువ్వు జైలు కు వెళ్ళాలని కోరుకుంటే ప్రజలు, మేము కూడా అదే కోరుకుంటాం అని ఆయన అన్నారు.నువ్వు చేసిన తప్పులకే నువ్వుజైలుకు వెళ్ళే పరిస్థితి వస్తుందని బల్మూరి అన్నారు.నువ్వు నీ కుటుంబం చేసిన తప్పులకే జనం తన్నితరిమి వేశారని ఆయన గుర్తుచేశారు.మాటలుమాట్లాడే ముందు జాగ్రత్త అని హెచ్చరించారు. నీ పద్ధతి మార్చుకోకపోతే ప్రజల చేతిలో దెబ్బలు తినే పరిస్థితి వస్తుందన్నారు.త

## ఎక్సైజ్ స్టేషన్లలో అన్‌లైన్ వ్యవస్థ

### సాంకేతిక పరిజ్ఞానానికి రూప కల్పన

### ఎన్ఐసీ అధికారులతో సమావేశమైన

### ఆశాఖ డైరెక్టర్ షానవాజ్ ఖాసింగ్

**హైదరాబాద్ జూన్ 16 ప్రభాతవార్త:** పోలీస్ శాఖ రీతిలో అన్క్‌లైన్‌లో ఎఫ్ఆర్ఐ నమోదు తోపాటు ఇతర అంశాలను కూడ ఎక్సైజ్ శాఖలో ఆన్‌లైన్ లోకి తీసుక రావడానికి చర్యలుచేపట్టామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డెరెక్టర్ షాన్‌వాజ్ ఖాసీం (ఐపీఎస్) అన్నారు. సోమవారం ఎక్సైజ్ భవన్‌లో ఎస్ఐసీ సాంకేతిక నిపుణులు,ఎక్సైజ్ అధికారులు సమావేశాన్ని నిర్వహించారు. తెలంగాణలో ప్రస్తుతం నడుస్తు 139 ఎక్సైజ్ స్టేషన్లలో కేసుల నమోదు,ఎఫ్ఆర్ఐ మ్యాన్‌వల్ పద్దతిలో జరుగుతున్నాయన్నారు. అన్ని స్టేషన్లలో ఆగస్టు నుంచి అన్‌లైన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు తోపాటు, క్రైమ్ ప్యాటన్‌లో మార్పులు చేయాలని ఆయన అదేశించారు.ఎన్ఐసీ చేపట్టిన నమూనాలో డెరెక్టర్ షాన్‌వాజ్ ఖాసీం పలుమార్పులు సూచించారు. మార్పులతోపాటు ఈ నెల 25న జరిగే సమావేశంలో తుది దశకు తీసుక వెళ్లాలన్నారు.25న మీటింగ్ అనంతరం తెలంగాణలోని పది డిప్యూటి కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్ల అభిప్రాయాలతో మార్పులు, చేర్పులు చేయాల్సి ఉంటుందన్నారు.ఈ సాంకేతికతకు జూలెలో పూర్తి తుది రూపం ఇచ్చి. ఆగస్టు నుంచి అమలులోకి తీసుకరావాలన్నారు. ఈ సమా వేశంలో ఎన్ఐసి డైరక్టర్ జి .శ్రీకాంత్,జాయింట్ డైరక్టర్ సిహెచ్ శ్రీనివాసరావు,ఎన్‌ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ప్రణవీ, ఎన్‌ఫోర్స్ టీమ్ ఏ,సీ టీమ్ లీడర్లు నంద్యాల అంజి రెడ్డి, తుల శ్రీనివాసరావు, సీఐ చంద్రశేఖర్‌గౌడ్, జగన్‌మోహన్,ఎన్, శ్రీనివాసులు, ఎన్ఐసీ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ ఆస్పత్రిని పరిశీలించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

### రోగులతో మాట్లాడి సమస్యలపై ఆరా

**సికింద్రాబాద్, జూన్ 16 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఆస్పత్రి భవనంలోని పలు విభాగాలలో తిరుగుతూ రోగులతో మాట్లాడారు. ఆస్పత్రిలో అందుతున్న సేవలను గురించి ఆరా తీశారు. పేషెంట్లకు అందుతున్న సౌకర్యాల గురించి వారినే అడిగి తెలుసుకున్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉన్న గాంధీ ఆస్పత్రి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకునే క్రమంలో ఆస్పత్రి అభివృద్ధి విషయంలో ఎలాంటి లోట్లు లేకుండా చూసుకోవాలని ఆస్పత్రి వర్గాలకు సూచించారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలు, పెండింగ్ పనులు, వైద్యుల హాజరు గురించి సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారిని అడిగి తెలుసుకున్నారు. కరోనా కేసులు పెరుగుతున్న కారణంగా నివారణ కోసం దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు ఆస్పత్రులను సందర్శిస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. కరోనా పాజిటివ్ కేసులు మళ్లీ పెరుగుతున్న నేపథ్యంలో హాస్పిటల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, కరోనా ప్రొటోకాల్స్‌ను ప్రజలకు మళ్లీ గుర్తు చేయాలని సూచించారు.గాంధీ ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించిన కేంద్రమంత్రి



వైద్యసేవల గురించి రోగులకు అడుగుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కిషన్‌రెడ్డిపేషెంట్ల సంఖ్య అధికంగా ఉండటంతో, అవసరమైన చికిత్సలు, సదుపాయాలను ఎప్పటికప్పుడు అభివృద్ధి చేస్తూ పోవాలని సూచించారు. ఆసుపత్రిలో ఆర్ఎంఓ పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరం ఉన్నట్లు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు మర్రి శశిధర్‌రెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజకుమారి ఇతర వైద్య బృందం పాల్గొన్నారు.

## రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడిన ప్రేమికులు

### ఇంట్లో తెలిసిన ప్రేమ వ్యవహారం..!

**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :** ఇంట్లో తమ ప్రేమ వివాహం తెలియడంతో వారి ప్రేమ వివాహం నిరాకరిస్తారనే అనుమానంతో ఓ ప్రేమజంట భువనగిరి పట్టణ శివారులోని రైలుకిందపడి సోమవారం ఆత్మహత్యకు పాల్పడింది. కాగా, మృతులు జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం నెమలికొండకు చెందిన మచ్చ శృతి(23), కె.వినయ్‌కుమార్(25)గా గుర్తించారు. సంఘటనకు సంబంధించి రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్పూర్ మండలం నెమలికొండకు చెందిన మచ్చ శృతి, కె. వినయ్ కుమార్ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారని, ఒకరినొకరు ఇష్టపడటంతో కలిసి పెళ్లి చేసుకోవాలనుకున్నారని, ఈ మధ్యే వారి ప్రేమవిషయం పెద్దలకు తెలిసిందని, ఐతే తమ ప్రేమను కాదంటారని, తమ వివాహానికి పెద్దలు అంగీకరించరనే అనుమానంతో ఆదివారం అర్ధరాత్రి ఇంటినుంచి బయలు దేరి బయటకు వచ్చారని తెలిపారు. తమ ప్రేమను కాదంటే విడిపోయి బతకలేమని నిర్ణయించుకున్న వారిద్దరూ భువనగిరి శివారులో రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. ఉదయం వారి శవాలను గమనించిన స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లాకేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

## కెరీర్‌పై విద్యార్థులకు అవగాహన!

### రెండు హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు

**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ఇంజనీరింగ్ ఇతర వృత్తి విద్య కోర్సులు చేయాలనుకునే విద్యార్థులకు కెరీర్‌పై అవగాహన కల్పించాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి నిర్ణయించింది. ఇంజనీరింగ్ కోర్సులతోపాటు ఎంబిఏ, ఎంసిఏ కోర్సుల్లో చేరితే విద్యార్థులకు వారి భవిష్యత్ ఎలా ఉంటుందనే అంశాలను విద్యార్థులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోనున్నారు. ఎప్ సెట్, ఈసెట్, ఐసెట్ కోర్సుల్లో చేరడం ద్వారా ఎటువంటి లాభం ఉంటుందని.. ఆయా కోర్సులు చదివిన తరువాత వారి భవిష్యత్ ఎలా ఉంటుందని.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎలా ఉంటాయి? అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. ఈ మూడు కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు అడిగే ప్రశ్నలకు సమాధానం ఇచ్చి వారి కెరీర్‌ను బంగారుమయం చేయాలని ఉన్నత విద్యా మండలి భావించింది. అందులో భాగంగా వివిధ సెట్స్ అడ్మిషన్లు నిర్వహించే సెట్స్ కన్వీనర్ ఆఫీస్ ఉన్న మాసబ్‌ట్యాంక్‌లో 7660009768, 7660009769 రెండు హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేశారు. దాంతోపాటు టిజిసెట్స్. తెలంగాణ మెయిల్‌కి తమ సందేహాలను మెయిల్ చేస్తే వారి సందేహాలను తీర్చనున్నారు. ప్రభుత్వ పనిదినాల్లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తమ సందేహాలను నివృత్తి చేసుకోవడానికి అవకాశం కల్పిస్తూ హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేయనున్నారు. ఒకటి, రెండు రోజుల నుంచి ఈ రెండు నంబర్లు కూడా విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయి.

## 42శాతం రిజర్వేషన్ల పెంపుపై స్పష్టమైన ప్రకటన చేయాలి

### ముఖ్యమంత్రికి 14బిసి సంఘాల విజ్ఞప్తి



ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, జూన్ 16 ప్రభాతవార్త:**రాష్ట్రంలో 42శాతం రిజర్వేషన్ల పెంపుపై స్పష్టమైన విధాన ప్రకటన చేయాలని కోరుతూ సోమవారం పద్నాలుగు బీసీ సంఘాల ప్రతినిధులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రెండు మూడు రోజులలో స్థానిక సంస్థలు ఎన్నికల తేదీని ప్రకటిస్తామని మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రకటనలు జారీ చేస్తున్నారని, బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ఒక సంవత్సరం నుంచి వాయిదా పడుతున్న ఎన్నికల సమస్య తేల్చకుండా ఎలా చేస్తారని ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని, 73-74వ రాజ్యాంగ సవరణ చేసినప్పుడు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243-డి6 ప్రకారం స్థానిక సంస్థలలో బిసి రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి రాజ్యాంగబద్ధమైన అధికారం ఇచ్చింది, దీని ప్రకారం ఆసెంబ్లీలో చట్టం చేశారు. జిఓ తీసి వెంటనే ఎన్నికలు జరపవచ్చునని, సుప్రీంకోర్టుకు ఎవరైనా వెళ్లినా కేసు గెలిచే అవకాశం ఉందన్నారు.ముక్తకంఠంతో బీసీలందరు 42శాతంకు బీసీ రిజర్వేషన్లు పెంచుతూ జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రేసిడెంట్ నీలం వెంకటేశ్, రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు జి.అనంతయ్య, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ, కన్వీనర్ ఎం.రామ్‌దేవ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజి తదితరులు పాల్గొన్నారు.

## మిశ్రమ పంటల సాగులో వెనుకబడిన తెలంగాణ

**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** మిశ్రమ (అంతర) పంటల సాగులో రాష్ట్రం వెనుకంజలో ఉన్నట్లుగా కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ అధ్యయనం వెల్లడించింది. మిశ్రమ పంటల సాగులో తెలంగాణ దేశంలో 12వ స్థానంలో నిలిచింది. 2023-24 సంవత్సరానికి సంబంధించిన నివేదికలో ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ఒకేవ్యవసాయ క్షేత్రంలో ఏకకాలంలో రెండు, అంతకంటే ఎక్కువ పంటలను పండించే అంతర పంటల సాగు దేశంలో ఏటా విస్తరిస్తోందని నివేదిక స్పష్టం చేసింది. దేశంలో అంతర పంటల సాగులో బంగాల్, పంజాబ్, గుజరాత్, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్ర దేశ్, అస్సాం,ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ రాష్ట్రాల తర్వాత స్థానంలో తెలంగాణ నిలిచిందని నివేదిక పేర్కొంది. ప్రధాన పంటల మధ్య స్వల్పకాలిక పంటలను వేస్తున్నట్లుగా గుర్తించింది. కూరగాయలు,పండ్ల తోటల్లోనూ మిశ్రమ పంటలు సాగవుతున్నాయి. వరిపంట సాగు, ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రందేశంలోనే అగ్రస్థానంలో ఉన్నప్పటికీ, మిశ్రమపంటల సాగులో పురోగమించడంలేదని గుర్తించింది. రైతులు ప్రధానపంటలు పండించేందుకే ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నట్లు పేర్కొంది.

## స్కూళ్ల బకాయిలు రూ.154 కోట్లు విడుదల చేయాలి

### నష్టపోనున్న 26వేల మంది విద్యార్థులు

### తెలంగాణ గిరిజన సంఘం డిమాండ్

**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బెస్ట్ అవలబుల్ స్కూళ్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పెండింగ్‌లో ఉన్న రూ. 154 కోట్లను విడుదల చేయకపోవడంతో రాష్ట్రంలోని 26వేల మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు నష్టపోతారని సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం ధర్మా నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దళిత,గిరిజన పేద పిల్లలు ప్రైవేటు స్కూళ్లలో ఉచితంగా చదివేందుకు గత 35 ఏళ్ల క్రితం ప్రవేశపెట్టిన బెస్ట్ అవలబుల్ స్కూల్(బిఏఎస్) పథకం నిరాటంకంగా కొనసాగుతూ వస్తుందన్నారు. వివిధ జిల్లాల్లో రాష్ట్ర ప్రభుత్వం నుండి అనుమతి పొందిన ప్రైవేట్ స్కూళ్లలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ప్రభుత్వం చెల్లించే ఫీజులతో ఉచితంగా విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఈ పథకానికి ఆటంకాలు కల్పిస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లుగా చెల్లించాల్సిన ఫీజు బకాయిలను చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఈ నెల 20 వరకు పాఠశాలలు తెరిచే పరిస్థితి లేదని ప్రకటించాయన్నారు. ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలతో రాష్ట్ర ప్రభుత్వం తక్షణం చర్చలు జరిపి బకాయి పడ్డ రూ. 154 కోట్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బెస్ట్ అవలబుల్ స్కూల్ పథకం క్రమంగా నిర్వీర్యం చేసి పూర్తిగా రద్దు చేయాలని కుట్రలు చేస్తోందనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. రెండేళ్లుగా ప్రభుత్వం ఫీజులు చెల్లించకపోవడంతో స్కూళ్ల యాజమాన్యాలు ఆర్థిక భారం పడుతోందని విద్యార్థులను స్కూళ్లలోకి రానీయకుండా కొత్త అడ్మిషన్లు సైతం నిరాకరిస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. రెండేళ్లుగా బకాయిలు చెల్లించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా 180ప్రైవేటు స్కూళ్లలోని ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు 26వేల మంది భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఏడాదికి డే స్కాలర్‌కు రూ.28 వేలు, రెసిడెన్షియల్‌కు రూ.42 వేలు చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోందని గుర్తు చేశారు. తక్కువ ఫీజులోనే చదువు, భోజనం, దుస్తులు, పుస్తకాలు, వసతి కల్పిస్తున్నారని కాబట్టి ప్రభుత్వం ఆలస్యం చేయకుండా తక్షణం ప్రైవేటుస్కూళ్లకు చెల్లించాల్సిన రూ.154 కోట్లను చెల్లించాలని,లేకపోతే దళిత, గిరిజనసంఘాలు, విద్యార్థిసంఘాలను కలుపుకొని రాష్ట్ర వ్యాప్తఉద్యమానికి పూనుకుంటామని హెచ్చరించారు.

## 17.74 శాతం పిల్లల్లో పౌష్టికాహార లోపం

**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పోషికాహార లోపంతో పిల్లలు కొట్టుమిట్టాడుతున్నారు. చిన్నారులకు బలవర్ధకమైన ఆహారం అందక వారంతా బలహీనంగా తయారవుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 17.74 శాతం మంది పిల్లల్లో పౌష్టికాహార లోపం ఉన్నట్లు తేలింది. అంగన్వాడీ కేంద్రాల్లో నమోదైన 5 ఏళ్ల లోపు చిన్నారుల అభివృద్ధి సూచీలు వెల్లడించాయి. రాష్ట్ర వ్యాప్తంగా 18.93 లక్షల మంది చిన్నారుల బరువు, ఎత్తు వివరాలను నమోదు చేసినప్పుడు దాదాపు 17.74 శాతం మంది తక్కువ బరువుతో బలహీనంగా, సన్నగా ఉన్నట్లు వెల్లడైంది. వీరిలో 3.89 శాతం మంది అంటే సుమారు 74 వేల మంది అత్యంత బలహీనంగా ఉన్నారని, వెంటన వీరికి అదనపు పోషకాహారం అవసరమని తేలింది. ఇందులోనూ మూడేళ్ల లోపు చిన్నారులు ఎక్కువ ఉన్నట్లు గుర్తించారు. రాష్ట్రంలోని ములుగు, కొత్తగూడెం, మెదక్, వికారాబాద్, నారాయణ్‌పేట్, ఆసిఫాబాద్, మహబూబాబాద్ జిల్లాలోని చిన్నారుల్లో ఎక్కువగా పౌష్టికాహార సమస్య ఉన్నట్లు వెలుగుచూసింది.

## కుల, ఆదాయ పత్రాలకై దివ్యాంగుల పాట్లు

**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దివ్యాంగులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత తెలంగాణ సర్కారు ఈ నెల 3న దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీకి పచ్చజెండా ఊపింది. ఇందుకు గాను రూ.35 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉపకరణాల నిమిత్తం ఈ నెల 6న నోటిఫికేషన్ జారీ చేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనేందుకు ఈ నెల 7 నుంచి 18 వరకు గడువు విధించింది. అప్లికేషన్‌కు కేవలం 11రోజులు మాత్రమే అవకాశం ఇచ్చింది.ఆధార్‌కార్డుతో పాటు, కుల,ఆదాయ,సదరం ధ్రువీకరణపత్రాలను జత చేయాలని నోటిఫికేషన్‌లో నిర్దేశించింది. దీంతో ఆయా సర్టిఫికెట్లకోసం దాదాపు 12లక్షల మంది దివ్యాంగులు రెవెన్యూకార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

## కథక్ కళాకారిణి మంగళా భట్ మృతి

### మంత్రి జూపల్లి సంతాపం

**హైదరాబాద్ జూన్ 16 ప్రభాతవార్త:** కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత ,ప్రముఖ కథక్ నృత్య కళాకారిణి మంగళా భట్ (మంగళా కులకర్ణి) మృతి పట్ల పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సంతాపం తెలిపారు.హైదరాబాద్‌లో ఆకృతి కళాకేంద్రం ఏర్పాటు చేసి దశాబ్దాలుగా ఎందరో నృత్య కళాకారులను ఆమె తీర్చిదిద్ది, నిజమైన మార్గదర్శకురాలిగా నిలిచారని పేర్కొన్నారు.భర్త రాఘవరాజ్ భట్‌తో కలిసి భారతీయ నృత్య కళకు ప్రపంచ వ్యాప్తంగా అద్వితీయమైన గుర్తింపును అందించారని, కథక్ కళకు ఆమె ఎనలేని సేవ చేశారని కొనియాడారు. మంగళా భట్ మరణం యావత్ కళాప్రపంచానికి తీరని లోటని అన్నారు. ఆమె కుటుంబసభ్యులకు, శిష్యులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## ప్రజాసమస్యలే పరిష్కారంగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు

### ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీ

### కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్

**హైదరాబాద్, జూన్ 16,ప్రభాతవార్త:** ప్రజాసమస్యలే పరిష్కారంగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తుందని ముదిరాజ్ కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. సోమవారం ప్రజా వినియోగ కార్యక్రమం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ సూచనమేరకు గాంధీభవన్‌లో నిర్వహించారు. ప్రజలు, స్థానికుల నుంచి 30పైగా వినతి పత్రాలు స్వీకరించారు. సమస్యల పట్ల ఆయా విభాగాల అధికారులతో మాట్లాడి పరిష్కరించడం జరి గిందని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తెలిపారు. ప్రజా వినతుల్లో ప్రధా నంగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు,గృహ జ్యోతికి సంబం ధించిన విజ్ఞప్తులు రావడం జరిగిందని ఆయన తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి, టీపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నేతృ త్వంలో ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం చిత్త శుద్ధితో పనిచేస్తోందని తెలిపారు.

## ఎంపిహెచ్‌డబ్ల్యు(ఎఫ్) పరీక్షా ఫలితాల కోసం ఎఎన్ఎంల ధర్నా

**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ (ఫిమేల్)(ఎంపిహెచ్‌డబ్ల్యూ-ఎఫ్) ఫలితాలను వెంటనే విడుదల చేయాలని ఏఐటియుసి తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఎంపిహెచ్‌డబ్ల్యూ-ఎఫ్ ఫలితాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రెండవ ఏఎన్ఎంలు ఏఐటియుసి అధ్వర్యంలో సోమవారం కోఠిలోని మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు(ఎంహెచ్ఎస్ఆర్‌బి) ముందు ధర్నా చేపట్టారు. అనంతరం హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, ఎంహెచ్ఎస్ఆర్‌బి మెంబర్ సెక్రటరీ ఎస్ గోపికాంత్ రెడ్డిలను కలిసి సమస్యలపై వినతి పత్రంఅందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, తెలంగాణ రాష్ట్ర రెండవ ఏఎన్ఎముల సంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోయిని శ్యామల, పి జయమ్మ, రాష్ట్ర కార్యదర్శులు తన్వీర్ సుల్తానా, సంధ్యారాణి గీతా, రాష్ట్ర ఉపాధ్యక్షులు లతా, గోపమ్మ, కృష్ణవేణి, అలేఖ్య,, కోశాధికారి రాజేశ్వరిరెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తంబారపు జయమ్మ, పి నాగ శేషమ్మ పాల్గొన్నారు. నియమాక ప్రక్రియలో పోటీ పరీక్షలు రాసిన తరువాత సంవత్సరాల తరబడి ఫలితాలు వెల్లడించడంలో ఆలస్యం ఎందుకని ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసఫ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎంపిహెచ్‌డబ్ల్యు(ఎఫ్) ఉద్యోగాల కోసం నిర్వహించిన పోటీ పరీక్షా ఫలితాలను విడుదల చేయాలని కోరుతూ రెండవ ఏఎన్ఎంలు నిర్వహించిన ధర్నాకు ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహాతో కలిసి యూసఫ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ టెక్నాలజీ పెరిగిన ప్రస్తుత రోజుల్లో సంవత్సరాల తరబడి ఫలితాలు వెల్లడించడంలో జాప్యం జరుగుతుందంటే లోపం ఎవరి వద్ద ఉన్నదో గ్రహించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 65 వేల ఉద్యోగాలు నింపామని.. మరో 35 వేల ఉద్యోగాలు నింపుతామని ప్రతి సమావేశంలో మాట్లాడుతున్నారని.. కానీ అత్యంత కీలకమైన వైద్య రంగానికి సంబంధించిన ఉద్యోగాలు నింపే ప్రక్రియ మాత్రం ముందుకు సాగడం లేదని యూసఫ్ మండిపడ్డారు. గతంలో కెసిఆర్ అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2018వ సంవత్సరంలో ఏఎన్ఎమ్‌లకు సంబంధించి ఒక నోటిఫికేషన్ విడుదల చేశారని.. అదే సంవత్సరంలోనే పరీక్షలు నిర్వహించారని కానీ ఫలితాలు మాత్రం 2022 సంవత్సరం చివరి నెలలో విడుదల చేశారన్నారు. అంటే దాదాపు ఐదు సంవత్సరాల కాలం ఫలితాల కోసం పరీక్ష రాసిన అభ్యర్థులు ఎదురు చూశారన్నారు. ప్రస్తుతం కూడా అదే విధంగా జరుగుతుందేమోనని వీరంతా ఆందోళన చెందుతున్నారు. కాబట్టి వీలైనంత తొందరలో ఎంపిహెచ్‌డబ్ల్యు(ఎఫ్) ఫలితాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎం నరసింహా మాట్లాడుతూ ఏఐటీయూసీ పోరాట ఫలితంగా 49 సంవత్సరాల వరకు ఉన్న వయస్సును 53 సంవత్సరాల వరకు గత ప్రభుత్వం పెంచిందని.. 53 సంవత్సరాల ఒక కాంట్రాక్టు ఏఎన్ఎం ఉద్యోగంలో చేరితే కనీసం ఏడు సంవత్సరాల వరకు పర్మినెంట్ ఉద్యోగినిగా పనిచేస్తుందన్నారు. పరీక్ష ఫలితాలను వెల్లడించడంలో ఆలస్యం జరిగితే 50 సంవత్సరాలు పైబడిన కాంట్రాక్టు ఏఎన్ఎంలు తమ అమూల్యమైన సర్వీసును కోల్పోయే అవకాశం ఉందన్నారు. కనుక రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే ఫలితాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## వానాకాలంలో 80 శాతం సన్నాల సాగు

### సర్కార్ బోనస్‌తో పెరగనున్న విస్తీర్ణం

**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం సన్నరకా వరి ధాన్యానికి బోనస్ ఇవ్వడంతో ఇప్పుడు రైతుల దృష్టి వాటి సాగుపైనే పడింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పంటల కంటే అత్యధికంగా 66.80 లక్షల ఎకరాల్లో వరిని సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వడంతో సన్నాలకు గిరాకీ పెరుగుతున్న దృష్ట్యా వీటి సాగు 60 నుంచి 70 శాతానికి పైగా ఉండొచ్చని వెక్కకట్టింది. ఇందుకు అనుగుణంగా విత్తనాలు, ఎరువులను వ్యవసాయ శాఖ సిద్ధంచేస్తోంది. వచ్చే వానాకాలంలో 16.70లక్షల క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరమని పేర్కొంది. ఇందులో ఇప్పటికే 75లక్షల ఎకరాలకు సరిపడా విత్తనాలను అందుబాటులో ఉంచింది. వాటిలో సీడ్స్ కార్పొరేషన్ 17,790 క్వింటాళ్లు, నేషనల్ సీడ్ కార్పొరేషన్ 9,500 క్వింటాళ్లను సిద్ధం చేసింది. ఇక ప్రయివేటు సంస్థలు 18.52 లక్షల క్వింటాళ్ల వరి విత్తనాలను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చాయి.

## ప్రాజెక్టు పనుల్లో జాప్యం జరిగితే చర్యలు

### అధికారులకు సింగరేణి సిఎండి బలరామ్ హెచ్చరిక

**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** సోలార్, పవన, జియో థర్మల్ విద్యుత్తు, బొగ్గు నుంచి కెమికల్స్‌పై ప్రత్యేక సమీపనుల్లో జాప్యం జరిగితే చర్యలు తప్పవని సింగరేణి సిఎండి ఎన్.బలరామ్ అధికారులను హెచ్చరించారు. హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ వివిధ విభాగాల్లో కేటాయించిన పనులలో జరుగుతున్న జాప్యంపై అసహనం వ్యక్తం చేశారు. మరో 10 రోజులకల్లా ప్రతీ పనిలో ప్రగతి కనిపించాలన్నారు. సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా చేపట్టిన ప్రాజెక్టులను, పనులను మరింత వేగవంతంగా నిర్వహించాలన్నారు. సోలార్ విద్యుత్, గ్రీన్ హైడ్రోజన్, కీలక ఖనిజాల ఉత్పత్తి, మిథనాల్ తయారీ, సర్ఫేస్ కోల్ గ్యాసిఫికేషన్, భూగర్భ గనుల్లో కోల్ గ్యాసిఫికేషన్ తదితర ప్రాజెక్టులపై ఇప్పటికే ప్రాథమిక అవగాహనతో పాటు, కొన్ని పనుల పట్ల ఒప్పందాలు కుదుర్చుకోవడం జరిగిందదని వివరించారు. ఇకపై ప్రతీ వారం బొగ్గు ఉత్పత్తిపైనే కాకుండా ప్రత్యేకంగా వ్యాపార విస్తరణ ప్రాజెక్టులపై సమీక్ష ఉంటుందని స్పష్టంచేశారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలు, క్వార్టర్ల పైన చేపట్టాల్సిన రూఫ్ టాప్ సోలార్ విద్యుత్, కోల్ వాషరీల ఏర్పాటు, హైడ్రాలిక్ కన్వేయర్ల ఏర్పాటు వంటి విషయాలపై చర్చించినట్లు తెలిపారు.

ఆట

# కెప్టెన్సీ లక్ లేని స్టార్స్

## కల తీరకుండానే గుడ్ బై.. ఆశించి భంగపడ్డ ప్లేయర్స్

**న్యూఢిల్లీ:** టీమిండియా నాయకత్వం వహించాలనే ప్రతి క్రికెటర్‌కు ఉండే కల. భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించే ఆటగాడు తాను రిటైర్ అయ్యేలోపు ఒక్కసారైనా కెప్టెన్సీ చేపట్టాలని కోరుకుంటాడు. అయితే అందరూ ఆటగాళ్లకు కెప్టెన్‌గా అవకాశం దక్కదు. కొందరు ఆటగాళ్లకు మాత్రమే నాయకత్వం వహించే అవకాశం దక్కుతుంది. ఇక కొందరు స్టార్ ఆటగాళ్లకు కెప్టెన్సీ దక్కినా పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోలేకపోయారు. మరికొందరు స్టార్ ఆటగాళ్లుగా ఉన్నా కెరీర్ చివరి వరకు ఉన్నా కెప్టెన్సీ పొందలేకపోయారు. అటువంటి వారిలో ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ ఒకడు. టీమిండియా టీ20, వన్డే వరల్డ్ కప్స్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. రెండు టోర్నీల్లోనూ మ్యాన్ ఆఫ్ టోర్నీగా ఎంపికయ్యాడు. 2011 ప్రపంచకప్‌లో బ్యాటింగ్‌లో 362 పరుగులు చేసి బౌలింగ్‌లో 15 వికెట్లు పడగొట్టాడు. క్యాన్సర్‌ను జయించి టీమిండియాకు వరల్డ్ కప్ అందించాడు. పద్మశ్రీ, అర్జున అవార్డు వంటి అవార్డులను కూడా గెలుచుకున్నాడు. అయితే యువరాజ్ వైస్ కెప్టెన్‌గా ఎంపికైనా కెప్టెన్సీ చేపట్టే అవకాశం మాత్రం రాలేదు. యూవీ టీమిండియా తరుఫున 40 టెస్టులు, 304 వన్డేలు, 58 టీ20లు ఆడాడు. ఇక టీమిండియా టెస్ట్ టీమ్ అత్యుత్తమ ఆటగాళ్లలో వీవీఎస్ లక్ష్మణ్ ఒకరు. ఈ హైదరాబాదీ ప్లేయర్ ఒంటి చేత్తో ఎన్నో మ్యాచ్‌లను గెలిపించాడు. లక్ష్మణ్ క్రీజ్‌లో ఉన్నంతసేపు ప్రత్యర్థి బౌలర్లకు ఔట్ చేయడం ఓ సవాల్‌గా ఉండేది. స్టార్ ప్లేయర్‌గా గుర్తింపు తెచ్చుకున్నా లక్ష్మణ్‌కు కెప్టెన్‌గా అవకాశం దక్కలేదు. అలాగే టీమిండియా ఎవర్‌గ్రీన్ ఫాస్ట్ బౌలర్లలో జహీర్ ఖాన్ ఎప్పటికీ ఉండిపోతారు. ప్రస్తుతం బుమ్రాలాగే జహీర్ ఖాన్ కూడా అప్పట్లో గాయాలతో తీవ్ర ఇబ్బందిపడ్డాడు. గాయాల కారణంగా చాలా కాలం జట్టుకు కూడా దూరంగా ఉన్నాడు. బౌలింగ్ దళాన్ని ముందుండి నడిపించి అత్యుత్తమ బౌలర్‌గా రాణించినా జహీర్‌కు నాయకత్వం వహించే ఛాన్స్ రాలేదు. ఇక టీమిండియా దిగ్గజ స్పిన్నర్లలో హర్భజన్ సింగ్ ఒకడు. ప్రత్యేకమైన శైలితో బంతితో బ్యాట్స్‌మెన్లను ముప్పుతిప్పలు పెట్టేవాడు. టీమిండియా తరుఫున 103 టెస్ట్ మ్యాచ్‌లు, 236 వన్డేలు, 28 టీ20లు ఆడాడు. 417 టెస్ట్ వికెట్లు, 269 వన్డే వికెట్లు భజ్జీ ఖాతాలో ఉన్నాయి. హర్భజన్‌కు కూడా భారత జట్టుకు నాయకత్వం వహించే అవకాశం రాలేదు. అనిల్ కుంబ్లే, హర్భజన్ సింగ్ తరువాత టీమిండియాలో టాప్ క్లాస్ స్పిన్నర్‌గా రవిచంద్రన్ అశ్విన్ ఎదిగాడు. 2011 నుంచి అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడుతున్న అశ్విన్ 2016లో ఐసీసీ టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును గెలుచుకున్నాడు. ఇటీవలే అతనికి పద్మశ్రీ అవార్డుకు కూడా ఎంపికయ్యాడు. గతేడాది ఆసీస్ పర్యటనలో అనూహ్యంగా అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించాడు. టెస్టుల్లో ఆరు సెంచరీలు చేయడంతోపాటు బౌలింగ్‌లో 537 వికెట్లు పడగొట్టాడు. అశ్విన్‌కు కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టే అవకాశం దక్కలేదు.






## లిబెమా ఓపెన్ విజేతగా ఎలెనా

### బెల్జియం మూడో సీడ్ రూస్ ఓటమి

**న్యూఢిల్లీ:** లిబెమా ఓపెన్-2025లో ఎలిస్ మెర్టెన్స్ తన ప్రత్యర్థి ఎలెనా గాబ్రియేలా రూస్‌ను ఓడించి విజేతగా నిలిచింది. డెన్ బాష్‌లో జరిగిన లిబెమా ఓపెన్ ఫైనల్‌లో బెల్జియం మూడో సీడ్ ఎలిస్ మెర్టెన్స్ 6-3 7-6 (4) తేడాతో ఎలెనా గాబ్రియేలా రూస్‌ను ఓడించి ఈ సంవత్సరంలో తన రెండవ డబ్ల్యూటిఎ టూర్ టైటిల్‌ను గెలుచుకుంది. ఈ విజయం మెర్టెన్స్‌కు పదవ జూగిత సింగిల్స్ టైటిల్‌ను మరియు గ్రాస్‌పై మొదటి టైటిల్‌ను సంపాదించిపెట్టింది. ఆమె 2021లో వింబుల్డన్ మహిళల డబుల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. అదే సమయంలో రూస్‌పై ఆమె హెడ్‌టు హెడ్ విజయాల రికార్డును 4-0కి పెంచుకుంది. రొమేనియన్ క్వాలిఫైయర్ ద్వారా తొలి సెట్‌లో ఒత్తిడికి గురైన మెర్టెన్స్ మొదటి సెట్‌లో 3-1తో వెనుకబడింది. బెల్జియన్ క్రీడాకారిణి తన తడబాటు ప్రారంభం నుండి కోలుకుని, ఐదవ గేమ్‌లో కీలకమైన పట్టును సాధించడానికి రెండు బ్రేక్ పాయింట్లను కాపాడుకోవడంతో ఇది పోటీ యొక్క మలుపును మార్చింది. రూస్ రెండుసార్లు డబుల్ ఫాల్ట్ చేయడంతో సెట్ 3-3తో తిరిగి సర్వ్‌లోకి వచ్చింది. మెర్టెన్స్ త్వరగా మరో మూడు గేమ్‌లను రీల్ చేసి ఓపెనర్‌ను కైవసం చేసుకుంది. రూస్ సెట్‌ల మధ్య సుదీర్ఘమైన మెడికల్ టైమ్ అవుట్ తీసుకుని రెండవ సెట్ మధ్యలో ఈ జంట బ్రేక్‌లను ట్రేడ్ చేసింది. రూస్ 5-4తో రెండు సెట్ పాయింట్లను సంపాదించగలిగింది. కానీ మెర్టెన్స్ సర్వ్‌ను పట్టుకోవడంలో టైబ్రేకర్‌ను అదుపు చేసి దానిని అధిగమించింది.

### సీజన్ 6 గ్రాండ్ ఫినాలేలో..

## ఛాంపియన్‌గా యు ముంబా

### జైపూర్‌పై 8-4 తేడాతో ఆధిపత్యం.. హైదరాబాద్ అమ్మాయి శ్రీజ తొలి ఓటమి




**న్యూఢిల్లీ:** సీజన్ 6 గ్రాండ్ ఫినాలేలో యు ముంబా టీటీ ఛాంపియన్‌గా నిలిచింది. జైపూర్ పేట్రియాట్స్‌పై 8-4 తేడాతో ఆధిపత్య విజయం సాధించి, అద్భుతమైన జట్టు ప్రదర్శనతో ముంబా తమ తొలి ఇండియన్ ఆయిల్ అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. లిలియన్ బార్డెట్ మరియు బెర్నాడెట్ సోక్స్ ముంబాకు తొలి ఆధిక్యాన్ని అందించారు ఆ తర్వాత సోక్స్ మరియు ఆకాష్ పాల్ మిక్స్‌డ్ డబుల్స్‌ను 3-0 తేడాతో కైవసం చేసుకుని వారిని అంచుకు చేర్చారు. టీనేజర్ అభినంద్ పిబి నాల్గవ మ్యాచ్‌లో క్లచ్ గేమ్ విజయంతో టైటిల్‌ను కైవసం చేసుకుంది. యశస్విని ఘోర్పడే ఫైనల్‌లో పాల్గొనకపోయినా, ఆమె అద్భుతమైన సెమీఫైనల్ ప్రదర్శన ఈ సీజన్‌లో యు ముంబా యొక్క సమిష్టి బలాన్ని ప్రతిబింబించింది. తొలి మ్యాచ్‌లో కనక్ ఝాపై బార్డెట్ అద్భుత ఆటతీరుతో 2-1 విజయంగా మార్చి ముంబాకు ఊపునిచ్చింది. ఆ జోరు లీగ్‌లో అగ్రస్థానంలో ఉన్న క్రీడాకారిణి స్జోక్స్, అంతర్జాతీయ సర్క్యూట్‌లో భారత్ అత్యధిక ర్యాంకర్ ప్యాడ్లర్ అకుల శ్రీజా మధ్య మార్క్యూ ఘర్షణకు దారితీసింది. ఒత్తిడిలో కూడా స్జోక్స్ ఎలైట్ డిఫెన్స్ ప్రదర్శించి 2-1 తేడాతో స్కోరు సాధించింది, శ్రీజాకు ఈ సీజన్‌లో తొలి ఓటమిని అందించింది. ఆకాష్‌తో కలిసి స్జోక్స్, జీత్, బ్రిట్ ఈర్లాండ్‌లను వరుస గేమ్‌లలో ఓడించింది. ప్రతి గేమ్ ఏకపక్షంగా సాగుతుండగా, యు ముంబా ద్వయం రెండవ గేమ్‌లో 5-5 నుండి 11-5కి చేరుకుంది. మరియు మూడవ గేమ్‌ను అదే స్కోరుతో ముగించింది. టైతో ముగిసిన తర్వాత, జీత్ పేట్రియాట్స్‌ను మ్యాచ్ 4ను ఉత్కంఠభరితంగా ప్రారంభించింది. ముంబాకు చెందిన అభినంద్‌తో జరిగిన మొదటి రెండు గేమ్‌లను గెలిచి జట్టును సజీవంగా ఉంచాడు. కానీ 17 ఏళ్ల యు ముంబా ప్యాడ్లర్ 6-6తో నిలిచిన అభినంద్ 10-8తో ఆధిక్యంలో నిలిచి, 11-8తో ఆధిక్యంలో నిలిచాడు, యు ముంబా టిటికి 8-4 మొత్తం విజయంతో మొట్టమొదటి ఇండియన్ ఆయిల్ యుటిటి టైటిల్‌ను గెలుచుకున్నాడు.

## వెస్టిండీస్ విన్

### 62 రన్స్ తేడాతో ఐర్లాండ్ ఓటమి




**న్యూఢిల్లీ:** వెస్టిండీస్, ఐర్లాండ్ జట్ల మధ్య జరిగిన టీ20 మ్యాచ్‌లో పరుగుల వరద పారింది. రెండు జట్లు కలిపి 450 పరుగులు చేశాయి. చివరికి వెస్టిండీస్ జట్టుపై ఐర్లాండ్ 62 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఒకవైపు వెస్టిండీస్ బ్యాటర్ ఎవిన్ లూయిస్ తుఫాన్ ఇన్నింగ్స్ ఆడగా, ఐర్లాండ్ యువ ఫాస్ట్ బౌలర్ లియామ్ మెక్‌కార్తీ తన అరంగేట్రం మ్యాచ్‌లోనే చెత్తరికార్డును నమోదు చేశాడు. ఈ మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ జట్టు ఐదు వికెట్లు కోల్పోయి 256 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఇది టీ20 చరిత్రలో వెస్టిండీస్ జట్టు చేసిన రెండో అత్యధిక స్కోర్. వెస్టిండీస్ జట్టు తరపున ఓపెనర్ గా క్రీజులోకి వచ్చిన ఎవిన్ లూయిస్ విధ్వంసకర బ్యాటింగ్‌తో ఐర్లాండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఎవిన్ లూయిస్ కేవలం 44 బంతుల్లో 91 పరుగులు చేశాడు. అతని తుఫాన్ ఇన్నింగ్స్‌లో ఏడు ఫోర్లు, ఎనిమిది సిక్సులు ఉన్నాయి. ఆ తరువాత బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ షాయ్ హోప్ కూడా 27 బంతుల్లో 51 పరుగులతో ఐర్లాండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. తన కెరీర్ లో తొలి టీ20 మ్యాచ్ ఆడిన కేసీ కార్టీ 22 బంతుల్లో 49పరుగులతో అజేయంగా నిలిచాడు. ఆ తరువాత రోమారియో షెపర్డ్ కూడా చివరి ఓవర్లలో ఐర్లాండ్ బౌలర్లను వదిలిపెట్టలేదు. కేవలం ఆరు బంతుల్లో మూడు సిక్సర్లు కొట్టడం ద్వారా జట్టుకు 19 పరుగులు జోడించాడు. దీంతో వెస్టిండీస్ జట్టు 256 పరుగుల భారీ స్కోర్ చేసింది. వెస్టిండీస్ జట్టు నిర్దేశించిన భారీ పరుగుల లక్ష్యాన్ని ఐర్లాండ్ చేధించలేక పోయింది. ఐర్లాండ్ బ్యాటర్లు రాస్ అడైర్ (48), హ్యారీ టెక్టర్ (38), మార్క్ అడైర్ (31) మినహా మిగిలిన బ్యాటర్లు పరుగుల రాబట్టలేక పోయారు. దీంతో ఐర్లాండ్ జట్టు నిర్ణీత ఓవర్లలో 194 పరుగులు మాత్రమే చేసింది. ఫలితంగా 62 పరుగుల తేడాతో మ్యాచ్‌ను కోల్పోయింది. వెస్టిండీస్ బౌలింగ్‌లో అఖిల్ హుస్సేన్ మూడు వికెట్లు పడగొట్టగా.. జాసన్ హోల్డర్ రెండు వికెట్లు తీశాడు.

## గ్రాప్లింగ్ ప్రపంచ కప్‌లో రన్నరప్‌గా భారత్

**న్యూఢిల్లీ:** గ్రాప్లింగ్ ప్రపంచ కప్-2025లో భారత్ రన్నరప్‌గా నిలిచింది. ఈ గ్రాప్లింగ్ ప్రపంచ కప్ 2025లో భారత్ గ్రాప్లర్లు 44 పతకాలతో ముగించారు. వీటిలో 3 స్వర్ణాలు, 13 రజతాలు, 28 కాంస్య పతకాలు ఉన్నాయి. కజకిస్తాన్‌లోని అస్తానాలో భారత్ కాలమానం ప్రకారం సోమవారం జరిగిన ఈ పోటీల్లో భారత్ గ్రాప్లర్లు అద్భుత ప్రదర్శన కనపరచడంతో మొత్తం జట్టు ర్యాంకింగ్స్‌లో భారత్ రన్నరప్‌గా నిలిచింది. అలాగే ఆతిథ్య కజకిస్తాన్ (13620 పాయింట్లు) తర్వాత నిలిచింది. భారత గ్రాప్లర్లు 755 పాయింట్లతో 44 పతకాలను గెలుచుకున్నారు. గ్రాప్లింగ్ మరియు గ్రాప్లింగ్ జిఐ విభాగాలలో 10 దేశాల నుండి గ్రాప్లర్లు పోటీ పడ్డారు. భారత్‌కు చెందిన అభిమన్యు పతకాలు (100 కిలోలు) స్వర్ణం, కాంస్య పతకాలను సాధించగా, అదే విభాగాలలో వికాష్ కుమార్ (100 కిలోలు) స్వర్ణం, రజతాన్ని దక్కించుకున్నాడు. ఇతర విజేతలలో రవి మాలిక్ (71 కిలోలు), సవిత (53 కిలోలు) ఇద్దరూ చెరో రెండు రజత పతకాలు గెలుచుకున్నారు. నిశాంత్ మాలిక్ (62 కిలోలు) కూడా రెండు పతకాలు రజతం మరియు ఒక కాంస్య పతకం సంపాదించాడు. అలాగే వైష్ణవి సింగ్ (71 కిలోలు), రేషు నగర్ (64 కిలోలు) ఒక్కొక్కరు రజత పతకాలు, అభిమన్యు కాంస్య పతకం సాధించారు. కాగా 2023లో జరిగిన గ్రాప్లింగ్ ప్రపంచ కప్‌లో భారత్ గ్రాప్లర్లు 105 పతకాలు గెలుచుకుని ఛాంపియన్లుగా నిలిచారు. అయితే ఈ సంవత్సరం పలువురు ఆటగాళ్ళు టోర్నమెంట్ నుండి వైదొలిగారు. గత ఎడిషన్ లో 88 మంది ఆటగాళ్ళు ఉండగా, ఈ ఏడాది ఆ జట్టులో దాదాపు సగం మంది మాత్రమే ఉన్నారు.




## వొడాఫోన్ ఐడియాకు ప్రభుత్వం ఉపశమన ప్యాకేజీ!

**ముంబై, జూన్ 16:** దేశంలోని అతిపెద్ద టెలికాం కంపెనీలలో ఒకటైన వొడాఫోన్ ఐడియా కష్టాలుతగ్గడం లేదు. కంపెనీకి కష్టాలు నిరంతరం పెరుగుతూనే ఉన్నాయి. అయితే, ప్రభుత్వం, కంపెనీ అధికారులు టెలికాం దిగ్గజాన్ని కాపాడటానికి ప్రయత్నిస్తున్నారు. కానీ అన్ని ప్రయత్నాలు విఫలమవుతున్నట్లు కనిపిస్తోంది. నివేదిక ప్రకారం, ప్రభుత్వం వొడాఫోన్ ఐడియా (విఐ) కోసం ఒక ఉపశమన ప్యాకేజీని సిద్ధం చేస్తోంది. కానీ దాని పెండింగ్ స్పెక్ట్రమ్ వినియోగ ఛార్జీలను మాఫీ చేయక పోతే, కంపెనీ మనుగడ సాగించే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని టెక్ నిపుణులు చెబుతున్న మాట. ఈ బకాయిలను ఈక్విటీగా మార్చడానికి ఎటువంటి ప్రణాళిక లేదని, దీనివల్ల వొడాఫోన్ ఐడియాలో ప్రభుత్వ వాటా ప్రస్తుత 49 శాతానికి పెరుగుతుందని నివేదిక పేర్కొంది. ప్రభుత్వం ఎలాంటి ఉపశమన ప్యాకేజీని ప్లాన్ చేస్తుందో తెలుసుకుందాం. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత నిర్ణయించిన ఆరు సంవత్సరాల కాలానికి బదులుగా వొడాఫోన్ ఐడియా తన ఎజిఆర్ బకాయిలను 20 సంవత్సరాలలో చెల్లించనివ్వడం ఒక ఆలోచన. ఎజిఆర్ చెల్లింపు వ్యవధిని రూ. 18,064 కోట్ల స్థిర ఆరు వార్షిక వాయిదాల నుండి 20 సంవత్సరాలకుపైగా పొడిగించాలని ఒక అధికారి చెప్పినట్లు నివేదిక పేర్కొంది. టెలికాం శాఖ ప్రకారం 2026చివరి నాటికి విఐ మొత్తం రూ.18,064 కోట్లు చెల్లించాల్సివస్తే, 2027బిల్లు రాకముందే కంపెనీవద్ద నిధులు ఉండవని చెబుతున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో నాలుగో త్రైమాసికానికి కంపెనీ నష్టం రూ.7,166.1 కోట్లుగా ఉంది. ఇది వార్షిక ప్రాతిపదికన కొంత తగ్గినా, డిసెంబర్ త్రైమాసికంతో పోల్చితే సుమారు రూ.500కోట్లుపెరిగింది. అలాగే డిసెంబర్ త్రైమాసికంలో రూ.6,609.3కోట్ల వరకు నష్టం వచ్చింది. వొడాఫోన్ ఐడియా సిఇఒ అక్షయ్ మూంద్రా 2025 ఏప్రిల్ 17న టెలికాం శాఖకు లేఖ రాశారు. ప్రభుత్వం నుంచి మద్దతు లభించకపోతే 2026 మార్చి తర్వాత కంపెనీ కార్యకలాపాలు కొనసాగించడం సాధ్యం కాదని పేర్కొన్నారు.

## యుపిఐతోనే 50% డిజిటల్ లావాదేవీలు: ప్రధాని మోడీ

**లిమాసోల్, జూన్ 16:** మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ద్వీప దేశమైన సైప్రస్‌కు చేరుకున్న విషయం తెలిసిందే. లిమాసోల్‌లో జరిగిన భారత్‌సైప్రస్ సీఈవో ఫోరమ్‌లో ప్రధాని ప్రసంగిస్తూ, ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న డిజిటల్ లావాదేవీల్లో 50శాతం యూపీఐ ద్వారానే జరుగుతున్నట్లు వెల్లడించారు. ఈ డిజిటల్ విప్లవం భారత్‌లో గేమ్ ఛేంజర్‌గా నిలిచిందని ఆర్థిక, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. భారత్ వేగంగా ఆర్థిక వృద్ధి సాధిస్తూ, ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని తెలిపారు. త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే లక్ష్యంగా ముందుకువెళ్తున్నామన్నారు. నేడు ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని అన్నారు. జీఎస్టీఅమలు, కార్పొరేట్ పన్నులకు సంబంధించిన అనేక చట్టాల్లో సంస్కరణలను ప్రవేశపెడుతూ స్థిరమైన విధానాలను కలిగిఉండడం ద్వారా భారత్‌లో వ్యాపారరంగం వృద్ధి చెందుతోందని మోదీ అన్నారు. ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, సెమీ కండక్టర్లు, బయోటెక్, గ్రీన్ డెవలప్‌మెంట్ వంటి రంగాలపై దృష్టి సారించి, దేశ తయారీ రంగాన్ని మరింత అభివృద్ధి చేయడానికి భారత ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మోదీ పేర్కొన్నారు. దీంతో త్వరలో భారత్ సెమీకండక్టర్ తయారీకి ప్రపంచ కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం భారత్ నౌకలు, వైమానిక రంగాలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తోందని ప్రధాని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలతో వ్యాపారం చేయడంలో నమ్మకంతోపాటు వారి సౌలభ్యానికి కూడా భారత ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని తెలిపారు. భారతీయ కంపెనీలు సైప్రస్‌ను యూరప్‌కు ప్రవేశ ద్వారంగా చూస్తున్నాయని మోడీ అన్నారు. సైప్రస్‌ను యుపీఐలో చేర్చడానికి కొనసాగుతున్న చర్చలను ప్రధాని స్వాగతించారు.



వాణిజ్యం

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జూన్ 16:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ పరిణామాలతో గత రెండు సెషన్ల నష్టాలు చవిచూసిన సూచీలు.. నేడు మళ్లీ పుంజుకొన్నాయి. ఓ వైపు ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న మన మార్కెట్లు రాణించడం విశేషం. ముఖ్యంగా ఐటీ, మెటల్, రియల్టీ షేర్లలో కొనుగోళ్లు సూచీలకు కలిసొచ్చింది. కీలక సూచీల ముగింపు స్థాయిలు సెన్సెక్స్ ఉదయం 81,034.45 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,118.60) నష్టాల్లో ప్రారంభమైంది. కాసేపటికే కోలుకున్న సూచీ రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 81,865.82 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 677.55 పాయింట్ల లాభంతో 81,796.15 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 227.90 పాయింట్ల లాభంతో 24,946 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.04గా ఉంది. సూచీలో అల్ట్రాటెక్ సిమెంట్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్, ఎటర్నల్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టాటా మోటార్స్, అదానీ పోర్ట్స్, సన్‌ఫార్మా నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావం అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 73 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 3435 డాలర్ల వద్ద ట్రేడైనది. ఈ స్థిరంగా ఉన్న క్రూడ్ ధరలు దేశీయ ఇంధన ధరలపై ఒత్తిడి తగ్గించే అవకాశం ఉంది. మరోవైపు బంగారం ధరల్లో పెరుగుదల సాధారణంగా మార్కెట్‌లో రిస్క్ సెంటిమెంట్‌ను సూచిస్తుంది. గత రెండు సెషన్లలో సూచీలు అమెరికాయూరప్ మార్కెట్ల ప్రతికూలతల వల్ల నష్టాల్లోకి వెళ్లాయి. బలమైన కొనుగోళ్లు, మెటల్ రియల్టీ షేర్లలో జోరు మార్కెట్‌ను పాజిటివ్ మూడ్‌లోకి తీసుకొచ్చాయి.




## కర్ణాటకలో బైక్ ట్యాక్సీలకు బ్రేక్




**బెంగళూరు, జూన్ 16:** కర్ణాటక రాష్ట్రవ్యాప్తంగా బైక్ ట్యాక్సీ సేవలు నిలిచిపోయాయి. ఆ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో ర్యాపిడో, ఉబర్, ఓలా సంస్థలు తమ సేవలను సోమవారం ఉదయం నుంచి నిలిపివేశాయి. హైకోర్టు ఆదేశానుసారం తమ సేవలను నిలిపివేస్తున్నట్లు ర్యాపిడో పేర్కొంది. సేవలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని తెలిపింది. బైక్ ట్యాక్సీ సేవలను ఉబర్ మోటో కొరియర్ కింద మార్చగా, ఓలా తన యాప్‌లో బైక్ ట్యాక్సీ అనే ఆప్షన్‌ను పూర్తిగా తొలగించింది. మోటార్ వెహికల్ చట్టంలో బైక్ ట్యాక్సీల ప్రస్తావన లేకపోవడంతో ఈ సేవలను నిలిపివేయాలంటే కర్ణాటక హైకోర్టు సింగిల్ బెంచ్ గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. జూన్15 వరకు గడువు ఇచ్చింది. ఈ అంశంపై క్యాబ్ సర్వీసు సంస్థలు సవాలు చేయగా, డివిజన్ బెంచ్ కూడా సింగిల్ బెంచ్ ఆదేశాలను సమర్థించింది. సోమవారం నుంచి బైక్ ట్యాక్సీ సేవలు నిలిపివేయాలని ఆదేశించింది. జూన్ 20లోగా దీనిపై తమ స్పందన తెలియజేయాలని కర్ణాటక ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను జూన్ 24కు వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో బైక్ ట్యాక్సీ సేవలు నిలిచి పోయాయి. బైక్ ట్యాక్సీలపై నిషేధం వల్ల గిగ్‌వర్కర్ల జీవితాలు రోడ్డున పడతాయంటూ నమ్మ బైక్ ట్యాక్సీ అసోసియేషన్ సీఎం సిద్ధరామయ్య, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి లేఖ రాసింది. దీనిపై జోక్యం చేసుకోవాలని కోరింది.

## ఆల్ టైమ్ గరిష్టానికి పసిడి

**ముంబై, జూన్ 16:** దేశీయ మార్కెట్లో బంగారం ధరలు సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. సోమవారం ఎంసీఎక్స్ (మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్)లో ఆగస్ట్ ఫ్యూచర్స్ బంగారం ధర 10 గ్రాములకు ఏకంగా రూ.1,01,078 వద్ద ఆల్ టైమ్ గరిష్ఠానికి చేరింది. ఇటీవల తొలిసారిగా తులం బంగారం ధర రూ.లక్ష మార్కును దాటిన విషయం తెలిసిందే. అంతర్జాతీయంగా ఈక్విటీ మార్కెట్లపై ఒత్తిడి, ముడిచమురు ధరలు పెరగడం వంటి అంశాలు పసిడి ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. వెండి ధరలు కూడా దాదాపు గరిష్ట స్థాయిల్లోనే స్థిరంగా కొనసాగుతున్నాయి. జూలై సిల్వర్ ఫ్యూచర్స్ కేజీకి రూ.1,06,464 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. గత ట్రేడింగ్ సెషన్‌లో దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం, వెండిధరలు సానుకూలంగా ముగిశాయి. బంగారం ఆగస్ట్‌ఫ్యూచర్స్ 1.91 వృద్ధితో 10 గ్రాములకు రూ.1,00,276 వద్ద స్థిరపడగా, వెండి జూలై ఫ్యూచర్స్ 0.57 లాభంతో కిలోకు రూ.1,06,493 వద్ద ముగిశాయి. గత వారం బంగారం, వెండి ధరలు భారీగా పెరగడానికి ప్రధాన కారణం ఇజ్రాయెల్‌ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు. దీనికి తోడు డాలర్ ఇండెక్స్ బలహీనపడటం కూడా పసిడికి కలిసొచ్చింది. పెట్టుబడిదారులు సురక్షితమైన పెట్టుబడి మార్గంగా బంగారాన్ని ఎంచుకోవడంతో డిమాండ్ పెరిగింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో క్షీణత, ముడిచమురు ధరల పెరుగుదల కూడా విలువైన లోహాల ధరలకు మద్దతునిచ్చాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా సురకిత పెట్టుబడిగా బంగారానికి డిమాండ్ పెరిగింది. ఇదే బంగారం, వెండి ధరల కదలికలను ప్రభావితం చేస్తోంది. అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం ధర ఒక ఔన్సు 3,450 డాలర్లను దాటింది. రాబోయే ట్రేడింగ్ సెషన్లలో వెండి కూడా ఇదే బాటలో పయనించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.



## ప్యాసింజర్ వాహన అమ్మకాల్లో స్వల్ప తగ్గుదల

**ముంబై, జూన్ 16:** మే నెలలో దేశీయ ప్యాసింజర్ వెహికల్ హోల్‌సేల్ అమ్మకాలు 0.80 శాతం తగ్గి 3,44,656 యూనిట్లకు చేరుకున్నాయి. గత ఏడాది ఇదే నెలలో 3,47,492 యూనిట్ల అమ్మకాలు జరిగాయని సోమవారం సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ (సియామ్) తెలిపింది. సియామ్ విడుదల చేసిన తాజా డేటా ప్రకారం, తయారీదారుల నుంచి డీలర్లకు ద్విచక్ర వాహనాల సరఫరా మేనెలలో 2.20శాతం పెరిగి 16,55,927 యూనిట్లుగా నమో దయ్యాయి. గత ఏడాది ఇదే నెలలో ఇవి 16,20,084 యూనిట్లు. దేశీయ మార్కెట్లో మొత్తం త్రిచక్ర వాహనాల అమ్మకాలు గత ఏడాది మే నెలలో 55,763 యూనిట్లు కాగా, గత నెలలో 3.30 శాతం తగ్గి 53,942 యూనిట్లుగా నమోదయ్యాయని సియామ్‌తెలిపింది. అన్ని కేటగిరీలకు చెందిన మొత్తం వాహన హోల్‌సేల్ అమ్మకాలు గత ఏడాది మేనెలలో 19,76,674 యూనిట్లుగా ఉండగా, గత నెలలో 1.80 శాతం పెరిగి 20,12,969 యూనిట్ల అమ్మకాలు నమోదయ్యాయని సియామ్ తెలిపింది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.